మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

పాలస్తీనా పదునైన బాణం జకరియా
సర్కార్ పాఠశాలలను బలోపేతం చేద్దాం
అరుణాచలేశ్వర గిరిప్రదక్షిణకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
లోపలి పేజీల్లో..

సంపుటి 07, సంచిక: 224 | సోమవారం | 15-07-2024 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

## డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం

### ర్యాలీలో మాట్లాడుతుండగా కాల్పులు



**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్ ట్రంప్‌పై దాడి జరిగింది. పెన్సిల్వేనియాలో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ట్రంప్‌పై గుర్తుతెలియని దుండగుడు కాల్పులు జరిపాడు. వేదికపై ట్రంప్ మట్లాడుతుండగా ఒక్కసారిగా ఆగంతుకుడు తుపాకీతో కాల్పులకు తెగబడ్డాడు. ఈ దాడిలో ట్రంప్ కుడిచెవికి బుల్లెట్ తగిలి గాయమైంది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది, ట్రంప్‌ను సురక్షితంగా వేదికపై నుంచి తరలించారు. ఈ ప్రమాదంలో డొనాల్ ట్రంప్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. వేదిక పైనుంచి దిగేటప్పుడు ట్రంప్ పిడికిలి బిగించి నినాదాలు చేశారు. ట్రంప్‌పై కాల్పులు జరిపిన వ్యక్తిని భద్రతా బలగాలు మట్టుబట్టాయి. ఈ కాల్పుల్లో ర్యాలీకి హాజరైన ఓ వ్యక్తి మరణించగా, మరో ఇద్దరు గాయపడ్డారు. సీక్రెట్ సర్వీస్ అధికార ప్రతినిధి వివరాల ప్రకారం, ఈ ఘటన అమెరికా కాలమానం ప్రకారం తరువాయి 2లో

### దేవుడే నన్ను రక్షించాడు

ప్రాణాపాయం నుంచి దేవుడే తనని రక్షించాడని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ అన్నారు. వెంట్రుక వాసిలో మృత్యువు నుంచి బయటపడ్డానని తెలిపారు. అమెరికా ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అల్లర్లు చోటు చేసుకోకుండా సంయమనం పాటించాలని కోరారు. 'ఊహించని పరిణామం నుంచి ఆ దేవుడే నన్ను కాపాడాడు. ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా అమెరికా ప్రజలంతా ఐక్యం కావాలి' అని సామాజిక మాధ్యమం ద్వారా ఆదివారం ట్రంప్ పిలుపునిచ్చారు.



# అద్భుత నగరాన్ని నిర్మిస్తాం

### రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతోంది

ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా జిల్లాను తీర్చిదిద్దుతాం

ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మారుస్తాం

హైదరాబాద్ మహానగరాన్ని అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయే

'కాటమయ్య సేఫ్టీ కిట్స్' పంపిణీ పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/అబ్దుల్లాపూర్‌మెట్

ప్రభుత్వం ప్రోత్సాహం లేక వివిధ కుల వృత్తుల వారు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు వెళ్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులవృత్తులు చేస్తున్న వారి ఆదాయ మార్గాలు పెంచేందుకు కృషి చేస్తోందని అన్నారు. దివంగత నేత వైఎస్‌ఆర్ హయాంలో బలహీనవర్గాల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కూడా కంకణబద్ధమై ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో తాటి,ఈత చెట్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం లస్కర్‌గూడలో కల్లు గీతకార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'కాటమయ్య సేఫ్టీ కిట్స్' పంపిణీ పథకాన్ని మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, అర్బన్ ఫైనాన్స్, ఇన్ ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డిలతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాకు మహర్దశ రాబోతోందని, ప్రపంచంలోనే అద్భుతమైన పర్యాటక కేంద్రంగా ఈ జిల్లాను తీర్చిదిద్దుతామని తెలిపారు. న్యూయార్క్ సిటీతో పోటీ పడేలా మహేశ్వరంలో ఒక అద్భుతమైన నగరం నిర్మించే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. ఊటీ కంటే అద్భుతమైన రాచకొండ ప్రాంతాన్ని ఫిల్మ్ ఇండస్ట్రీకి అణువుగా మార్చబోతున్నామన్నారు. పదేళ్లు రాష్ట్రంలో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల పార్టీ మార్పుపై సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. తెలంగాణ అభివృద్ధి కోసం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లోకి వస్తున్నారన్నారు. కాంగ్రెస్ పని అయిపోయిందన్న వాళ్లంతా..... ఇప్పుడు ఎంతమంది మిగిలారో లెక్కపెట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కొందరు తరువాయి 2లో

### హయత్ నగర్‌కు 'మెట్రో'

త్వరలోనే హయత్ నగర్‌కు మెట్రో రాబోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన అన్ని ప్రణాళికలు పూర్తయ్యాయని అన్నారు. ఫార్మా కంపెనీల కోసం సేకరించిన భూమిలో వివిధ యూనివర్సిటీలను, మెడికల్, టూరిజం, పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

## 'సంక్షేమ పథకాల అనర్హుల'కు నోటీసులు జారీ చేయొద్దు

### అసెంబ్లీలో చర్చించి తగు నిర్ణయం
### ఆ తర్వాత మార్గదర్శకాల విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల్లో పలువురు అనర్హులు ఉన్నట్టు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఇప్పటి వరకు సంక్షేమ పథకాలను లబ్ధిపొందిన అనర్హుల పట్ల తీసుకోవాల్సిన చర్యలపైన ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేయనుంది. అప్పటి వరకు అనర్హులుగా గుర్తించిన వారికి నోటీసులు జారీ చేయవద్దని జిల్లా కలెక్టర్లకు, ఆయా విభాగాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే జరగబోయే శాసనసభ సమావేశంలో సంక్షేమ పథకాల అనర్హుల లబ్ధిదారుల అంశంపైన చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా, అర్హులైన లబ్ధిదారులందరికీ అందించాలన్న ముఖ్యమంత్రి సంకల్పం మేరకు, ఈ పథకాల అమలు తీరును, తరువాయి 2లో





ఢిల్లీలో జరిగిన సిపిఐ జాతీయ సమితి సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిణామాలను వివరిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు. చిత్రంలో తెలంగాణకు చెందిన పార్టీ జాతీయ సమితి సభ్యులు

## రత్న భాండాగారం తెరుచుకుంది

### పనిచేయని తాళం చెవిలు
### మెజిస్ట్రేట్ సమక్షంలో పగులగొట్టిన వైనం
### స్ట్రాంగ్ రూమ్‌కు సీల్



**పూరీ :** దేశమంతా అత్యంత ఆసక్తిగా ఎదురు చూసిన ఒడిశాలోని పూరీ శ్రీక్షేత్ర రత్న భాండాగారం రహస్య గది తెరుచుకుంది. విలువైన వస్తువులను లెక్కించడానికి, గదులకు మరమ్మతులు చేయడానికి 46 ఏళ్ల తరువాత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటలకు ఆ రహస్య గదిని తెరిచారు. రత్న భాండాగారంపై ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు మధ్యాహ్నం 12 గంటలకు ఆలంయంలోకి ప్రవేశించారని, అంతరం పూజలు నిర్వహించిన తరువాత గదులను తెరించినట్లు ఒడిశా సిఎం కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 11 మంది మాత్రమే లోపలికి వెళ్లారు. వీరిలో రత్న భాండాగారంపై ఒడిశా ప్రభుత్వం నియమించిన కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్, ఆలయ పాలనాధికారి అరవింద పాధీ, ఎఎస్‌ఐ సూపరింటెండెంట్ డిబి గడనాయక్, పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్త్వన్, పురావస్తుశాఖ ఇంజినీర్ ఎన్‌సి పాల్, పూరీ రాజప్రతినిధితో పాటు ఐదుగురు ఆలయ సేవాయత్‌లు ఉన్నారు. కాగా, రత్న భాండాగారం లోపలి, వెలపలి గదులు తెరిచిన తరువాత వారంతా బయటకు వచ్చారు. ఎస్‌ఒపి ప్రకారం తాము అన్ని పనులు పూర్తి చేశామని, పాధీ మీడియాకు తెలిపారు. ముందుగా తాము రత్న భాండాగారం తరువాయి 2లో

## మరిన్ని ఖాళీలతో మరో డిఎస్‌సి



### ఇదే చివరిది కాదు..
### నిరుద్యోగులకు ఎటువంటి నష్టమూ కలుగొద్దు
### గత ప్రభుత్వం ఒక్క డిఎస్‌సినీ నిర్వహించలేదు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఐదు వేల ఖాళీలతో పాటు మరిన్ని ఖాళీలతో కలిపి మరో డిఎస్‌సిని నిర్వహిస్తామని, నిరుద్యోగ ఉపాధ్యాయులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్రంలో ఇదే చివరి డిఎస్‌సి కాదన్నారు. డిఎస్‌సి అభ్యర్థులు కొన్ని నెలలుగా పరీక్షలకు సిద్ధమవుతున్నందున ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ ఒక్క డిఎస్‌సి కూడా నిర్వహించలేదని విమర్శించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లోఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నదే యువతకు ఉద్యోగాల కోసమని, ఇప్పటికే తాము మూడు నెలల్లో 30 వేల మందికి నియామకపత్రాలను అందజేశామని గుర్తు చేశారు. మిగిలిన ఉద్యోగాలను ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 11 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశామని,16 వేల ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించామని వివరించారు. 19,717న మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 34 వేల మందిని బదిలీలు చేశామన్నారు. సిఎల్‌పి నేతగా తాను అసెంబ్లీ సమావేశాల్లో గత ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం, నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలోనే నోటిఫికేషన్ జారీ చేశారని, ఆ పేపర్ కూడా లీక్ అయిందని మండిపడ్డారు. మరో 13,321 మంది ఉద్యోగ నియామక ప్రక్రియ చివరి దశకు చేరిందని, ఇందులో గురుకుల పిఈటి, అసిస్టెంట్ ఇంజనీర్లు, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్లు, లైబ్రేరియన్లు, తరువాయి 2లో

## కాళేశ్వరంలో నీటి నిల్వకు ఏర్పాట్లు

### వర్షాలు కొన్ని రోజులు ఆగి ఉంటే...
### మరమ్మతు పనులు పూర్తయ్యేవంటున్న ఇరిగేషన్‌శాఖ వర్గాలు

ప్రజాపక్షం / హైదరాబాద్



రాష్ట్రంలో మరో ఐదు రోజులు వర్షాలు విస్తృతంగా కురుస్తాయని తెలంగాణ వాతావరణ శాఖ తెలుపడంతో ఇటు ఇరిగేషన్ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా సన్నద్ధం అవుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ , అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో మరమ్మతులు పూర్తి చేయించి నీటి నిలువ ఉండేలా చూడనున్నారు. నిన్న మొన్నటి దాకా వర్షాలు లేక ఇసుక మేటలు బయటికి కనిపించడంతో అటు ఇసుకను సద్వినియోగం చేసుకుందామని అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలోనే వానలు విస్తారంగా కురుస్తుండడంతో నీటి ప్రవాహాన్ని నిలువరించలేని పరిస్థితి అని కనీసం వాననీటిని అయినా వినియోగంలోకి వచ్చేలా నీటిని నిలువ చేసుకుంటామని అంటున్నారు. మరీ ముఖ్యంగా అన్నారం బ్యారేజీలోని సీపేజీ లీకేజీలకు గ్రౌటింగ్ పనులను అధికారులు విస్తృతంగా చేపట్టారు. ఎలా అంటే అలా కాకుండా ఎన్‌డిఎస్‌ఎ అధికారుల సూచనల మేరకు ఇంజనీరింగ్ తరువాయి 8లో

## నాలుగేళ్లలో ఒక్క పరీక్షా పెట్టలేదు

### ఎన్‌ఆర్‌ఎపై విరుచుకుపడ్డ కాంగ్రెస్
### మోదీకి నాలుగు ప్రశ్నలు సంధించిన ఖర్గే



**న్యూఢిల్లీ :** దేశంలో విద్యావ్యవస్థను ధ్వంసం చేయడాన్ని బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యంగా పెట్టుకున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. గత నాలుగేళ్లలో నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌ఆర్‌ఎ) ఒక్క పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదని నిలదీశారు. శనివారం నాడు ప్రధాని నరేంద్ర మోదీ ముంబయిలో మాట్లాడుతూ గత మూడు, నాలుగేళ్లలో 8 కోట్ల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిరుద్యోగంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మోదీ వ్యాఖ్యలపై ఖర్గే ఆదివారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'నరేంద్ర మోదీజీ మీరు శనివారం నాడు ముంబయిలో మాట్లాడుతూ తరువాయి 8లో

## గంజాయి మత్తులో మైనర్లు

### విద్యార్థులే లక్ష్యంగా అమ్మకాలు
### కళాశాలలు, పాఠశాలలే లక్ష్యం
### కమిషనరేట్‌లో కంట్రోల్‌రూమ్ : సిపి అంబర్ కిషోర్ ఝా



ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి



ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యార్థులే లక్ష్యంగా గంజాయి సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాలలను, కళాశాలలను ఏడ్డాగా చేసుకుని గంజాయిని విద్యార్థులకు అలవాటు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ, నగర ప్రాంతాలలో పోలీసుల కళ్లు గప్పి గంజాయిని సరఫరా చేస్తున్నారు. వరంగల్ మహా నగరంలో ఇటీవల జరిగిన పలు సంఘటనలు విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా వరంగల్ నగరంలోని పలు లేబర్ అడ్డాల వద్ద, పాడుబడిన భవనాలలో, ఖిలా వరంగల్ కోట, గుట్టల ప్రాంతాలలో విద్యార్థులు గంజాయి పీల్చుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో కొన్ని చోట్ల మైనర్లు కూడా ఉండడం ఆందోళన కలిగిస్తున్నది. ఒక వైపు పోలీసులు గంజాయి సరఫరాపై నిరంతరం ఉక్కుపాదం మోపుతున్నా పోలీసుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున సరఫరా చేస్తూనే ఉన్నారు. నగరంలో సాయంత్రం ఆరు గంటలు దాటిందంటే చాలు మత్తులో మైనర్లు సైతం ఊగి పోతున్నారు. కత్తులు,కర్రలు చేతపట్టి దారినపోయే వారిని భయభ్రాంతులకు తరువాయి 8లో

# అమెరికా చరిత్రలో అధ్యక్షుల హత్యలు

## లింకన్ నుండి కెనడీ వరకు...

**న్యూయార్క్:** అమెరికాలో తుపాకీ సంస్కృతి సర్వసాధారణంగా మారింది. త్వరలో అధ్యక్ష ఎన్నికలు జరగబోతున్న తరుణంలో మరోమారు కాల్పులు కలకలం రేపాయి. మాజీ అధ్యక్షుడు ప్రస్తుతం అధ్యక్ష రేసులో ఉన్న రిపబ్లికన్ పార్టీ అగ్రనేత డొనాల్డ్ ట్రంప్ లక్ష్యంగా కాల్పులు జరిగాయి. ఈఘటనలో ఆయన తృటితో తప్పించుకోగలిగారు. ట్రంప్‌పై హత్యాయత్నం ప్రస్తుతం అమెరికావ్యాప్తంగా కలకలం రేపింది. అయితే అగ్రరాజ్యం చరిత్రలో ఇలాంటి ఘటనలు కొత్తేమీ కాదు. గతంలో సుమారు 13 మంది అధ్యక్షులపై హత్యాయత్నాలు జరిగాయి. కొందరు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ప్రముఖ నాయకుడు అబ్రహాం లింకన్ ఒకరు. అమె రికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్‌పై వాషింగ్టన్ డీసీలోని ఫోర్డ్స్ థియేటర్‌లో కాల్పులు జరిగాయి. 1865, ఏప్రిల్ 14న జరిగిన దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. హంతకుడిని జాన్ బూత్ అనే నటుడిగా గుర్తించారు. అలాగే జేమ్స్ గార్ఫీల్డ్ 1881, జులై 2న హత్యాయత్నం జరిగింది. ఈయన దేశానికి 20వ అధ్యక్షుడు. వాషింగ్టన్‌లోని బాల్టిమోర్‌పోటోమ్యాక్ రైల్‌రోడ్ స్టేషన్ దగ్గర ఈయనపై కాల్పులు జరిగాయి. అనంతరం చికిత్స పొందుతూ అదే ఏడాది సెప్టెంబర్ 19న గార్ఫీల్డ్ చనిపోయారు. దేశ 25వ అధ్యక్షుడు విలియమ్ మెకెన్లీపైనా 1901 సెప్టెంబర్ 6న హత్యాయత్నం జరిగింది. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ అదే ఏడాది సెప్టెంబర్ 14న తుదిశ్వాస విడిచారు. అమె రికా 35వ అధ్యక్షుడు జాన్ ఎఫ్‌కెనడీపై1963, నవం బర్ 22న డాలస్‌లో దాడి జరిగింది. కెనడీ కాన్వాయ్ సాగుతున్న సమయంలో మాజీ సైని కుడులీ హార్వే ఆస్వాల్డ్... టెక్సాస్ స్కూల్ బుక్ డెపాజిటరీ భవనంలోని ఆరోఅంతస్తు నుంచి కాల్పు లు జరిపాడు. కెనడీని హుటా హుటిన ఆసుపత్రికి తరలించగా దాదాపు అరగంటలోగా ఆయన మరణించారు. ఇదిలా వుంటే 1912, అక్టోబరు 14న ఎన్నికల ర్యాలీలో మాజీ అధ్యక్షుడు థియోడర్ రూస్‌వెల్డ్‌పై దుండగుడు కాల్పులు జరుపగా ఆయన గాయాలతో బయట పడ్డారు.అదేవిధంగా మరొక మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పైనా 1981, మార్చి 30న దాడి జరిగింది. వాషింగ్టన్ హిల్టన్ హోటల్ వద్ద రీగన్‌పై ఓ దుండగుడు ఐదుసార్లు కాల్పులు జరిపాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు కానీ ప్రాణాలు దక్కించుకోగలిగారు. కాంగ్రెస్సెనషల్ రీసెర్చ్ సర్వీస్ (సీబీఎస్) నివేదిక ప్రకారం మృత్యువును జయించిన అధ్యక్షుల్లో జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ (1975లో రెండుసార్లు), రొనాల్డ్ డబ్ల్యూ రీగన్ (1981), బిల్ క్లింటన్ (1994), జార్జ్ డబ్ల్యూ బుష్ (2005) ఉన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జోబైడెన్, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్‌పైనా దాడికి ప్రయత్నాలు జరిగినట్లు నివేదిక తెలిపింది. మొట్టమొదటిసారి అధ్యక్షుడిపై దాడి ఘటన 1935లో నమోదైందని వెల్లడించింది. అప్పటి అధ్యక్షుడు ఆండ్రూ జాక్సన్‌పై పిస్టల్‌తో దాడి జరిగిందని తెలిపింది.






## బైడెన్ పిలుపుతోనే ట్రంప్‌పై హత్యాయత్నం

### రిపబ్లికన్ల ఆరోపణ

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా పెన్సెల్వేనియాలో ప్రసంగిస్తున్న సమయంలో రిపబ్లిక్ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఇది అధ్యక్షుడు జో బైడెన్, డెమొక్రాట్ల పనేనని రిపబ్లిక్ పార్టీలోని కొందరు నాయకులు ఆరోపించారు. ట్రంప్‌పై దాడి ఘటనను మరువబోమంటూ బైడెన్‌ను హెచ్చరించారు. 'ఇది తేలిగ్గా తీసుకునే అంశం కాదు. ట్రంప్ ఒక నియంత... ఫాసిస్టని, ఆయనను అడ్డుకోవాలంటూ బైడెన్ ప్రచారం సాగుతోంది. దీనివల్ల ట్రంప్‌పై హత్యాయత్నం జరిగింది' అని రిపబ్లికన్ సెనేటర్ జేడీ వాన్స్ 'ఎక్స్'లో మండిపడ్డారు. ట్రంప్, ఆయన మద్దతుదారుల మరణాన్నే డెమొక్రాట్లు కోరుకునేదంటూ పార్టీ నేత మర్జోరీ టైలర్ గ్రీనే ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్‌పై గురిపెట్టాలని జో బైడెన్ ఇచ్చిన పిలుపుతోనే ఆయనపై హత్యాయత్నం జరిగిందని ఆరోపించారు. ఇదే క్రమంలో రిపబ్లికన్ నేషనల్ కమిటీ చైర్మన్ మైఖెల్ వాట్లే ఒక ప్రకటనలో ట్రంప్‌ను తిరిగి దేశానికి అధ్యక్షుడిని చేద్దామంటూ పిలుపునిచ్చారు. దాడి తర్వాత ట్రంప్ క్షేమంగా ఉన్నారని, సత్వరమే స్పందించిన సిబ్బందికి కృతజ్ఞులమని పేర్కొన్నారు. ట్రంప్ త్వరలోనే మిల్‌వాకీతో మనతో పాటు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 'అమెరికా 47వ అధ్యక్షుడిగా ఆయనను నామినేట్ చేదాం. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా నిలిపే విజన్‌తో ట్రంప్ పనిచేస్తారు' అని మైఖెల్ వాట్లే పేర్కొన్నారు.

## 17న సియోల్‌లో భారత్, కొరియా ఎఫ్‌టీఏ చర్చలు

**సియోల్:** భారత్, కొరియా మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సమీక్షా సమావేశం ఈ నెల 17న దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో జరగబోతోంది. ఈ మేరకు రెండు దేశాల సీనియర్ అధికారులు తెలిపారు. ప్రస్తుతమున్న ఒప్పందాన్ని నవీకరించనున్నట్లు వెల్లడించారు. సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) 2010 జనవరి నుంచి అమలవుతోంది. ఇప్పటివరకు 10సార్లు సమీక్షా సమావేశాలు జరిగాయి. ఈనెల 17, 18 తేదీల్లో జరగబోయే తదుపరి సమావేశాలకు భారత బృందం తమ దేశానికి రాబోతున్నట్లు సియోల్ వర్గాలు తెలిపాయి.ఈ ఒప్పందానికి సంబంధించిన చర్చలను తాజా సంప్రదింపులతో ముగించాలని కొరియా భావిస్తోందని పేర్కొన్నాయి.

## ట్రంప్‌పై దాడి' టీషర్టులకు గిరాకీ

### హత్యాయత్నానికి కొన్ని గంటల్లోనే చైనా మార్కెట్‌లోకి...




**బీజింగ్:** అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం కూడా వ్యాపారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ట్రంప్ దాడికి సంబంధించిన దృశ్యాలతో ప్రింట్ చేసిన టీషర్టులకు గిరాకీ లభించింది. హత్యాయత్యం జరిగిన కొన్ని గంటల్లోనే ఈ టీషర్టులు చైనా మార్కెట్‌లో హల్‌చల్ చేశాయి. ఈ సోవనీర్ టీషర్టుల ఆన్‌లైన్ విక్రయాలు జోరుగా సాగాయి. చైనాలోనే కాకుండా అమెరికా నుంచి కూడా తమకు ఆర్డర్లు వచ్చినట్లు వ్యాపారులు తెలిపారు. 'ట్రంప్‌పై కాల్పులు జరిగినట్లు వార్తల్లో చూసిన వెంటనే టౌబోలో టీషర్టులను విక్రయాన్ని ప్రకటించాం. టీషర్టులపై ఫొటోలు ప్రింట్ చేసేలోపే అమెరికా, చైనా నుంచి రెండు వేలకుపైగా ఆర్డర్లు వచ్చాయి. డిజిటల్ ప్రింటింగ్ సాంకేతికత వల్ల టీషర్టుల ఉత్పత్తి, విక్రయాలు వేగంగా సాగించగలిగాం' అని టౌబో వ్యాపారి ఒకరు తెలిపారు. తమ డిజిటల్ ప్రింటింగ్ యంత్రాలు గంటకు ఎనిమిది 'ఎన్నికల సంబంధిత' టీషర్టులను ప్రింట్ చేయగలవని జిన్‌ఫ్లైయింగ్ డిజిటల్ ప్రింటింగ్ కంపెనీ వెల్లడించింది.

## రాజకీయ హింస ఆక్షేపణీయం

**బ్రస్సెల్స్/కాన్‌బెర్రా:** అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికాలో కాల్పుల ఘటనతో యావత్ ప్రపంచం ఉలిక్కిపడింది. అగ్రరాజ్య మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్యాన్ని ప్రపంచ దేశాధినేతలు తీవ్రంగా పరిగణించారు. తుపాకీ సంస్కృతి, రాజకీయ హింసను ఆక్షేపించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అమెరికాకు పిలుపునిచ్చాయి. రాజకీయహింస ఆక్షేపణీయమని పేర్కొంటూ విడివిడిగా ప్రకటనలను ప్రపంచ దేశాధినేతలు విడుదల చేశారు. ట్రంప్ త్వరగా కోలుకోవాలని వారంతా ఆకాంక్షించారు. ట్రంప్‌పై హత్యాయత్నం షాక్‌కు గురిచేసిందని, రాజకీయ హింసకు సమాజంలో చోటు లేదని నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. ట్రంప్‌కు సంపూర్ణ సంఘీభావాన్ని'ఎక్స్'లో ప్రకటించారు. 'పెన్సెల్వేనియాలో ట్రంప్ ర్యాలీపై కాల్పులు జరిగాయని, మాజీ అధ్యక్షుడికి గాయమైనట్లు తెలిసింది. ఆయన క్షేమంగా ఉన్నారని తెలిసి ఊపిరి పీల్చుకున్నా. ఆయన కుటుంబానికి, ర్యాలీలో పాల్గొన్న వారందరి యోగక్షేమాలను కోరుకుంటున్నా. సీక్రెట్ సర్వీస్ వెంటనే ట్రంప్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించడం హర్షణీయం.అమెరికాలో ఇటువంటి హింసకు స్థానం లేదు. మనమంతా ఒక్కటిగా దీనిని ఖండించాలి' అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షులు ఉర్సులా వోన్ డెర్ లెనన్, యూరోపియన్ పార్లమెంట్ అధ్యక్షులు రాబర్టా మెట్సలా, యూరోపియన్ కౌన్సిల్ అధినేత చార్లెస్ మైఖెల్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోని ఆల్బనీస్, ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్, హోండూరస్ అధ్యక్షుడు జియోమర కాస్ట్రో డి జెలయా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొడిమిర్ జెలెన్స్కీ, జపాన్ ప్రధాని కిషిదా, హంగరీ ప్రధాని విక్టర్ ఓర్బన్, భారత ప్రధాని నరేంద్రమోదీ, దక్షిణకొరియాఅధ్యక్షుడుయూన్‌సుక్,ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ దాడిని ఖండించారు.

## మరిన్ని ఖాళీలతో మరో డిఎస్‌సి

(మొదటి పేజీ తరువాయి)

జూనియర్ లెక్చరర్లు, మెడికల్ ల్యాబ్ అసిస్టెంట్ వంటి పోస్టులు ఉన్నాయని భట్టి తెలిపారు.

**నిరుద్యోగులను గాలికి వదిలేసిన గత ప్రభుత్వం**

గత ప్రభుత్వం గ్రూప్1 పరీక్ష నిర్వహించలేదని, నిరుద్యోగులను గాలికి వదిలేసిందని భట్టి విక్రమార్క విమర్శించారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి, ఓట్ల కోసం తాపత్రయపడ్డారన్నారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు నష్టపోయారని, గ్రూప్3 కూడా నిర్వహించలేకపోతే తాము అధికారంలోనికి వచ్చిన తర్వాత షెడ్యూల్ చేశామని, నిరుద్యోగులకు ఎటువంటి నష్టం కూడా కావొద్దని తాము ప్రయత్నిస్తున్నామని చెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల ప్రక్రియను వేగవంతం చేశామని భట్టి వివరించారు.

**పరీక్షలు అన్ని సార్లు వాయిదా వేదయం సరికాదు**

గ్రూప్2ను ఇప్పటికే మూడు సార్లు వాయిదా వేశారని, పరీక్షలు అన్నిసార్లు వాయిదా వేయడం సరికాదని, త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క అన్నారు. ఈ నెల 11 నుంచి డిఎస్‌సి హాల్ టికెట్లు అందుబాటులో ఉంచామని, ఇప్పటికే 2,00,500 మంది హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. డిఎస్‌సిని పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి 24 గంటలు అందుబాటులో ఉండేలా గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు.

## 'సంక్షేమ పథకాల అనర్హుల'కు నోటీసులు జారీ చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అర్హులైన లబ్ధిదారులకు మరింత మెరుగుగా, సమర్థవంతంగా పథకాలను వర్తింపచేసేలా రాబోయే శాసనసభ బడ్జెట్ సమావేశాలలో, చర్చించి, పథకాల అమలులో గుర్తించిన అవకతవకలపై చర్చించి, తగిన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ మార్గదర్శకాలను జారీ చేసే వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో చేర్చబడిన లబ్ధిదారులకు నోటీసులు జారీ చేయవద్దని,రికవరీ కోసం ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వం ఆదేశించింది.

## డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

శనివారం సాయంత్రం 6:15 గంటలకు జరిగింది. ఈ ర్యాలీకి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. అమెరికా మీడియా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేస్తూ ఉంది. దీంతో కాల్పుల దృశ్యాలు, తర్వాత జరిగిన పరిణామాలన్నీ వీడియోల్లో రికార్డయ్యాయి. బుల్లెట్ ట్రంప్ చెవి పైనుంచి దూసుకెళ్లడం, ఆయనకు రక్తస్రావం కావడం సహా అన్ని దృశ్యాలు టీవీ ప్రత్యక్ష ప్రసారాల్లో కనిపించాయి.

### దగ్గర్లో ఉన్న భవనం పైనుంచి!

కాల్పుల శబ్దం విని వెంటనే అప్రమత్తమైన ట్రంప్ పోడియం కింద చేరి తనని తాను రక్షించుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆయనకు రక్షణగా చేరి బయటకు తీసుకెళ్లారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య కారులో ఎక్కించుకుని సమీప ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన క్షేమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. దుండగుడు దగ్గర్లో ఉన్న భవనం పైనుంచి కాల్పులు జరిపినట్లు ప్రత్యక్షసాక్షి తెలిపారు. తుపాకీతో ర్యాలీకి వచ్చిన అతడు భవనంపైకి పాకడం తాము గమనించామని వెల్లడించారు.

### 'ఏదో జరుగుతోందని అర్థమైంది'

కాల్పుల ఘటన తర్వాత ట్రంప్ ట్రుత్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'కాల్పుల ఘటనపై వేగంగా స్పందించినందుకు అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బందికి ధన్యవాదాలు. ఇలాంటి చర్య మన దేశంలో జరగడం నమ్మశక్యం కావడం లేదు. కాల్పులు జరిపిన వ్యక్తి గురించి ప్రస్తుతానికి ఏమీ తెలియదు. కాల్పుల శబ్దాలు వినగానే ఏదో జరుగుతోందని అర్థమైంది. నా కుడి చెవి పైభాగం నుంచి బుల్లెట్ దొచ్చుకెళ్లింది. చాలా రక్తస్రావం జరిగింది' అని పోస్ట్ చేశారు.

### ట్రంప్‌పై కాల్పులు జరిపిన 20ఏళ్ల యువకుడు

అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తిని ఎఫ్‌బిఐ గుర్తించింది. 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్‌గా ధ్రువీకరించింది. పెన్సిల్వేనియాలోని బెతెల్ పార్క్‌కు చెందిన వ్యక్తిగా తెలిపింది. ప్రభుత్వ ఓటింగ్ రికార్డుల ప్రకారం, అతడు రిపబ్లికన్ పార్టీ మద్దతుదాడిగా నమోదు చేసుకున్నాడు. 2021 సంవత్సరంలో 15 డాలర్లను డెమొక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రోగ్రెసీవ్ టర్న్ఔట్ ప్రాజెక్టకు విరాళంగా ఇచ్చాడు. ప్రస్తుతం క్రూక్స్ ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు.

# అద్భుత నగరాన్ని నిర్మిస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని పడగొడతామంటే... ప్రభుత్వాన్ని నిలబెట్టాలని ఎంఎల్‌ఎలు తమకు మద్దతుగా వస్తున్నారని సిఎం తెలిపారు. హైదరాబాద్‌ను కాంగ్రెస్ పార్టీయే అభివృద్ధి చేసిందన్నారు. తెలంగాణను బిఆర్ఎస్ అప్పులకుప్పగా మార్చిందని, తాము ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వెళ్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఔటర్‌రింగ్ రోడ్డు, ఫార్మాఇండస్ట్రీతో పాటు..అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. గత పాలకులు డ్రగ్స్, గంజాయి తెచ్చారంటూ తీవ్రంగా ధోజమెత్తారు.

### గౌడన్నలు పోరాటానికి ప్రతీక

గౌడన్నలు పోరాటానికి, పౌరుశానికి ప్రతీకలని రేవంత్‌రెడ్డి అన్నారు. అందుకు సర్వాయి పాపన్నగౌడ్, ధర్మభిక్షం, మోహన్ గౌడ్, దేవేందర్ గౌడ్ తెలంగాణకు సేవ చేశారని గుర్తు చేశారు. కల్లు గీత కార్మికులకు అద్భుత ప్రచార నైపుణ్యం ఉందని కొనియాడారు. వానాకాలంలో గీత కార్మికులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు .అదేవిధంగా నీరా షాపులు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. గీత కార్మికుల కోసం రోడ్ల వెంబడి తాటి, ఈత చెట్లు నాటుతామని చెప్పారు. కల్లు గీస్తూ గౌడ సోదరులు ప్రమాదాలకు గురవుతున్నారని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారుగీతకార్మికుల రక్షణ కోసం ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్స్ తయారు చేయించిందని.. ఈ సేఫ్టీ కిట్స్ ద్వారా ఇకపై ఏ ఒక్క కార్మికుడు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉం డదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న వన మహోత్సవంలో భాగంగా తాటి,ఈత చెట్ల పెంపకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తన వెంట ఉన్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులకు సూచించారు. చెరువు గట్లపై కూడా ఈత చెట్లు నాటేలా ఇరిగేషన్ విభాగంతో మాట్లాడాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. చేతి వృత్తులు, కులవృత్తులపై ఆధారపడ్డ కుటుంబాలకు చెందిన పిల్లలు చట్టాలు రూపొందించే స్థాయికి ఎదగాలని అభిలషించారు. బలహీన వర్గాలు పాలకులుగా మారాలంటే అందుకు ఏకైక మార్గం చదువు మాత్రమేనని స్పష్టం చేశారు.

### ప్రత్యేక చట్టం తేవాలి : పొన్నం ప్రభాకర్

గౌడ కులంలో పుట్టినందుకు గర్వంగా ఉన్నదని, గీత కార్మిక వృత్తితో జీవనం సాగిస్తూ తాటి చెట్టు మీద నుంచి కింద పడితే ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమమవుతున్నది బిసి సంక్షేమ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గీత కార్మికుల ప్రాణాలను కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కిట్టులను పంపిణీ చేస్తున్నది తెలిపారు. గత ప్రభుత్వంలో మరణించిన కుటుంబాలకు 20 లక్షలు మంజూరు చేయలేదని ఇబ్బంది పడుతున్నారని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడంతో సిఎం వెంటనే రిలీజ్ చేయడం జరిగిందని పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తాటి, ఈత చెట్ల పెంచుకోవడానికి ప్రత్యేక చట్టం తేవాలని ఆయన కోరారు. ప్రత్యేక స్థలాలలో వనాలు పెంచే విధంగా జిఒ ను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



### మంచి విద్యను అందించాలి : శ్రీధర్ బాబు

గీత కార్పొరేషన్ ద్వారా పారిశ్రామికంగా ఎదిగేందుకు తన వంతు కృషి చేస్తానని ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కులం, కుల వృత్తుల మీద ఆధారపడుతున్న వారు తమ పిల్లలను మంచి చదువులు, చదివించడం ద్వారా ఉద్యోగాలు చేసి స్థిరపడతారని సూచించారు. భవిష్యత్తులో చదువుకున్న పిల్లలు కులవృత్తులు చేయరని, తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి విద్యను అందించాలని ఆయన తెలిపారు.

### శ్రీలంక తరహాలో తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం: జూపల్లి

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో తాటి,ఈత చెట్లు పెంచి గౌడ సోదరులకు అండగా ఉంటామన్నారు. అంతేకాకుండా శ్రీలంక తరహాలో తాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి,కల్లు గీత కార్మికుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో ఐటి శాఖను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరారు. వేలాది ఎకరాలు ఉన్నాయని,ఉ పాధి అవకాశాలు లేకపోవడం ఇబ్బందిగా మారిందని,ఈ ప్రాంతాన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఉపయోగపడుతుందని విజ్ఞప్తి చేశారు. కాటమయ్య సేఫ్టీ కిట్లను తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్,భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి,దయానంద్,ఎగ్గే మల్లేశం,ఎవిఎన్ రెడ్డి,శాసన సభ్యులు ప్రకాష్ గౌడ్,మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్,జిల్లా కలెక్టర్ శశాంక,స్థానిక మాజీ జెడ్ పిటిసి బింగి దేవదాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, సభా వేదిక ఆవరణలో ముఖ్యమంత్రి ఈత మొక్కలు నాటారు. గౌడన్నలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్,మంత్రులు సహపంక్తి భోజనం చేశారు.

# రత్న భాండాగారం తెరుచుకుంది

(మొదటి పేజీ తరువాయి)

వెలపలి గదిని తెరిచామని, అందులో ఉన్న విలవైన వస్తువులు, ఆభరణాలను ఆలయం లోపల ఉన్న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించామని, దానికి సీల్ వేశామన్నారు. ఆ తరువాత ఆధీకృత వ్యక్తులు భాండాగారం లోపలి గదిలోకి ప్రవేశించారని ఆయన చెప్పారు. అయితే అధికారుల వద్ద ఉన్న తాళం చెవిలతో ఏ ఒక్క తాళం కూడా తెరుచుకోలేదని, అందువల్ల ఎస్ఒపి నిబంధనల ప్రకారం మేజిస్ట్రేట్ సమక్షంలో మూడు తాళాలను పగులగొట్టామన్నారు. అయితే లోపలి గదిలోకి తక్షణమే విలువైన వస్తువులను మార్చకూడదని కమిటీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. రథయాత్ర ముగిసిన తరువాత వస్తువుల తరలింపును తేదీని ఖరారు చేస్తామన్నారు.

### ఉదయం ప్రత్యేక పూజలు

భాండాగారం తెరవడానికి ముందు ఉదయం శ్రీక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండిచా మందిరానికి వెళ్లి జగన్నాథుడి అనుమతి తీసుకున్నాక, లోకనాథ ఆలయంలో పూజలు చేశారు. అక్కడ ఆజ్ఞమాల (పూలమాల) తీసుకుని శ్రీచక్రం (ఖజానా గది) వద్దకు చేరుకున్నారు. అంతకు ముందు శ్రీ చక్రానికి రక్షగా ఉన్న విమలాదేవి, మహాలక్ష్మి సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఆ తల్లుల అనుమతితో రత్న భాండాగారం తెరిచారు. గదిలో సర్పాలు ఉన్నాయనే అనుమానంతో ముందు జాగ్రత్తగా స్నేక్ హెల్ప్‌లైన్, 40 మందితో కూడిన ఒడిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వెలుపల సిద్ధంగా ఉంచారు.

### 46 ఏళ్ల క్రితం తెరిచారు.

రత్న భాండాగారాన్ని చివరిసారిగా 46 ఏళ్ల క్రితం 1978లో తెరిచారు. సంపద ఉన్న పెట్టెలు జీర్ణావస్థలో ఉండే మార్చేందుకు వీలుగా 15 చెక్క పెట్టెలను అధికారులు సిద్ధం చేయించారు. వాటిలో ఆరింటిని ఆ గది వద్దకు ఆదివారం ఉదయం తరలించారు. శ్రీక్షేత్రంలో జగన్నాథుని నిత్యం 119 మాలికా సేవలు జరుగుతాయి. వీటిని నిర్ణీత వేళల్లో సేవాయత్‌లు చేపడతారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సేవలకు అంతరాయం కలగకుండా భాండాగారం తెరిచేందుకు అధికారులు ముందుగానే ఏర్పాట్లు చేశారు.

### ఆభరణాల లెక్కింపు ప్రక్రియ డిజిటలైజేషన్

ఈసారి లెక్కింపు తరువాతే జగన్నాథుని ఆభరణాల విలువపై అంచనాకు వచ్చే అవకాశం ఉంది. రత్న భాండాగారం లోని సంపదను మరో చోటికి తరలించి పటిష్ట భద్రత మధ్య లెక్కించే వీలుంది. ఆభరణాల లెక్కింపు తదితర ప్రక్రియనంతా ఒడిశా ప్రభుత్వం డిజిటలైజేషన్ చేయనుంది. ప్రస్తుతం పూరీలో రథయాత్ర జరుగుతోంది. 19 వరకు జగన్నాథ, బలభద్ర, సుభద్రలు ఆలయం వెలుపల ఉంటారు. ఈ నేపథ్యంలో చేపట్టనున్న లెక్కింపునకు ఎన్ని రోజులు పడుతుంది? అనేది అధికారులు చెప్పలేక పోతున్నారు. భాండాగారం మరమ్మతులు, లెక్కింపు ఒకేసారి జరగనుందా ? అనే వివరాలపై స్పష్టత రాలేదు.

### ఆభరణాలు ఐదు పెట్టెల్లో రహస్యంగా

పూరీ జగన్నాథుని ఆభరణాలను ఐదు పెట్టెల్లో ఉంచి, రహస్య గదిలో భద్రపరిచారు. పూర్వ మూడేళ్లు లేదా ఐదేళ్లకోసారి ఈ గది తలుపులు తెరిచి సంపద లెక్కించేవారు. చివరి సారిగా 1978 లో లెక్కించగా, 70 రోజులు పట్టింది. అప్పట్లో కొన్నింటిని వదిలేయడంతో లెక్కలపై సందేహాలున్నాయి. ఈ నేపథ్యంలో హైకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం భాండాగారం తెరిచి సంపద లెక్కించాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు కూడా దీన్ని సమర్థించింది. రహస్య గదులు జీర్ణావస్థకు చేరి, వర్షపు నీరు లీకై గోడలు బీటలు వారుతున్నందున మరమ్మతులు చేయాలని కోర్టులు 2018 లోనే పురావస్తుశాఖను ఆదేశించాయి. 2019 ఏప్రిల్ 6 న నాటి నవీన్ పట్నాయక్ సర్కారు నియమించిన 13 మందితో కూడిన అధ్యయన సంఘం తలుపులు తెరవడానికి వెళ్లగా, రహస్య గది తాళపు చెవి కనిపించలేదు. దీంతో సభ్యులు వెనుదిరిగారు. తర్వాత మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధ్యయనానికి ప్రభుత్వం జస్టిస్ రఘువీర్‌దాస్ కమిటీని నియమించింది. ఇంతలో డూప్లికేట్ తాళపు చెవి పూరీ కలెక్టరేట్ ట్రెజరీలో ఉన్నట్టు గుర్తించారు. మరోవైపు రఘువీర్ కమిటీ నివేదికను ప్రభుత్వం వెల్లడించలేదు. దీన్ని ఇటీవలి ఎన్నికల్లో బిజెపి ప్రచారాస్త్రంగా చేసుకుంది. తాము అధికారంలోకి వస్తే భాండాగారం తెరిపిస్తామన్న హామీకి కట్టుబడి , విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మందితో కమిటీ వేసింది. ఆ కమిటీ రత్నభాండాగారం తెరవాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. భాండాగారం లోపల ఎలా ఉందో ఎవరికీ అవగాహన లేదు. 48 ఏళ్లుగా అందులోకి ఎవరూ వెళ్లలేదు.

## ఇండియన్ ఆయిల్ ' స్టార్మ్-ఎక్స్' పారాదీప్ నుంచి చెన్నైకి ఫస్ట్ డెలివరీ

### రేసింగ్ కార్ల కోసం రూపొందించిన ప్రత్యేక ఇంధనం ఇదే




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఇండియన్ ఆయిల్ ప్రత్యేకంగా రేసింగ్ కార్ల కోసం రూపొందించిన హై ఆక్టేన్ గ్యాసోలిన్ ' స్టార్మ్‌ఎక్స్' ఇంధనాన్ని పారాదీప్ రిఫైనరీ నుంచి మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్ (చెన్నై)కి ఫస్ట్ డెలివరీ చేసింది. ఈ ప్రీమియం రేస్ ఇంధనాన్ని ఇండియన్ ఆయిల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఫరీదాబాద్) అభివృద్ధి చేసింది. అత్యాధునిక పారాదీప్ రిఫైనరీలో దీనిని ఉత్పత్తి చేశారు. ఇది పానిపట్ రిఫైనరీ నుంచి 2 జీ ఇథనాల్ తో సహా అధునాతన, అధిక ఆక్టేన్ రేటింగ్ గ్యాసోలిన్ స్ట్రీమ్‌లను మిళితం చేస్తుంది. దీనిని బ్యూరో వెరిటాస్ (దుబాయ్) ధృవీకరించింది. ఈ క్రమంలో ఇండియన్ ఆయిల్ ఇటీవల భారత్, అంతర్జాతీయ సర్క్యూట్‌లో టాప్‌ఎండ్ మోటార్ రేసింగ్ ఈవెంట్‌ల కోసం ప్రీమియం రేసింగ్ ఇంధనాన్ని విడుదల చేసింది. ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య స్ఫూర్తితో ఈ ప్రీమియం రేసింగ్ ఇంధనాల పరిచయం జరిగింది. మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో 2024 సీజన్‌లో ఇండియన్ నేషనల్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ 3వ, 4వ రౌండ్‌లు జరగనున్నాయి. ఈ రేసింగ్ కోసం స్టార్మ్ ఎక్స్ సరఫరా చేయడానికి ఇండియన్ ఆయిల్, మద్రాస్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్‌తో భాగస్వామ్యం కలిగి ఉంది. 3వ రౌండ్ కోసం 55 బ్యారెల్స్ స్టార్మ్ ఎక్స్ డెలివరీ చేశారు. పారాదీప్ రిఫైనరీ ఈ ప్రీమియం రేస్ ఇంధనాన్ని అభివృద్ధి చేయడంలోనూ ఉత్పత్తి చేయడంలోనూ కీలక పాత్ర పోషించింది. ఈ ఈవెంట్‌లో ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్) వీ సతీష్ కుమార్, ఎన్ సెంథిల్ కుమార్ డైరెక్టర్ (పైప్‌లైన్స్),అలోక్‌శర్మ,డైరెక్టర్(ఆర్అండ్‌డి) పాల్గొన్నారు.

## గ్రూప్-2 ఆందోళనతో పోలీసు నీడలో అశోక్‌నగర్

ప్రజాపక్షం/హైదరాబాద్: గ్రూప్2 పరీక్షలు వాయిదా వేయాలంటూ నిరుద్యోగులు చేస్తోన్న ఆందోళనల నేపథ్యంలో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు.గ్రూప్2 విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం రాత్రి మెరుపు ఆందోళనకు అభ్యర్థులు దిగారు. అశోక్‌నగర్ కేంద్ర గ్రంథాలయం నుంచి నిరుద్యోగులు చిక్కడపల్లి ఆర్‌టిసి క్రాస్‌రోడ్ మీదుగా అశోక్ నగర్ క్రాస్‌రోడ్డు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ హఠత్మరిణామంతో సమాచారం లేకపోవడం వల్ల పోలీసులు ఆందోళనలను నివారించలేక భద్రతను చేపట్టలేక పోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నుంచి చిక్కడపల్లి గ్రంథాలయం పరిసరాల్లో మఫ్టీలో పోలీసు సిబ్బందితో వాహనాలతో పహారా ఏర్పాటు చేశారు. అశోక్‌నగర్ క్రాస్‌రోడ్‌లో కూడా నిఘాను పెంచారు. అనుమానితులను ప్రశ్నించి వివరాలు సేకరిస్తున్నారు. అలాగే ఉస్మానియా యూనివర్సిటీలో కూడా పోలీసులు నిఘా పెంచారు.ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తుగా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

## గోల్కొండ బోనాల సందర్భంగా.. ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్: శ్రీ జగదాంబ మహాకాళి అమ్మవారి బోనాల సందర్భంగా గోల్కొండ పరిసర ప్రాంతాల్లో ఆదివారం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ అదనపు పోలీసు కమిషనర్ విశ్వప్రసాద్ పేర్కొన్నారు.ఈ ట్రాఫిక్ ఆంక్షలు ఈ నెల 18,21,25,28 ఆగస్టు 1,4 తేదీల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా తేదీల్లో ఉదయం 8 నుంచి రాత్రి 11 వరకు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు అమల్లో ఉంటాయన్నారు.ముఖ్యంగా..రామ్‌దేవ్‌గూడ నుంచి గోల్కొండ కోట వయా మక్కాయ్ దర్వాజ, లంగర్‌హౌజ్ నుంచి గోల్కొండ కోట వయా ఫతే దర్వాజ, షేక్‌పేట నాలా, సెవన్ టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వయా బంజారా దర్వాజ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనదారులు తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

## కొత్త సాంకేతిక పద్ధతులకు టిజి ఎన్‌పిడిసిఎల్ శ్రీకారం

### సద్వినియోగం చేసుకోండి : టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి



ప్రజాపక్షం / హైదరాబాద్ : ఉత్తర తెలంగాణ వి ద్యుత్ పంపిణీ సంస్థ (టిజి ఎన్‌పిడిసిఎల్ ) పరిధిలో వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి, అంతరాయాలను కనిష్ఠ స్థాయిలోకి తీసుకురావడానికి కొత్త సాంకేతిక పద్ధతులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా టిజి ఎన్‌పిడిసిఎల్ పరిధిలో అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33 కెవి, 11 కెవి విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నెంబర్ పెయింటింగ్ ప్రక్రియను ప్రారంభించామని సంస్థ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. టిజి ఎన్‌పిడిసిఎల్‌లో అసెట్ మ్యాపింగ్ వలన పోల్‌ల వారిగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టవచ్చునని, నిర్వహణను కూడా ట్రాక్ చేసే వీలుంటుందని అన్నారు. గతం తాలుకు అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యా లు కూడా ట్రాక్ చేసుకునే సౌల్యభ్యం ఉందని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నెంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్లి సమస్యను త్వరితగతిన పరిష్కరించవచ్చని వెల్లడించారు. దీని ద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చని, ముందస్తు సమాచారం తెలుసుకోవడానికి , సమస్యలు ఏర్పడక ముందే గుర్తించడానికి ఎంతో దోహద పడుతుందని తెలిపారు . ఇప్పటి వరకు సుమారుగా 1826 ఫీడర్లకు నంబరింగ్, డిజిటలైజేషన్, పిఎంఐ (ప్రీ మాన్సూన్ ఇన్స్‌ఫెక్షన్) పూర్తి చేయడం జరిగిందని వివరించారు . మిగతా ఫీడర్లు రాబోయే రెండు నెలల్లో పూర్తి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని తెలిపారు. ప్రీ మాన్సూన్ ఇన్స్‌ఫెక్షన్ ముందస్తు విద్యుత్ లైన్ల నిర్వహణ కార్యక్రమం కూడా పిఎంఐ యాప్‌ను పూర్తిగా సద్వినియోగపరచుకుంటూ, పోల్ నెంబర్ పెయింటింగ్ ద్వారా అసెట్ మ్యాపింగ్ చే యబడిన ఉపకరిస్తుందన్నారు. తద్వారా అన్ని రకాల విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను సమయానుసారంగ నిర్వహణ, నవీకరణ లాంటి కార్యక్రమాలు సులువుగా సమర్థవంతంగా చేయవచ్చునని అన్నారు. తద్వారా సమస్యల ను పరిష్కరించడం, అంతరాయాల సమయాని తగ్గించడం ద్వారా వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సరఫరా అందించగలుగుతామని టిజి ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విధంగా పైన వివరించిన కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా అందించడానికి, అంతరాయాలు తగ్గించడానికి అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్, పోల్ నంబర్ పెయింటింగ్, పిఎంఐ యాప్‌లు ఎంతో దోహద పడతాయని వివరించారు.

## గల్ఫ్ కార్మికుల కష్టాలు వర్ణనాతీతం: కెటిఆర్




ప్రజాపక్షం/హైదరాబాద్: వలస ఎంత వాస్తవమో.. వలసలోన దోపిడీ కూడా అంతే వాస్తవం అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. స్వర్ణ కిలారి రాసిన మేక బతుకు పుస్తకాన్ని ప్రసాద్ ల్యాబ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకావిష్కరణలో పాల్గొన్న కెటిఆర్ ప్రసంగించారు. తాను నేను స్వయంగా దుబాయ్ వెళ్ళాను.. అక్కడ ఉన్న లేబర్ క్యాంపులో కార్మికుల కష్టాలను చూశాను. గల్ఫ్ కార్మికుల కష్టాలు విన్నా.. చూసినా గుండె తరుక్కుపోతుందన్నారు. అక్కడ వారు నివసిస్తున్న పరిస్థితులను చూస్తే బాధ అవుతుంది. గతంలో గల్ఫ్ కార్మికుల కోసం పాలసీ తేవాలని ప్రయత్నం చేశాం. టామ్కామ్ సంస్థ ద్వారా కొంత ప్రయత్నం చేశాము. కానీ మరింత ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉన్నది. వలస ఎంత వాస్తవమో.. వలసలోన దోపిడీ కూడా అంతే వాస్తవం.. అది దుబాయ్ అయినా హైదరాబాద్ అయినా ఇంకెక్కడైనా. పెద్దూరు వలస కార్మికుల కోసం దుబాయ్‌లోని జైలుకు వెళ్లి కలిసి వచ్చాను. వారిని విడిపించేందుకు అనేక ప్రయత్నాలు చేసి.. సంవత్సరాల తర్వాత చివరికి ఇండియాకి తీసుకురాగలిగామని కెటిఆర్ పేర్కొన్నారు. గతంలో సుష్మా స్వరాజ్ విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల నుంచి గల్ఫ్‌కు జరుగుతున్న ఆడవాళ్ళ అక్రమ రవాణాపైన చర్చించారు.. ఆ దిశగా దాని అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలి. ఒకనాడు దేశంలో ఎక్కడ నిర్మాణం జరిగిన పాలమూరు జిల్లా నుంచి వలసలు ఉండేవి. ఈరోజు గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్ దాకా అనేక రంగాల్లో రాష్ట్రాలు నుంచి తెలంగాణకు వలస వస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో చదివే అలవాటు బాగా తగ్గుతూ వస్తుంది. ఇలాంటి సమయంలోను అన్విక్షకి సంస్థ ఈ పుస్తకాన్ని తీసుకురావడం హర్షనీయం. సమాజంలో చైతన్యం, మార్పు తీసుకురాగలిగే సాహిత్యానికి మరింత మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా పుస్తక ప్రచురణలతో పాటు డిజిటల్ మాధ్యమల ద్వారా ఆడియో పుస్తకాల ద్వారా ఈదిశగామరింత ప్రయత్నం జరగాలని కెటిఆర్ సూచించారు.

# సర్కార్ పాఠశాలలను బలోపేతం చేద్దాం

### ఎస్‌టియు రాష్ట్ర శిక్షణ శిబిరంలో ప్రొఫెసర్ కోదండరామ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాల పట్ల మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఇఒ, డిప్యూటీ ఇఒల పదోన్నతుల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసకెళ్తానని, సమస్యల పరిష్కారానికి సంఘాలన్ని కలిసిముందుకు రావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో రాష్ట్రోపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియు) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన ఎస్‌టియు రాష్ట్ర స్థాయి కార్యకర్తల శిక్షణ శిబిరానికి కోదండరామ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ బదిలీలు, పదోన్నతులతో పాఠశాలల్లో అన్ని ఖాళీలనూ భర్తీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఉపాధ్యాయవర్గం పాఠశాలలను బలోపేతం చేసేలా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉన్నాదని తెలిపారు. విద్యారంగం ప్రశంసలు పొందేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్‌టియు ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించిందని, అనేక సమస్యలను పరిష్కరించిందని కోదండరామ్ గుర్తు చేశారు. ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.పర్వత్ రెడ్డి, జి. సదానందం గౌడ్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతుల పక్రియ పూర్తి చేయడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందపర్చినట్టు సిపిఎస్. విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కోరారు. బదిలీ అయి,రిలీవ్‌కాని టీచర్లను ప్రత్యామ్నాయ పద్ధతిలో వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని డి.ఎలను సత్వరమే విడుదల చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించి, పాఠశాల పరిశుభ్రతను కాపాడాలని చెప్పారు. 40 శాతం ఫిట్ మెంట్ తో నూతన పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాగా ఒకరోజు శిక్షణ తరగతులలో భాగంగా ఎస్‌టియు ప్రస్థానం ఉద్యమచరిత్ర, ఉద్యమాలు నాడునేడు పరిస్థితులు తదితర అంశాలపైన సంఘం సీనియర్ నాయకులు పి. సుబ్బరాజు, ఎల్.సాయి శ్రీనివాస్ శిక్షణనిచ్చారు. ఈ శిక్షగా కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆట సదయ్య, జుట్టు గజేందర్,ఎవి సుధాకర్,,ఎల్.ఎం ప్రసాద్, పోల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, ఎం. నర్సింహారెడ్డి ,నీరజ, శిరీషతో పాటు 33 జిల్లాల నుండి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.



## ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలల్లో చేరండి

### బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోండి : మంత్రి పొన్న ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : గురుకుల డిగ్రీ కళాశాలలో చేరి భవిష్యత్ కు బంగారు బాటలు వేసుకోవాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న 29 డిగ్రీ గురుకుల కాలేజీల్లో విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే డ్యతోపాటు ఉన్నత ఉద్యోగాలకు అవసరమైన శిక్షణను అందిస్తున్నామని, ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, ఈ సదవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల బిసి యువత సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. గురుకుల డిగ్రీ కాలేజీల్లో విద్యార్థుల కోసం రెగ్యూలర్ కోర్సులతో పాటు ప్రస్తుతం మార్కెట్ లో ఎంతో డిమాండ్ ఉన్న ఆర్టిఫిసియల్‌ఇంటలిజెన్స్, డేటా సైన్స్ వంటి కోర్సులను ఉచితం అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి కార్పొరేట్‌రంగంలో ఉద్యోగాలు వస్తున్నాయని,మొదటి సంవత్సరం నుండి సివిల్స్, గ్రూప్స్, వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ, పిజి ప్రవేశ పరీక్ష కోచింగ్, ఉన్నత ఉద్యోగాలకు అవసరమైన కెరీర్ గైడెన్స్ అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందిస్తూ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌నిర్వహిస్తూ, ప్లేస్మెంట్స్ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, సిసిఎంబి, ఐఐసిటి, మొదలైన ప్రీమియర్ ఇన్స్టిట్యూషన్లు సందర్శించేలా ఎడ్యుకేషనల్ టూర్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాఫ్ట్ వేర్ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బిసి గురుకుల డిగ్రీ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. బిసి గురుకుల విద్యార్థులకు మెరుగైన విద్యా, న్యాయకత్వ లక్షణాలు అందించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. గురుకుల డిగ్రీ కాలేజీలో చేరే విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు అందిస్తూ పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ ఇస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యా సంస్థసొసైటీలో మొత్తం 29 డిగ్రీ కాలేజీలు ఉండగా వాటిలో విద్యార్థులకు 14, విద్యార్థినులకు 15 ప్రత్యేక కళాశాలున్నాయని మంత్రి వివరించారు. ఈ డిగ్రీ కాలేజీల్లో 31 కోర్సులు అందిస్తున్నామని, మొదటి సంవత్సరంలో 9120 సీట్లు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం సీట్లు భర్తీ చేస్తున్నామన్నారు. సీట్ల భర్తీ కోసం ఇప్పటికే రెండు విడుతలుగా కౌన్సిలింగ్ నిర్వహించామని, మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని, ఏ జిల్లా విద్యార్థులు ఆయాజిల్లాలో కాలేజీలకు వెళ్లి డిగ్రీ కోర్సుల్లో చేరవచ్చని మ మంత్రి సూచించారు.

## విద్యార్థులు, నిరుద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరపాలి

### బిఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: నిరసన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులను ప్రభుత్వం తక్షణమే చర్చకు ఆహ్వానించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని బిఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనమాట్లాడుతూ ప్రజా పాలనలో ఇంత పంతం ఎందుకని ప్రశ్నించారు. నిరుద్యోగుల ఆత్మస్థైర్యాన్ని సిఎం దెబ్బతీస్తున్నారని, మోతి లాల్ నాయక్, బక్క జడ్సన్, అశోక్ ఆమరణ నిరహార దీక్షలు చేపడితే, వారు ఏం పరీక్షలు రాశారని సిఎం అనడం ఏమిటని ప్రశ్నించారు. రైతులు గురించి మాట్లాడే వారు వ్యవసాయం చేయాలని, నిరుద్యోగుల గురించి మాట్లాడేవారు పరీక్షలు రాయాలని, కార్మికుల గురించి మాట్లాడేవారు కార్మికులై ఉండాలని ఏమైనా నిబంధనలు ఉన్నాయా అని ఎ ద్దేవా చేశారు. ఇప్పటికైనా అభ్యర్థుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందిచాలని డిమాండ్ చేశారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్య పరిష్కరించాలి

### లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తాం : ఎఐటియుసి

ప్రజాపక్షం/హైదరాబాద్ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకపోతే వేలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామనితొలగించాలని తెలంగాణ భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చెట్టుకింద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం తెలంగాణ భవన నిర్మాణ వర్కర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ జహీరానగర్ రోడ్ నెంబర్ 10లో లేబర్ అడ్డలో నూతన కమిటీని కమిటీని ఎన్నిక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన శ్రీనివాస్, యాదగిరిలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు రెన్యూవల్ సంబంధించి (బిఓసి) సాఫ్ట్‌వేర్‌లో సమస్యల కారణంగా మీసేవలో రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని,వెంటనే ఓటిపి వేలి ముద్ర విధానాన్నితొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 60 ఏళ్లు నిండిన భవన ని ర్మాణ కార్మికులకు పెన్షన్ ఇవ్వడంతో పాటు అడ్డలపైన మౌలిక సదుపాయా లు కల్పించాలని, ముఖ్యంగా మహిళలకు టాయిలెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రూ. 5ల భోజనం సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రేషన్ కార్డు లేని కార్మిక కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు ప్రతి కార్మికునికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




**35మందితో నూతన కమిటీ ఎన్నిక** : తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్‌కు సంబంధించిబంజారాహిల్స్ జహీరానగర్ రోడ్ నెంబర్ 10 లో లేబర్ అడ్డలో 35 మందితో నూతన కమిటీని కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీఅధ్యక్షులు బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్ ఎన్నికైయ్యారు. గౌరవ అధ్యక్షులు హుస్సేన్ . కార్యనిర్వహక అధ్యక్షులుగా భాస్కర్ . ఉపాధ్యాక్షులుగా. ఆంజనేయులు,వెంకటేష్ ,రాములు, రాయుడు నాయక్, భాస్కర్ నాయక్, సహాయ కార్యదర్శులుగా జి చంద్రయ్య. బక్కయ్య, సావు, శ్రీశైలం, యాదయ్య. వీరయ్య. గోపాల్ నాయక్‌తో పాటు మొత్తం 35 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

## ప్రజాభవన్‌లో వైభవంగా బోనాల ఉత్సవాలు



ప్రజాపక్షం/హైదరాబాద్: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు సతీమణి నందిని ప్రజాభవన్ లో ఈరోజు నల్ల పోచమ్మ అమ్మవారికి నిర్వహించిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ బోనాల ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విశిష్ట అతిథులుగా రాష్ట్ర మంత్రులు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ దుద్దిళ్ల శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి లు హాజరయ్యారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొనడానికి ప్రజాభవాన్ కి విచ్చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులకు భట్టి విక్రమార్క దంపతులు పుష్ప గుచ్చాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ పండితులు బోనాలకు, మహంకాళి అమ్మవారి ఘటానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మంత్రి కొండ సురేఖ,డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క సతీమణి నందిని, ఎమ్మెల్యే ఎన్ ఉత్తం పద్మావతి, తదితర మహిళ ప్రజా ప్రతినిధులు బోనం ఎత్తుకోగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు మహంకాళి అమ్మవారి ఘటాన్ని ఇంట్లో నుంచి బయటకు తీసుకువచ్చి జోగిని తలపై ఎత్తారు. డిప్యూటీ సీఎం నివాసం నుంచి ప్రజాభవన్ ఆవరణలో ఉన్న నల్ల పోచమ్మ దేవాలయం వరకు డబ్బు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాల మధ్యన బోనాలను ఎత్తుకెళ్లారు. అనంతరం అమ్మవారికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు బోనంలో ఉన్న నైవేద్యాన్ని సమర్పించారు.

**సిఎం ప్రత్యేక పూజలు:** ప్రజా భవన్ లోని నల్ల పోచమ్మ దేవాలయంలో ఉప ముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్కతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ శ్రీధర్ బాబు జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ సలహాదారు వేంరెడ్డి నరేందర్ రెడ్డి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిణి రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా సురక్షితంగా ఉండాలని సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలతో రాష్ట్రం విలసిల్లాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ పండితులు ముఖ్యమంత్రి కి రాష్ట్ర మంత్రులకు వేద ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్, ఆది శ్రీనివాస్, శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్, వీర్లపల్లి శంకర్, శ్రీహరి, గణేష్, కాలే యాదయ్య, మక్కాన్ సింగ్ ఠాగూర్, ఎన్ ఉత్తం పద్మావతి, పర్ణిక రెడ్డి, మదన్మోహన్రావు, రామ్మోహన్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, విజయ రమణారావు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

## 19 నుంచి 22 వరకు అరుణాచలేశ్వర గిరి ప్రదక్షిణకు తెలంగాణ ఆర్టీసి ప్రత్యేక బస్సులు




ప్రజాపక్షం/హైదరాబాద్ : తమిళనాడులోని అరుణాచలేశ్వరంలో కొలువుదీరిన మహా శివుడిని గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు ఆర్‌టిసి శుభవార్త చెప్పింది. గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల కోసం తెలంగాణలోని హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, వరంగల్, కరీంనగర్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల నుంచి తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 21న గురుపౌర్ణమి కాగా, 19వ తేది నుంచి 22వ తేది వరకు అరుణాచలేశ్వరంకు ప్రత్యేక బస్సులను నడుపునున్నట్లు అధికారులు తెలిపారు.ఇందుకు సంబంధించి ప్రత్యేక ప్యాకేజీని సైతం అధికారులు ప్రకటించారు. ఈ ప్యాకేజిలో భాగంగా కాణిపాక వరసిద్ధి వినాయక స్వామితో పాటు శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్‌ను సైతం సందర్శించే సౌకర్యాన్ని కల్పించారు.అరుణాచల గిరి ప్రదక్షిణ ప్యాకేజీ బుకింగ్ కోసం tsrtconline.in వెబ్ సైట్‌ను సందర్శించాల్సిందిగా ఆర్‌టిసి అధికారులు సూచించారు.

# నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్/గజ్వేల్ :గ్రూప్స్,డిఎస్‌సిఅభ్యర్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమం త్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. త మ డిమాండ్లను సాధించుకునేందుకు అభ్యర్థులు, నిరుద్యోగులు రోడ్ల మీదకు వచ్చి నిరసనలు తెలియజేస్తుంటే, ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం శో చనీయమన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సహా పలు ప్రాంతాల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉండే ప్రాం తాల్లో పోలీసు బలగాలను మోహరించడం, ముందస్తు అరెస్టులు చేయడం లాంటి చర్యలు అప్రజాస్వామికమ ని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటం వెనుక రాజకీయ శక్తులు ఉన్నాయని నిందారోపణలు చేయడం ఆక్షేపణీయ మన్నారు.ప్రతి అంశాన్ని రాజకీయం కోణంలో చూసే పద్ధతిని విడనాడాలని సూచించారు. అభ్యర్థులు, నిరుద్యోగుల జీవితాలను వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సానుకూల దృక్పథంతో చర్చలకు ఆహ్వానించాలని,సహృదయంతో వారి బాధను, డిమాండ్లను అర్థం చేసుకుని పరిష్కరించాలని కోరారు. గ్రూప్ 1 మెయిన్‌కు 1 : 100 నిష్పత్తిలో అభ్యర్థులను అనుమతించాలన్నారు. గ్రూప్ 1 పరీక్ష యు.పి.ఎస్.సి తరహా ప్రతి సంవత్సరం ఉండదని, రాష్ట్ర స్థాయి సివిల్స్ పరీక్ష కావడంతో ఆశావాహుల సంఖ్య పెరిగిందని తెలిపారు. పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండడంతో అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.జిఒ 46 ద్వారా ఏర్పడిన సమస్యలను పరిష్కరించి, నిరుద్యోగులకు న్యాయం చేయాలని హరీశ్ రావు ప్రభుత్వాన్ని కోరారు.



### కాళేశ్వరం నీటితో రైతుల సాగునీటి కష్టాలు తీర్చండి

రాష్ట్ర ప్రభుత్వం పంతాలు, పట్టింపులు, బేషజాలకు వెళ్లకుండా కాళేశ్వరం నీటితో రైతుల సాగునీటి కష్టాలు తీర్చాలని రాష్ట్ర మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సూచించారు. ఆదివారం గజ్వేల్ లో శ్రీ మహంకాళి ఆషాడి జాతర మహోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్న క్రమంలో మేడిగడ్డ వద్ద నిల్వ ఉండే 40వేల క్యూసెక్కుల నదీ ప్రవాహం నాలుగు మోటార్లు ప్రా రంభించి గేట్ల ద్వారా మిడ్ మానేరు, అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులను నీటితో నింపవచ్చని అన్నారు. అనంతరం చెరువులు, కుంటల ద్వారా నీటిని మళ్ళించి పంట పొలాలకు నీరు అందించాలని కోరారు. దీంతో సాగునీటి క ష్టాలతో పాటు తాగునీటి కష్టాలు కూడా తీరుతాయని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా ప్రతి ఏటా జరిగే శ్రీ మహంకాళి జాతర బోనాల మహోత్సవం అ ద్భుతంగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుండగా, ఇందులో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త, పాలక మండలి చైర్మన్ శ్రీధర్ రావు, స్థానిక కౌన్సిలర్ బాలమణి శ్రీనివాస్ రెడ్డిలు ఆలయ ప్రాంగణాన్ని సిసి రోడ్డు, ఉత్సవ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. శ్రీ మహంకాళి అమ్మవారి కృపతో వర్షాలు ంసవృద్ధిగా పడాలని ఆకర్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ము న్సిపల్ చైర్మన్ రాజమౌళిగుప్త, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మా దాసు శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి డాక్టర్ మల్లేశం, కౌన్సిలర్లు ఉప్పల మెట్టయ్యగుప్త, గోపాల్ రెడ్డి, తలకొక్కుల భాగ్యలక్ష్మి, గుంటుకు శిరీష రాజు, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, బొగ్గుల చందు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



# సాహితీ విహారి

# నియంత అంతం



సురవరం సుధాకర రెడ్డి

నియంత అంతం ఒక రాజకీయ ఊహా చిత్రానికి ప్రతిబింబం. ఈ నవల ఆసక్తికరమైన పుస్తకం. సుప్రసిద్ధ జర్నలిస్ట్ రచయిత, ఆకార్ పటేల్ ఈ నవల రచయిత. నాకు తెలిసినంతవరకు ఆకార్ పటేల్ కాల్పనిక సాహిత్యం రాసే రచయిత కాదు. సమకాలిన సామాజిక రాజకీయ సమస్యలపై ఆయన మంచి పుస్తకాలు రాశారు. అందువల్ల ఈ నవల ఆసక్తిని కలిగిస్తుంది. తన రచనల కారణంగా ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొన్న ఆకార్ పటేల్ సాహసిక రచన ఇది. ఈ పుస్తకాన్ని జర్నలిస్టు రచయిత విశ్లేషకులు ఎన్ వేణు గోపాల్ అనువదించారు. సంక్లిష్టమైన పుస్తకానికి సరళమైన అనువాదం చేశారు.

ప్రజాస్వామ్యాన్ని మలయాళంలో జనాధిపత్యం అంటారు. డెమోక్రసీకి బహుశా అది సరైన అర్థం కావచ్చు. కానీ వాస్తవానికి అనేక దేశాలలో అది ధనాధిపత్యంగా, మతోన్మాద ఆధిపత్యంగా, కులాధిపత్యంగా నడుస్తుందని అందరికీ తెలిసిన విషయమే.

అలాంటి ఒక ప్రభుత్వ అధినేత నియంతగా పరిపాలన సాగిస్తాడు. అధికారంలో ఉన్న వారికి వంది మాగధులు, ఆధునిక భాషలో చెంచాలు అనేక మంది ఉంటారు. ఆయనను దేవదూత అంటారు. తనలాంటి అద్భుత నాయకుడు భూత భవిష్యత్తు వర్తమాన కాలంలో లేడని ఆయన భావిస్తాడు. పొగడ్తలు విని విని ఆయన తాను నిజంగా దైవాంశ సంభూతుడిగా భావించుకుంటాడు. కొంతమందికి పాటలు, సంగీతం, మంచి మాటలు వినడం కంటే తమ సొంత గొంతును వినడం ఇష్టం. ఆయనకి కూడా సొంత గొంతు చాలా ఇష్టం. అందుకే గంటలు గంటలు మాట్లాడుతాడు. గిట్టని వారు ఆయనను వాగాడంబరుడు అంటారు. ఆ పెద్దాయన ఒక ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని జరిపి అక్కడే హఠాత్తుగా మరణిస్తాడు. దేవుని చేత ఎంపిక చేయబడిన వ్యక్తి హఠాత్తుగా మరణిస్తే ఆయన చెప్పులలో దూరటానికి ఆయనకు దగ్గర వ్యక్తులు ప్రముఖులు చేసే ప్రయత్నాలు, ఎత్తులు పై ఎత్తులు ఎలా ఉంటాయో పెద్దాయన ఖాళీని భర్తీ చేసే ప్రయత్నాలు ఏ ఏ రూపంల్లో ఉంటాయో ఊహాచిత్రమే ఈ నవల కిస్సాకుర్సీకా మొదలవుతుంది.

ఆత్మ స్తుతి పరనింద ఎరగని మహాత్ముడిని నేను, జ్ఞానం లేని పరమ శుంఠ నా ప్రత్యర్థి అని ప్రత్యర్థులను బూతులు తిట్టడం, తనకంటే పూర్వం పాలించిన వారు అసమర్థులని నిరంతరం ప్రసంగించే పెద్దాయన చెప్పిన పని చేయడం తప్ప ఆలోచనలు చేసే అలవాటు సాంప్రదాయం లేని ఆయన అనుచరులు గందరగోళంలో కూరుకుపోతారు. పెద్దాయన కుడి భుజం అనుకునే జయేష్‌కు మరొక స్వామీజీ కి మధ్య కాసేపు ముసుగులో గుద్దులాట రాజకీయ ఘర్షణ జరుగుతుంది. దేశ అధ్యక్షురాలు న్యాయసలహాదారుల సూచనలతో పార్టీ సమావేశం జరిపి నాయకుడిని ఎన్నుకుంటే ప్రమాణస్వీకారం చేయిస్తానంటుంది. జయేష్‌కు ఆగ్రహం కలుగుతుంది. ఎవరికి ఎంతమంది మద్దతు అనే విషయంలో గందరగోళం ఉంటుంది. రహస్య ఓటింగ్ అంటే జయేష్‌కు భయం కలుగుతుంది. నాయకుడిని ఎన్నుకునే వరకు కొంత వ్యవధి అవసరమని అధ్యక్షురాలు హఠాత్తుగా ఒక అనామిక మహిళ మీరాను తాత్కాలిక నాయకురాలిలా నియమిస్తుంది. ఆమెకి ఇష్టం లేకపోయినా అంగీకరిస్తుంది. ఆమె వృత్తిరీత్యా లాయరు. నిజాయితీపరురాలు. విదేశాలలో ఉన్నపుడు వివాహం కాకుండా సహజీవనంతో ఒక కుమార్తె కు జన్మనిస్తుంది. ఆమె పేద రైతులు నిర్వహిస్తున్న పోరాటాల తరుపున వాదించే లాయరు. ఆమె ఆమె కూతురు కూడా లాయర్. లాయర్స్ కలెక్టివ్ తరపున ఆమె కూడా పేద రైతుల కేసులు వాదిస్తుంది. వివాహం కాకుండా ప్రధానికి కూతురు ఉందని జయేశ్ మీడియాకు లీకులు చేసి సంచలనం కలిగిస్తాడు. ఆమె నేరుగా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడి అవన్నీ నిజమేనని అది ఎందుకు సరైనదో అని వివరించుకుంటుంది. ప్రజలు సానుకూలంగా స్పందిస్తారు. జయేష్ ఎత్తుగడ బ్యాక్ ఫైర్ జౌతుంది. కొత్త నాయకురాలు మీరా కుమార్తెను, ఆమె సహచరులను జయేష్ అరెస్టు చేయిస్తాడు. అయినా ఆమె లొంగదు. చట్టం తన పని తాను చేస్తుందని ప్రధాని వ్యాఖ్య ప్రజలకు నచ్చుతుంది. మీరా మంత్రివర్గం పునర్ వ్యవస్థీకరణ జరిపి జయేష్ ను తొలగిస్తుంది. దిగ్భ్రాంతి చెందిన జయేష్ తన అనుచరులతో ఒక ఫైవ్ స్టార్ హోటల్లో క్యాంపు నిర్వహిస్తాడు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు దాడి చేసి ఎక్కువ మందిని విడుదల చేస్తారు. స్వామీజీ తనకు సమయం కొరకు తాత్కాలికంగా కొత్త ప్రధానికి మద్దతిస్తాడు. తనకు సమయం కోసం ఈ ఎత్తుగడ వేసాడు. భూసేకరణ చట్టాన్ని సవరించేందుకు సభ సమావేశానికి నాయకురాలు నిర్ణయిస్తే అనుచరులు సభ్యులు లోపలికి పోకుండా ద్వారానికి అడ్డంగా పడుకొని సభ జరగనివ్వరు. పార్లమెంటరి ప్రజాస్వామ్య డొల్లతనాన్ని ఈ నవలలో ఆకర్ పటేల్ బహిర్గతం చేసే ప్రయత్నంలో ప్రజా వ్యతిరేక భూసేకరణ చట్టానికి సవరణ కోసం, ప్రతిపక్ష పార్టీ, ప్రాంతీయ పార్టీలు డిమాండ్లు డబ్బు అడగటం తదితరాలు వివరించారు. ప్రజాస్వామ్య రూపంలో వచ్చే ఫాసిజం దానిని ఎదుర్కునే బూర్జువా పార్టిలు, శక్తులు, ఇతర ప్రజాస్వామ్య శక్తులను నాణేనికి రెండు వైపులా ఉన్నట్లు చూపిస్తే, అది నిరాశను కలిగిస్తుంది. బూర్జువా ప్రజాస్వామ్యం ప్రజలను మోసపుచ్చాడానికి నిరంతరం ప్రయత్నిస్తుంది. దాని బలహీనతలను, ప్రజా వ్యతిరేకతను,బహిర్గతం చేయడానికి నిరంతరం పోరాటం అవసరం. ఉదాహరణకు అధికార కాంగ్రెసును బలపరిచేందుకు వామపక్షాలు రాజ భరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ, బొగ్గగనుల జాతీయకరణ ఒకసారి సాధిస్తే, 2004 లో యు.పి.ఎ. 1ప్రభుత్వాన్ని బలపరడానికి కామన్ మినిమమ్ ప్రోగ్రామ్ (కనీస ఉమ్మడి కార్యక్రమం) ద్వారా సమాచార హక్కు, గ్రామీణ ఉపాధి హామీ చట్టం అటవి హక్కుల చట్టం తదితరాలు సాధించగాలిగారు. ప్రజలను సమీకరించేందుకు ఊపిరు తీసుకునెందుకు, పోరాడేందుకు ఫాసిస్టు శక్తుల ఓటమి అవసరం. దానికి అనేక పరిమితులు ఉన్నప్పటికీ మరొక మార్గం లేదు. నాయకురాలు విసుగెత్తి రాజీనామా చేయటానికి వెళుతుంది. రాజకీయ గందరగోళం పెరుగుతుంది. దానితో నవల ముగిస్తుంది. నియంత మరణించగానే సమస్యలన్ని పరిష్కారం కావన్న చేదు సత్యం పాఠకులకు మింగుడు పడక పోవచ్చు. వ్యవస్థతో చిన్న ప్రజాలకుల మార్పులు కూడా అంగీకరించని స్వార్థపర శక్తుల దారుణ ప్రజా వ్యతిరేక ఎత్తుగడలు యథాతథస్థితిని నిలబెట్టేందుకు అడ్డంకులు సృష్టించి తాత్కాలిక ప్రధాన మంత్రిని రాజీనామాచేయక తప్పనిపరిస్థితిని కల్పిస్తారో నవ ల ప్రధాన ఇతివృత్తం. నవల చదువుతుంటే వివిధ పాత్రలు వారి పాత్రను బట్టి ఎవరెవరో ఊహించుకోవచ్చు రాజకీయ ఊహాజనత కల్పన కథ ఆసక్తిగా ఉంది. రాజకీయ అంశాల నవల రాయటం రాజకీయ విశ్లేషణను చాలా తేడాఉంది. ఆకార్ పటేల్ అందులో కూడా విజయం సాధించాడు. నవల పేరు నియంత అనంతరం అని ఉంటే బహుశా మరింత సమన్యాయంగా ఉండేదని నా అభి ప్రాయం. ఈ పుస్తకాన్ని మలుపు బుక్స్ వారు ప్రచురించారు. వారు గతంలో కూడా అనేక మంచి పుస్తకాలు ప్రచురించారు. వాస్తవాలను చేదు సత్యాలను మన ముందుంచే ఈ నవల తప్పక చదవవలసిన పుస్తకం.

# పాలస్తీనా పదునైన బాణం జకరియా

అక్కడ బాంబులు కురవడానికి ప్రత్యేక కాలాలంటూ ఏవీ ఉండవు. సమయాసమయాలు అంతకంటే లేవు. నిత్యం దాడులే... భూమిపై కళ్లు తెరిచీతెరవక శాశ్వతంగా మూసుకుపోతున్నాయి. నిశ్శబ్దం పలాయన మంత్రం పఠిస్తుంది. భీకర శబ్దాలు, ఆర్తనాదాలు, హాహాకారాలు, ఆకలి కేకలు నిగిడితన్ని ఒళ్ళు విరిచుకుంటాయి. ఆశ ఎక్కడో మూలకు నక్కి కూర్చుకుంటుంది. భీకరమైన యుద్ధ గోష... శిధిలాల కింద మరణంతో పోరాడుతున్న శరీరాల నుంచి మాంసాన్ని పెకళించుకుపోవాలని చూసే రాబందుల రెక్కల చప్పుడు. అక్కడ నిత్యం మారణహోమే. ప్రతిక్షణం భయానక దృశ్యమే. అదే పాలస్తీనా... శతాబ్దాల అణచివేతల చీకటి కోన. నిత్యం రక్తసిక్తమవుతున్న పాలస్తీనాలో నెలకొన్న దుర్భర పరిస్థితులపై ఎంతో మంది రచయితలు స్పందించారు. అద్భుతమైన తమ రచనల్లో పాలస్తీనియన్ల దయామయ జీవితాలను ఆవిష్కరించారు. అలాంటి కవుల్లో ముందుగా జకరియా మహమ్మద్ పేరును ప్రస్తావించాలి. అతను ఆధునిక అరబిక్ కవిత్వానికి ఓ చిరునామా. పాలస్తీనియన్ల గుండె చప్పుడు. తన దేశాన్ని, తన ప్రజలను, తనకు వారసత్వంగా లభించిన సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి కొత్త కోణంలో చూపించాడు. జకరియా విప్లవాల బాట పట్టలేదు... కానీ, విప్లవాత్మక మార్పుల కోసం నిరంతరం శ్రమించాడు. అతను ఆయుధాలు ధరించి, ప్రధాన శత్రువు ఇజ్రాయెల్‌పై తిరుగుబాటు చేయలేదు.. కానీ, నిరసన గళాన్ని 2023 ఆగస్టు 2న తుది శ్వాస విడిచే వరకూ నిర్విరామంగా వినిపించాడు. పాలస్తీనాలోని నాబ్లస్ పట్టణంలో 1950లో జన్మించిన జకరియా బాగ్దాద్ విశ్వవిద్యాలయంలో అరబ్ సాహిత్యాన్ని అభ్యసిస్తున్న సమయంలోనే, ఆ భాషలో రచనలు చేయడం ప్రారంభించాడు. 1975లో పట్టా పొందిన తర్వాత ఇరాక్, జోర్డాన్, లెబనాన్, సిరియా, సైప్రస్, ట్యునీషియా తదితర దేశాల్లో విస్తృతంగా పర్యటించాడు. ప్రవాస జీవితాన్ని గడిపాడు. ఎన్నో సాహిత్య పత్రికలకు సంపాకత్వం వహించాడు. పాలస్తీనా మహాకవిగా పేర్కొనే మహమూద్ దార్విష్‌తో కలిసి 'అల్ కార్మెల్'కు సహ సంపాదకత్వం వహించడం జకరియా సామర్థ్యానికి, అతని ఆధునాతన ఆలోచనా సరళికి అద్దం పడుతుంది. జర్నలిస్టుగా, సంపాదకుడిగా, రచయితగా, అభ్యుదయవాదిగా పేరుప్రఖ్యాతులు సంపాదించుకున్న అతను, సుమారు ఇరవై ఐదు సంవత్సరాల సుదీర్ఘ ప్రవాసం తర్వాత, 1994లో తిరిగి పాలస్తీనాకు తిరిగి వచ్చి, అక్కడే స్థిరపడ్డాడు. సొంత గడ్డపైనే ప్రాణాలు విడిచాడు. 'అల్ అయాన్ అల్ మౌవాతిమా' (నల్లటి కన్ను), 'అస్సా అల్ రయీ' (గొర్లకాపరులు) వంటి అద్భుత రచనలు ఆయన కలం నుంచి జాలువారాయి. విస్తృతంగా కవితా సంకలనాలను వెలువరించాడు. అతని రచనల్లో పాలస్తీనా సాంస్కృతి కనిపిస్తుంది. సమాజ తీరుతెన్నులు పలుకరిస్తాయి. మతమైనా.. అభ్యుదయమైనా... ప్రజాహితమైనా.. నిర్భయంగా తన అభిప్రాయాలను వెల్లడించడం జకరియా వంటి రచయితలకు మాత్రమే సాధ్యం. ఈజిప్టు, అరేబియన్ ద్వీపకల్పానికి చెందిన ఇస్లామిక్ మత సంబంధ అంశాలపై అనేక వ్యాసాలు రాశాడు. అతను తన ముందుతరంలోనేగాక, సమకాలీన రచయితల్లోనూ భిన్నమైన ఆలోచనా సరళిని ప్రదర్శించాడు. అనుకున్నది నిర్భయంగా, నిర్మొహమాటంగా వెల్లడించాడు. కవులే సమాజ నిర్మాతలు.. వారే అసలైన హీరోలు అనే అభిప్రాయానికి దూరంగా ఉన్నాడు. కవులు విప్లవకారులనే అభిప్రాయాన్ని ఖండించాడు. తమను తాము స్వాతంత్ర్య యోధులుగానూ, పాలస్తీనా సంరక్షులుగానూ పేర్కొనే రచయితల జాబితాలో జకరియా కనిపించడు. అతని రచనల్లో పాలస్తీనా హృదయ స్పందన వినిపిస్తుంది. జాతి భారాన్ని తామే మోస్తున్నామని ప్రకటించుకుంటూ, ప్రచారాలు చేసుకునే కవుల దరిదాపుల్లోకి కూడా వెళ్లలేదు. ఇజాలకు తలొగ్గకుండా, నిజాలను మాత్రమే తన రచనల్లో ప్రస్తావించాడు. వాటినే ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆధునిక అరబ్ కవిత్వానికి అసలుసిసలైన ప్రతినిధిగా ఎదిగాడు. అతని ఆలోచనలు పాతతరం కవుల రచనల కంటే ఎంతో భిన్నంగా, ఉన్నతంగా ఉండేది. ప్రతిపదంలోనూ ఆత్మవిశ్వాసం ధ్వనించేది. భాషపై పట్టు... సమాజంపై అవగాహన... నిజాలు వెల్లడించాలనే తపన.. ఇవే ఇతర కవులతో పోలిస్తే జకరియాను ప్రత్యక వర్గంలో నిలిపాయి. పాలస్తీనా ప్రజల బాణమైన జకరియా రచనల్లో మచ్చుకు కొన్ని ఉదాహరణలు...



అనంతమైన ఆశయాలను.. పరిస్థితుల కారణంగా చిన్న పరిధిలో కూరుకపోయిన వర్తమాన పరిస్థితులను ప్రస్తావిస్తూ..

'నేను నక్షత్రాన్ని,
చిన్న నక్షత్రాన్ని
కాంతి నా శరీరం నుండి
స్రవిస్తున్నది' అంటూనే...
'కాదుకాదు.. నేనో చిన్న చీమను,
ఒక నిఘంటువు పదాలన్నీ
ఇంటి దగ్గర నెమ్మదిగా కొరుక్కు తినడానికి
చిన్న దవడలతో
మోసుకెళ్తున్న చీమను' అని వ్యాఖ్యానిస్తాడు. ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తూ, వారి సమస్యలను ప్రపంచానికి తెలిపేందుకు పదాలను కొరుక్కుతినడమే ఊహ అద్భుతం. మృత్యువుకు వెరవని గుండెధైర్యం ఉంది కాబట్టే..



'మృత్యువన్నది వేరే లేదు..
వెనకనుండి వచ్చి అకస్మాత్తుగా
నీ కళ్ళు మూసే స్నేహితునిలా,
ఒక చిన్న మేఘం నిన్ను దాటి పోతుంది
నీ కళ్లని కప్పేస్తూ... అంటాడు. మృత్యువుతోనూ దోస్తీ చేసే గుణం ఆయనది. మృత్యువును జకరియా నల్ల మేకతో పోలుస్తూ, దాని పాలు పిండుకొని, తాగుతుంటే, దాని కళ్లల్లో నీరు ప్రవహిస్తాయని పేర్కొంటాడు. మృత్యువన్నది లేదంటూ రేగుచెట్టు ఉన్నదని, దాని ఒంటి నిండా ముళ్లున్నాయని చెప్తాడు. అది భుజాల మీద గాయాలు చేస్తూ, గద్దలకు దారినిస్తుందని చెప్తాడు.

'ఎవరినీ నీ గాయానికి
కుట్లు వెయ్యనీయకు
గాయం నీది
దారం నీది
వాటి మధ్య నిరంతరాయంగా
కారుతున్న రక్తం నీ ఆలోచనలు'... నిజమే, సమస్య మనదైనప్పుడు ఎవరో వచ్చి సహాయం చేస్తారనుకోవడం అవివేకం. అణచివేతకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లే పోరాడాలి. దోపిడీని వారే అడ్డుకోవాలి. భవిష్యత్తుపై ఆలోచన చేయాలి. విస్పష్టమైన వ్యూహాలను సిద్ధం చేసుకోవాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, వెనుకడుగు వేయకుండా లక్ష్య సాధనకు ప్రయత్నించాలి. ఎంతకాలం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తాం? ఎంతకాలం దోపిడీని కొనసాగిద్దాం? అని ప్రశ్నిస్తాడు జకరియా. 'నీ పెదవులను ద్రాక్షరసంతో బందీగా చేసి అమ్మకానికి పెట్టారు' అని పాలస్తీనియన్ల దుర్భర పరిస్థితులను వివరిస్తాడు. నాడే కాదు... నేటికీ పాలస్తీనాలో అవే సమస్యలు. అదే దోపిడీ. అదే అణచివేత. అదే మారణహోం. హమాస్ ఉగ్రవాదుల ఏరివేత పేరుతో ఇజ్రాయెల్ జరుపుతున్న అకృత్యాలకు అంతం లేకుండాపోతున్నది. ఇవే పరిస్థితులను జకరియా తన రచనల్లో పొందుపరిచాడు. శవాల చావిడీకి వెళ్లి, రిఫ్రిజిరేటర్లలో తమవారి కోసం వెతుకులాట పాలస్తీనియన్ల జీవితంలో ఓ భాగమైంది. ఇది దారుణం. ఇది అన్యాయం. మానవత్వానికి విఘాతం.

సత్యశ్రీ

ఈ వారం కవితలు

## ఏమని చెప్పను!?

చెప్పడానికి,
కొత్తదేమైనా ఉంటే చెప్పమంటావా!
ఏముంది, చెప్పడానికి!
కాలు విరిగిన అవిటివానిలా
కుంటి నడక నా జీవితం.
దారి పొడుగునా శత్రుయోధుల్లా
కత్తులు దూస్తున్నట్టు కొత్త సమస్యలు.

మనసు పొరల్లో
నా లోపలి మనిషి దాచి ఉంచిన
ఎన్నో చేదు అనుభవాలను
ఎవరికైనా చెప్పుకోవాలని ఉంది.
ఇంకొకరి ఏడుపు నాకెందుకని అనుకోని,
నన్నొక శాంతచిత్తుడ్ని చేసే
ఒకరి భుజం మీద, శిరసుంచి
మనసారా ఏడవాలని ఉంది.
ఒక్క భుజమూ ఖాళీలేదిక్కడ.
ఎందుకంటే, అందరూ నాలాగే.
అవే కళ్ళు,అదే కన్నీటి కడలి.
కర్చీఫ్ మారితే మార్చొచ్చు అంతే.

నీతో చెపుతున్న ఈ మాటలు విని
అశాంతిగా ...
అటునిటు ఊగుతున్న చెట్లు కూడా
నా నయనాలను చూసి
మునుల్లా ఆగి మౌనం ఆశ్రయించాయి.

ఇంకా చెప్పమంటావా!
ప్రతి మనసూ ఒక అడవి,
మొదట ఏ దారీ లేనిది.
బంధాల,అనుబంధాల వేటలో
ఎన్నో దారులు,మరెన్నో తుఫానులు.
ఆపై ఆవహించిన చిమ్మచీకటిలో
పెనుదుఃఖమే.

హొయలు,హొయలుగా పయనించే
ఈ జీవన నౌక ఏ దుఃఖసంద్ర తీరాన ఆగునో?
ఉండనా మరి.

వేమూరి శ్రీనివాస్
9912128967

## తిరుమల

తిరుమల తిరుమల తిరుమల
తిరుగులు మలుపుల తిరుమల
ఆదిశేషుని మడతల పడగల
ఏడుకొండల పై వెంకన్న కోవెల

గోవిందుడు నిలిచిన ఇల భూతల స్వర్గం
దివి నుంచి భువికి దిగివచ్చిన స్వర్గధామం
రాత్రి పగలు నిలకడలేని మార్గం
భక్తులకు చూపు సన్మార్గం

ప్రతి నుదుటిపై అగుపించే తిరునామం
తలపించే నీ మంగళ రూపం
విడువక చేయి నీ నామస్మరణం
తరింప జేయును భక్తుల జీవనం

ఏడుకొండల వెంకటేశ్వరుడా
ఎంతో దవ్వు నుండి నిన్ను చూడ
ఏతెంచుచుందురు నిత్యం నీ భక్తులు
ఏమిటో మొక్కుకుంటారు మొక్కులు

మొక్కులు ముడుపులు చెల్లించినా
చీమలవలె భారి దారి కట్టి నడిచి వచ్చినా
క్షణమైన మనసార నిను వీక్షించ నీయరే
గడియైన నీ గడప ముందు గడపనీయరే



ధ్వజస్తంభం దర్శించి నంతనే
పరవశంచిపోవు ప్రతి భక్తుని ఎదద
వెండి వాకిలి బంగారు వాకిళ్ళు
ధర్శన భాగ్యానికి ఆహ్వానించే ముంగిళ్ళు

అసలు కన్నా కొసరే ముద్దని
కొసరి కొసరి చెల్లించే వడ్డే చెల్లని
తీరని నీ అప్పులకుప్పకు నిదర్శనం
మరల మరల కోరుకునే నీ దర్శనం

పి.బక్కారెడ్డి
9705315250

## బోనం ఎత్తిన తెలంగాణ



మహానగరంలో మహంకాళికి బోనాలు
భాగ్యనగరంలో బల్కంపేట బోనాలు
బోనమెత్తిన భాగ్యనగరం
ఆషాడంలో హైదరాబాదులో బోనాలు
డప్పులతోదరువు తో దండిగా పూజలు!!

సికింద్రాబాద్ లో శివసత్తులఆట పాటలు
పసుపు కుంకుమతో తల్లి కి పూజలు
గ్రామ గ్రామాన ఘనంగా బోనాలు
సాక పెట్టి సంతోషంగా ఉండాలని
కోరే భక్తులు
బైండ్ల ల్లో ఆటపాటలు!!

తల్లికి పల్లె పల్లెనా పట్నాలు
సబ్బండ వర్గాలు జరుపుకునే పండుగ
పోతరాజుల కొరడాలు
తీన్మార్ దరువుల గనాలు
మహంకాళి బోనాలు!!

దేవులపల్లి రమేశ్
9963701294

## ఆకలి సూర్యుడు

ఎన్ని దుఃఖాల ముసురో
తుఫానులా వచ్చేస్తుంది!
వణుకుతూ ముడుచుకున్న
గుండె గుడిసెలో
ఆకలి వేడిసూర్యుడు
చల్ల బడుత లేదు !

ఎడతెరిపిలేని ఆకలి
అడుగులన్ని ఆసరాగా
ఎముకలన్ని దుస్తులుగా
కుదురుగా ఉండలేక
ఎండిపోయిన కంచాల ముంగిట
వెతుకులాటలో
కడుపు నిండుటకోసం..
ఎక్కడో ! ఓ చినుకుజడిలో
మట్టిరేణువు కింద
ఓ కునుకు కోసం..
కనులన్నీ కూడా
నిరంతరంగా
ఆకాశం వైపు చూస్తున్నాయి
ఓ మెతుకు బతుకు కోసం...

అదే నేల
అదే ఆకాశం
అదే గాలి
అదే నీరు అయినా
ఆకలికి లేని కులం
బతుకి లేని మతం
ఖాళీ కడుపును నింపిన
దాఖలాలు లేవు

జీవన పోరులో
బంధించలేని కాలక్రమమున
వెలుగు చీకట్ల గొడవతల
మోయలేని జీవన చిత్రాలెన్నో
విధివంచిత వెలుగు నీడన
ఆసరాలేక ఆకలి సూర్యుడు
ఉదయిస్తూనే ఉన్నాడు

డాక్టర్ పగిడిపల్లి సురేందరు
8074846063

# గుప్పెడంత జీవితంలో ఒక మాట



డా. చిటికెన కిరణ్ కుమార్
9490841284

కవిత్వం అంటే ఒక నిర్దిష్ట ప్రామాణికతను, తన అంతరంగంలో ఉన్న సంఘర్షణను సూటిగా వ్యక్తం చేస్తున్న వారితో ఒకరైన తుల శ్రీనివాస్ ప్రత్యేకత చెప్పుకోదగినది. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో తుల యాదయ్య, సుధేష్ట దంపతులకు శ్రీనివాస్ జన్మించారు. శ్రీనివాస్ ఉపాధ్యాయ వృత్తి బాధ్యతతో పాటు సాహిత్య ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. తను ఇటీవలే వెలువరించిన 'చింతల తొవ్వ' కవితా సంపుటిని పరిశీలించగా...

**నేనే ఓ కవిత్వంలో....**

నేను కవిత్వం కానిదెప్పుడూ కరిగి పారనిదెప్పుడూ.../బాధల్ని నింపుకున్న భావాన్ని నేను భారాన్ని మోస్తున్న భాషను/ ప్రయత్నంగానో, అప్రయత్నంగానో/ అవ్యక్తంగా గోచరిస్తున్న దృశ్యాన్ని/ అనునిత్యం చరిస్తున్న అదృశ్యాన్ని/ నేను పదమైమారని కవనాన్ని గాత్రమై సాగని స్వరాన్ని/కాలేకడుపుల ప్రేవుల నవ్వడి/ సమాజకుడ్యంపై లిపిగా చెక్కే అది అక్షర శిల్పిని/ అన్ని బాధ్యతలలో కంటే కవి యొక్క ప్రత్యేక స్థానం సవివరంగా తెలియజేసిన కవనమిది.

**ఋణబంధం కవితలో...**

అమ్మవని చెప్పడానికి కడుపున/ మోయవైతివి నాయినవని చెప్పడానికి/ భుజాన తిప్పవైతివి/ఇద్దరి బాధ్యతలూ నెత్తికెత్తుకొని అంత/ ఎత్తున నిలిపిన నీవు/ అవడానికి మాత్రమే అన్నవు/అమ్మ తనకడుపున తొమ్మిదినెలలు/ మోస్తే ఆపై అయిదేళ్లు వీపున మోశావు/ ఎంగిలిపాలుజీకి నీ ఎనకాల/ నడిచి నోన్ని ఎత్తుపల్లాలన్నీ/ నీ ఏలుపట్టుకు దాటినోన్ని/అమ్మానాన్నల అనుబంధంతోపాటుగా అన్నయొక్క ప్రత్యేకతను తెలియజేసిన కవణంలో అన్నదమ్ముల బంధాన్ని మస్కబాడుతున్న సమాజ బంధాలలో మరోసారి తెలియజేశారు.

**గుప్పెడంత జీవితం కవితలో...**

ఎన్ని మహాయుగాలు యాతనపడి/ ఎన్ని మహాప్రళయాలు దాటుకుని/ విశ్వం తన ఆకృతి చెక్కుకుందో.../ఎన్ని యుగాలు పోగేసుకుని ఎన్ని/ విలీన విస్ఫోటనాలతో భూమి తన/ రూపాన్ని దిద్దుకుందో.../ఎన్ని సహస్రాబ్దాల కలగా ఎన్ని/ సంవేదనల జతగా వసంతం/ ఇక్కడకొచ్చి వాలిందో.../ నీవు అడుగు పెట్టడానికి ముందే/ జరిగిన అనంతకోటి పరిణామాల్లో/ మనుగడ కోసం నీవు చేసిన పోరాటం/ అస్తిత్వం కోసం నీవుపడ్డ ఆరాటం./ ఆవగింజలో అనంత పరిమాణమే/భూమి అనేక ఇంకా పరిణామాలలో మానవ పాత్రను కవి తెలిపారు.

**రైతుకష్టం కవితలో...**

ప్రసవానికి పుట్టింటికచ్చిన పెద్దబిడ్డ/ లెక్కనె ఫాల్గుణమాసంలో/ పాల్పోసుకున్న వరికంకి... /ఉగాది పండగ ముందే అచ్చినట్లు సూత్తెనె/ కడుపు నిండి నట్టైతది/బాయిలగుండు బైటవడ్డదాక/ పయిలంగుండాలని... తుమ్మ కింది/ మషెమ్మకు ముడుపు దీసిగట్న/ గాలివానకు కరావ్ గాదాయె,/ రేటుగూడ నయంగనే వుండె పోరి/ లగ్గానికి సావ్కారి కాడ దెచ్చిన అప్పు/ కాయితం గీసారి ఎట్లైన/ కతమయిద్దనుకున్న పదినెలలు మోసి కన్నంక బాలింత రోగమచ్చినట్టు/ ఆర్నెల్ల సెమటకష్టం అమ్ముకునేలోపె/ దాని కడుపుల మన్ను వొయ్య,/ మాయదారి రోగంవంట గొర్లమంద/ మీద తోడేల్లెక్క దున్కింది/ బూతంలెక్కనె బయపెట్టవట్టింది/ అందరి బత్కులు ఆగంజేసింది. అహర్నిశలు పొద్దును చూసుకుంటూ కాలానుగుణంగా పంటను తన గుండె గా కాపాడుకుంటూ జీవనం సాగిస్తున్న రైతు యొక్క కష్టాన్ని కళ్ళకు కట్టినట్లు చూపారు.పురిటి మట్టి, ఊపిరి దీపం, గుప్పెడంత జీవితం, పావన గంగ,మట్టి పూల చెట్టు, తాత చెప్పిన కథ,నాయనమ్మ ఒక్కసారి వచ్చి పోవే, పూలు లేని చెట్టు, తీయటి జ్ఞాపకం, తీయటి జ్ఞాపకం, ఓ స్నేహితుడి కథ, క్షమించు తల్లి, మనసంతా నువ్వే, అప్పుడే తెలిసింది, ఓ మనిషి కావాలిప్పుడు, వలసవేతలు. ఇలా 'చింతల తొవ్వ ' తుల శ్రీనివాస్ రచించిన కవితా సంపుటిలో 45 కవితలలో ప్రతి కవిత కవితాత్మకంతో కూడుకున్నదే... సమాజాన్ని తన కోణంలో చూస్తూ వస్తువు ఎంపికపై ప్రత్యేకత కలిగిన కవి శ్రీనివాస్. ఇలాంటి వ్యక్తిత్వ సంపన్నతను ఆవిష్కృతం చేస్తున్న కవిత్వం ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తుందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కవి తుల శ్రీనివాస్ నుండి మరిన్ని రచనలు వెలువడాలని ఆశిస్తూ అక్షరాభినందనలు.



# నల్లగొండలో నాకబంది



**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** పట్టణ పరిధిలో అర్ధ రాత్రి పోలీసుల బూట్ల చప్పుళ్ళు.. స్థా నిక ఇండ్ల తలుపులను తట్టి సోదాలు..ఏమి జరుగుతుందో అని తెలియక ప్రజలు కాస్త అయోమయానికి గురయ్యారు..నిద్ర నుంచి మేల్కొన్న ప్రజల ఇండ్ల ముందు ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వా ధీనం చేసు కొని ఆయా పోలీస్ స్టేషన్‌లో ఉం చారు..శని వారం అర్ధరాత్రి శాంతి భద్రతల పరిరక్షణ,నేర నియంత్రనే లక్ష్యంగా పట్టణ కేంద్రం లో డిఎస్‌పి కె.శివరాంరెడ్డి ఆధ్వర్యంలో వన్ టౌన్, టు టౌన్, రూరల్ పోలీసుల సంయుక్తంగా 14 టీమ్ లుగా ఏర్పడి నాక బంది నిర్వహించారు .బహిరంగ ప్రదేశాల్లో మద్యంపానం సేవిస్తూన 100 యువ కులను పట్టుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఇండ్ల కు పంపించారు. అదేవిదంగా సరియైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేని దాదాపు 80 వాహనా లు స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి శివరాంరెడ్డి మా ట్లాడుతూ జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్ ఆదేశాల మేరకు స్పెష ల్ డ్రైవ్‌లు నిర్వహించారు. సరియైన ఆధారాలు, నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్య లు తప్పవని హెచ్చరించారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం పానం సేవించి అసాంఘిక కార్యకలాపా లకు పాలు పడుతున్నారని అలాంటి ప్రదేశాలలో నిత్యం పోలీస్ నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాపక్షం కథానికి స్పందన

## నిషేధిత గుట్కాల పట్టివేత




**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా వ్యాప్తంగా నిషేధిత గుట్కాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయంటూ ప్రజాపక్షం మెయిన్‌లో రాసిన వార్త కథానికి అధికారులు స్పందించారు. సూర్యాపేట పట్టణ ఇన్ స్పెక్టర్ జి రాజ శేఖర్, ఎస్ఐ మహేందర్‌లు ఆది వారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని శంకర్ విలాస్ సెంటర్ లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రెండు ఆటోలు అనుమానస్పదంగా వస్తుండగా వాటిని ఆపి తనిఖీ చేయగా ప్రభుత్వం నిషేధిత గుట్కా, కైని, టోబోకో ప్యాకెట్ బస్తాలను గుర్తించారు. అట్టి వాహనంతో పాటు కూరగాయల మార్కెట్ లోని మంజు కిరాణం, బేకరి షాపులో తనిఖీలు చేయగా అక్కడ మరికొన్ని గుట్కా బస్తాలను పట్టుకున్నారు. దుకాణ నిర్వహకులు మాయదేవర శివసత్తి గత కొంత కాలంగా కర్నాటక ప్రాంతం నుండి పెద్ద ఎత్తున గుట్కాలను కొనుగోలు చేసి అతని షాపులో నిల్వ ఉంచి ఇతర చిరు వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ గుట్కా నిల్వలను స్వాదీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన గుట్కాల విలువ సుమారు 11లక్షలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## అధిక రాబడికి ఆశపడి మోసపోవద్దు

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి : జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజపక్షం /నల్లగొండ :** నకిలీ స్టాక్ మార్కెట్ యాప్ లో పెట్టుబడి పెట్టి అధిక రాబడికి ఆశపడి మోసపోవద్దని జిల్లా.ఎస్ పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. అధిక రాబ డుల వాగ్దానాలతో మోసగాళ్లు సోషల్ మీడియా ద్వారా బాధితులను ఆకర్షిస్తున్నారని, జెఫరీస్ ఎంటర్ప్రైస్ ,సాక్షి సింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్ ద్వార ఎవరైన డబ్బులు వేరు వేరు బ్యాంక్ ఎకౌంట్స్ లలో డబ్బులు వేయించుకొని, నమ్మించి వాట్సాప్ ద్వార పరిచయం అయి అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాలని వాట్సాప్ కాల్ ద్వార మాట్లాడుతూ, వాట్సాప్ గ్రూప్లు క్రియేట్ చేసి నమ్మించి పెట్టుబడి పెట్టిల చేసి, అధిక లాభాన్ని చూపించి డబ్బులు పెట్టిన తరువాత వాటిని విత్ డ్రా కు అవకాశం ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఇటువంటి మోస పూరిత నకిలీ స్టాక్ మార్కెట్ యాప్ పై అప్రమత్తంగా వుండాలి, ఇలాంటి ఒక సంఘటన పై ఒక బాడితుడు కంప్లైంట్ చేయగా కేతేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేయటం జరిగింది. దీని లో భాదితుడు ఎక్కువ లాభాలు ఆశించి పైన తెల్పిన జెఫరీస్ ఎంటర్ప్రైస్ ,సాక్షి సింగ్ మోతీలాల్ ట్రేడ్ వంటి నకిలీ మొబైల్ యాప్ లో సుమారు పదకొండు లక్షలు వరకు పెట్టుబడి పెట్టి మోస పోయినాడు. కావున నల్లగొండ జిల్లా ప్రజలు ఇలాంటి సంఘటనలు ముందుగానే గుర్తించి నకిలీ స్టాక్ మార్కెట్ యాప్ వైపు ఆకర్షించ వద్దు , అట్టి వారిని ముందుగానే గుర్తించి వారి కాల్స్‌ను బ్లాక్ చేయడం మంచిది అన్నారు.సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మకూడదు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి మోసాలకు గురి అయితే వెంటెనే సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి కాల్ చేసి మీకు అందుబాటులో వున్న పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించాలని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## గంజాయి అరికట్టడంలో అధికారులు విఫలం

ఎఐవైఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల కేంద్రంలో గంజాయి కుకెన్ లాంటి మాద కద్రవ్యాలను అరికట్టడంలో పోలీస్, పంచాయతీ అధికారులు విఫలమయ్యారని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆరోపించారు.ఆదివారం మునుగోడు పట్టణ సిపిఐ నిర్మాణ సమావేశం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. 15సంవ త్సరాలు పైబడిన విద్యార్థులు యువత గంజాయి, కుకెన్ లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి మ త్తులో మునిగిపోతున్నారని, వాటిని అరికట్టాల్సిన పోలీసులు, పంచాయ తీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలో అనేక కిల్లికొట్టులల్లో కొంతమంది గంజాయి తో పాటు గుట్కా పాన్ పరాకులు సప్లై చేస్తున్నారని ఆరోపించారు. గ్రామ చివరి ప్రాంతాల్లో యువత బైకులపై సంచరిస్తూ మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వీరిపై నిఘా పెట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ఇటీవల పోలీస్ స్టేషన్లో వీధుల్లో గంజాయికి బానిసలైన వారు సైర్య వివాహార చేశారన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతిమండల కార్యదర్శి చాపల శ్రీను మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలని అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని కోరారు.గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు .ఎండి జానీ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు దుబ్బ వెం కన్న, రేవెల్లి అంజయ్య, పాలకూరి యాదయ్య,దుబ్బ సైదులు, మునుగోటి లింగస్వామి,ఎల్లస్వామి,గడ్డం నరేష్,బోయపర్తి యాదయ్య, దుబ్బ ప్రమోద పాల్గొన్నారు.

## చెత్తాచెదారం వేస్తే చర్యలు

మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రామంలో చెత్త చెదారాలను వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎటువంటి ఇబ్బం ది కలగకుండా కళాశాల గ్రౌండ్‌లో ఆదివారం చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు మున్సిపల్ కార్మికుల చేత చెత్తాచెదారంనూ శుభ్రం చేయించారు. సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఆదివారం క్లీనింగ్ కార్యక్రమం 7 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. చాలామంది తమ చెత్తాచెదారాలను గ్రౌండ్లో వేస్తూ, అసంఘటిత కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోళ్ల గంగాధర్, వెలుగు సురేందర్, నాగారం శంకర్, కరీం తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీలకు పనిదినాలు కల్పించాలి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సంవత్సరానికి 200రోజుల పనిదినాలు కల్పించడంతో పాటు రోజుకు రూ.700ల కూలీ ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు.కేంద్రప్రభుత్వం చేస్తున్న కుట్రను తె.వ్య.కా.స సాగనివ్వబోదని, జిల్లావ్యాప్తంగా ఉపాధి కూలీలకు సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.దేశంలో మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో హర్యానా రాష్ట్రంలో రూ.312లు ఉండగా తెలంగాణలో మాత్రం కేవలం రూ.172లు మాత్రమే ఉన్నద న్నారు.జాతీయ ఉపాధిహామీ చట్ట పనుల్లో పౌరుల పర్యవేక్షణ, పారదర్శకత పెంచేందుకు 2021 మేలో కేంద్ర గ్రామీణ అభివృద్ధిశాఖ నేషనల్ మొబైల్ మాటరింగ్ సాఫ్ట్‌వేర్ ప్రారంభించారని దీంతో నిర్దేశించిన సమయంలోపు రోజుకు రెండు సార్లు ఫోటో అప్‌లోడ్,జియోట్యాగ్‌లతో కూడిన కార్మికుల హజరు రికార్డు చేయాల్సిఉండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దేశంలో అనేక చోట్ల నెట్‌వర్క్ అందుబాటులో లేక పోవడంతో కొన్ని సందర్భాల్లో మొబైల్‌ఫోన్‌ల నెట్ పనిచేయకపోవడంతో కష్టతరంగా మారందన్నారు.ఉపాధి కూలీలు పనిచేసేటప్పటికి కూలీ రావడం లేదని,దేశవ్యాప్తంగా కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని,60 ఏళ్లు నిండిన ఉపాధి కూలీలకు నెలకు రూ.6వేల చొప్పున ఫించన్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## బిజెవైఎం కార్యకర్తల అరెస్ట్ సరికాదు





**ప్రజాపక్షం/తుర్కపల్లి:** రాష్ట్రంలో నిరుద్యోగులకు, విద్యార్థులకు అన్యాయం చేస్తూ, ప్రివెంటివ్ అరెస్ట్ పేరుతో రాష్ట్రంలో విచ్చ లవిడిగా విద్యార్థులను అరెస్ట్ చేయడం సరికాదని బిజెవైఎం జిల్లా కార్యదర్శి మేకల పాండుయాదవ్ మండిపడ్డారు. అశోక్ నగర్‌లో డీఎస్సీ నిరుద్యోగుల చేసిన నిరసనకు (ఉద్యమానికి )ఎటువంటి సంబంధం లేకున్నప్పటికీ, అదేవిధంగా అబ్దుల్లాపూర్‌మెట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎక్కడ అడ్డుకుంటామో అనే అపోహతో తుర్కపల్లి లో బీజేవైఎం కార్యకర్తలను ఆదివారం తెల్లవారజామున 5గంటలకు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ నిర్బంధించారని తెలిపారు. ఆదివారం బోనాలపండగ ఉండగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువజన నాయకులను అరెస్ట్ చేయడం సరికాదన్నారు. తెలంగాణలో హిందువులు చేసుకునే అతిపెద్ద పండుగ బోనాల పండుగలో విద్యార్థి నాయకులు పాల్గొనకుండా అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వీరిలో అధికార ప్రతినిధి కందుకూరి వేణు, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి బానోత్ శ్రీకాంత్ నాయక్, ఉపాధ్యక్షులు గోగికార్ శ్రీను, కార్యవర్గ సభ్యులు బోయిని కృష్ణ, ఉన్నారు. **మోటకొండూరులో:** డిఎస్‌సి పరీక్షలు వాయిదా వేయాలంటూ హైద్రా బాద్‌లో నిరుద్యోగులు జరుప తలపెట్టిన ధర్నాకు వెళ్ళు తున్న నేపథ్యంలో బిఆర్ఎస్‌వై, బిజేవైఎం నాయకులను మోటకొండూరు మండల కేంద్రంలో పోలీసులు ముం దస్తుగా అరెస్టు చేశారు. బిఆర్ఎస్‌వై మండల అధ్యక్షుడు బీస క్రిష్ణం రాజు, ఆలేరు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి జివికలపల్లి వెంకటేశ్, భూమండ్ల సతీష్, శనిగరం ప్రదీప్ తదితరులు ఉన్నారు.

## గుట్టుగా గుడుంబా తయారీ

దొరికితే దొంగ అమ్మితే ఆదాయం..



**ప్రజాపక్షం/చందంపేట :** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో గుట్టు చాటుగా గుడుంబా రోజురోజుకు ఎ క్కువ అవుతుందని పలువురు స్థానిక ప్రజలు తెలిపారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీ తండాలలో విపరీతంగా గుడుంబా తయారు చేస్తున్నారని, ఎక్సైజ్ అధికారులు పలుమార్లు గుడుంబా బట్టీలపై దాడులు చేసిన ఆపే పరిస్థితి లేదన్నట్లుగా గుడుంబాన్ని తయారు చేస్తున్నారని తెలిపారు. మండలంలో ఏ గ్రామంలో చూసిన విపరీతంగా గుడుంబా దొరుకుతుందని తక్కువ ధరకు గుడుంబా వస్తుండడంతో యువత కూడా గుడుంబాకు బానిసలవుతున్నారని వాపోతున్నారు. మండలంలో చాలా తండాలు, గ్రామాలు గుడుంబా తయారీకి కేంద్రాలుగా మారాయి. మధ్య వయస్సుతో పాటు యువకులు సైతం మత్తుకు బానిసలై కుటుంబాలు రోడ్డున పడేపరిస్థితి నెలకొంది. కొన్ని తండాలలో గుడుంబా తయారీ కుటీర పరిశ్రమగా మారిందని, కొన్ని కుటుంబాలు గుడుం బా తయారీ ప్రధాన వృత్తిగా,ఆదాయ వనరుగా చేసుకొని వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు .అప్పట్లో అధికారులు పటిష్టంగా చర్యలు తీసుకోవడం వలన గు డుంబా తయారీకి తాత్కాలిక బ్రేకులు పడ్డాయని, పలుమార్లు గుడుంబా తీసుకెళ్లే బండ్లను కూడా సీజ్ చేసినప్పటికి ఆ తర్వాత నిర్లక్ష్యం వహించడంతో తిరిగి గుడు ంబా తయారీ, రవాణా ఊపందుకుందన్నారు. గతంలో అధికారులుగు దీనిని అరికట్టడంతో విజయవంతం అయ్యారని అదే ఒరవడిని నూతనంగా వచ్చిన అధికారులు కొనసాగించకపోవడంతో మరల గుడుంబా తయారీ, రవాణా పెరిగిందనే అభిప్రాయం వెలువడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహ్మమారి అయిన గుడుంబా తయారీని అరికట్టి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## చెత్త బండి వస్తలే...
# సేకరణ చేయట్లే

ఇండ్ల ముందు పేరుకుపోయిన చెత్త



**ప్రజాపక్షం/వేములపల్లి:** స్వచ్ఛభారత్ స్వచ్ఛ తెలంగాణ నినాదంతో ప్రతి గ్రామానికి గ్రామపంచాయతీ తరపున ఏర్పాటు చేసిన చెత్త ట్రాక్టర్లు గ్రామంలో రోజుకో బజారు తిరుగుతూ చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లో చేరవేయాలనేది ప్రభుత్వం ఉద్దేశం, కానీ గత కొద్దిరోజులుగా మండలంలో పలు గ్రామాలలో చెత్త ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరించే పరిస్థితి లేకుండా పోయిందని ఆయా గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు, ఆదివారం శెట్టిపాలెం గ్రామంలోని ప్రజలు చెత్త బండి వస్తదేమో అని చెత్త కుప్పలుగా పోగు చేసి ఎదురుచూస్తున్న సంఘటన చోటుచేసుకుంది, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వచ్ఛ తెలంగాణ ద్వారాగ్రామపంచాయతీ సిబ్బంది సేకరించే విధానాన్ని తుంగలో తొక్కారా అని ప్రజలు వాపోతున్నారు . అసలు గ్రామాల్లో చెత్త సేకరించే విధానం కొనసాగుతుందా? లేదా పాత పద్ధతిలోనే ఇంటి ముందర పెంటదిబ్బలు ఏర్పాటు చేసుకోవాలా అనే అనుమానాలను ప్రజలు వెళ్లబుచ్చుతున్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే మందుల సామేల్ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/తిరుమలగిరి:** తెలంగాణ ఉద్యమకారురుడు, తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ జన్మదిన వేడుకలను ఆదివారం మున్సిపల్ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశంలు తెలంగాణ చౌరస్తాలోని అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావుపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ వ్యాప్తంగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మార్కెట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వై నరేష్, మున్సిపల్ చైర్ పర్సన్ చాగంటి అనసూయ రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జుమ్మిలాల్ నాయక్, జిల్లా నాయకులు సుంకర జనార్ధన్‌లు గజమాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, కందాల దామోదర్ రెడ్డి, పేరాల వీరేష్, కందుకూరి అంబేద్కర్, మూల రవీందర్ రెడ్డి, మండల పార్టీల అధ్యక్షులు, మాజీ ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచ్, ఎంపిటిసి, గ్రామశాఖల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**తుంగతుర్తిలో:** తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు 65కేజీల భారీ కేక్ కట్ చేసి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, నల్లు రామచంద్రా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెక్రటేరియట్ ముట్టడికి టిఎస్‌పి మద్దతు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థులు, నిరుద్యోగులు, బీసీ సంఘాల ఆధ్వర్యంలో నేడు(సోమవారం) చేపట్టే సెక్రటేరియట్ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కర్నాటక సిఎం సిద్ధరామయ్య సమక్షంలో ప్రవేశ పెట్టిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచకుండానే త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతామని మహబూబ్‌నగర్ సభలో సీఎం ప్రకటించడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం డిఎస్‌సి పరీక్షలను వాయిదా వేయడంతో పాటు గ్రూప్ 2,3 ఉద్యోగాలను పెంపు కోసం నిరుద్యోగుల డిమాండ్‌ను పరిగణలో తీసుకోవాలన్నారు. సెక్రటేరియట్ ముట్టడికి విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాల నాయకులు, సామాజిక ఉద్యమకారులు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టిఎస్‌పి జిల్లా అధ్యక్షులు వర్రె ఆంజనేయులు, నాగరాజు, శ్రావణ్, పరుశురాం, సంజయ్, శివ, మహేష్, నరేష్,పాల్గొన్నారు.

## బాల్‌సన్ నాయక్‌కు గిరిజన సేవారత్న అవార్డు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్ :** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన మాజీ తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు ధరావత్ బాల్‌సన్ నాయక్ గిరిజన సేవారత్న అవార్డును అందుకున్నారు. శనివారం హైద్రాబాద్‌లోని నాంపల్లి పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, కెనడా ఇండో కెనెడియన్ అధ్యక్షురాలు కుమారి రోయురు ఆశ్రితల చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా గిరిజనుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తాను చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు రావడం ఆనందంగా ఉందున్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజన నాయకులు బాల్‌సన్ నాయక్‌ను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత



**ప్రజాపక్షం /నల్లగొండ :** ముఖ్యమంత్రి సహాయనిధీ పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఈ పథకం ద్వారా లక్షలాది మంది పేదలకు సహాయం అందుతుందని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.వివిధ అనారోగ్య సమస్యలతో పలు ప్రైవేట్ హాస్పిటల్స్ లో చికిత్స పొందిన 43 మంది నిరుపేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిది (సిఎంఆర్ ఎఫ్ )పథకం ద్వారా మంజూరు అయిన రూ..11,71,500ల విలువ గల చెక్ లను పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు గుత్తా చేతుల మీదుగా అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చెక్ లను రిలీజ్ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలకు సహాయం చేశారన్నారు. ఈ పథకాన్ని నిర్విరామంగా కొనసాగిస్తూ పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుబ్బ అశోక్ సుందర్ , వెంకటేశ్వర రావు , గోపాల్ రెడ్డి , యాదగిరి , మునాసా వెంకన్న , సైదులు గౌడ్ , తదితరులు పాల్గొన్నారు . **గుత్తాను కలసిన జిల్లా ఎస్‌పి :** ఇటీవల కాలంలో జిల్లా ఎస్ పి గా బాధ్యతలు చేపట్టిన శరత్ చంద్ర పవార్ నల్లగొండ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాలలో బెల్ట్ షాపులు నడపొద్దు



**ప్రజాపక్షం /మర్రిగూడ :** మర్రిగూడ మండలం అజ్జలాపురం గ్రామం లో బెల్ట్ షాపుల నిర్మూలన కమిటీ ని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మునుగోడు ఎంఎల్‌ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్మూలన కమిటీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాందాస్ శ్రీనివాస్ .గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పునూతుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.ఎలిమినేటి సతీరెడ్డి, ఉప్పునుతుల చిన్నమల్లయ్య, కాపర్తి రవి,మెగావత్ గోపాల్,మెగావత్ లాలునాయక్,భరిగెల కృష్ణ, దుబ్బ వెంకటేష్ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. గ్రామంలో బెల్ట్ షాపుల లో అమ్మకుండా చూడాలని ఎవరైనా అమ్మితే మర్రిగూడ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయాలని తీర్మానం చేశారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయింటువంటి గ్రామానికి చెందిన దుబ్బ లక్ష్మి కి చెక్కును అందజేశారు.

## భువనగిరిలో ఘనంగా బోనాలు

హాజరైన ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** భువనగిరి పట్టణంలోని కుమ్మరి వాడలో, రైతు బజార్ లో పోషమ్మ తల్లి, మైసమ్మ బోనాలు పండుగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిగా భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పోచమ్మ, మైసమ్మ దీవెనలు భువనగిరి పట్టణ ప్రజలు పై ఉండాలి అని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పిసిసి ప్రధాన కార్యదర్శి పొత్నాక్ ప్రమోద్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, సోమయ్య, అంగడి నాగరాజు, బిస్కోంట్ల సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు వరంగల్‌లో రైతు భరోసాపై సమీక్ష

**ప్రజాపక్షం/ జనగామ ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు బరోసా విధి విధానాలపై సమీక్ష హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరగనుంది. ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అధికారులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ వర్క్‌షాపుకు ముఖ్యఅతిధిగా మంత్రివర్గ ఉపసంఘం ఛైర్మన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, దుద్దిళ్ల శ్రీదర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ పాల్గొననున్నారు. జనగామ జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు, ఎంపిక చేసిన రైతులు, రైతు సంఘాల ప్రతినిధిలు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

## నేటి ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమనాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15న ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రైతు భరోసా కార్యక్రమం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్న దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయాన్ని గమనించి జిల్లా నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ కార్యాలయానికి రాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో సర్వే పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** వైస్ ఛాన్సలర్, ఇన్‌ఛార్జి వాకాటి కరుణ ఆదేశాల మేరకు కాకతీయ విశ్వ విద్యాలయ అధికారులు కాంపౌండ్ వాల్ విశ్వవిద్యాలయ ల్యాండ్స్ సర్వే పనిని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా రిజిస్టర్ ఆచార్య పి. మల్లారెడ్డి డెవలప్‌మెంటు ఆఫీసర్ ఆచార్య వాసుదేవరెడ్డి, బిల్డింగ్ డివిజన్ సిబ్బందితో జిల్లా అధికారులు, ఆర్డీవో, తహసీల్దారుతో ఆదివారం క్యాంపస్ పరిసరాల్లోని కుమార్‌పల్లి, గుండ్ల సింగారం, ఇంజినీరింగ్ కళాశాల ప్రాంతంలో సర్వేను పూర్తి చేశారు. కాంపౌండ్ వాల్, సర్వే పనులు సమర్థవంతంగా చేయడానికి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడానికి వైస్ ఛాన్సలర్, ఇన్‌ఛార్జి కరుణ వాకాటి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు రిజిస్టర్ ఆచార్య మల్లారెడ్డి ఒక ప్రకటనలో తలెఇపారు. ఈ కమిటీలో సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య మనోహర్, బిల్డింగ్ డిజైన్ పూర్వ అభివృద్ధి అధికారి ఆచార్య రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్ లాల్, లీగల్ సెల్ డైరెక్టర్ ఆచార్య శ్రీనివాస్, అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, యూనివర్సిటీ ఇంజినీర్ రామయ్య, బిల్డింగ్ డివిజన్ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ కన్వీనర్‌గా కమిటీ నియామకం జరిగిందని ఆచార్య మల్లారెడ్డి తెలిపారు.

## బిసి హాస్టల్‌లోని సమస్యలు పరిష్కరించండి : రాజ్ కుమార్



**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** బిసి హాస్టల్‌లోని సమస్యలను పరిశ్కరించారలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ డిమాండ్ చేశా రు. ఆదివారం మండల కేంద్రంలోని బిసి హాస్టలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిసి హాస్టల్‌లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అనేక రకాలుగా ఇబ్బందులెదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని గతంలో అధికారులకు విన్నవించామని పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యార్థులకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి కనీస సదుపాయాలు లేక బయటకు వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరించడం సరికాదన్నారు. దీంతో పాటు సరైన భోజనం అందించడం లేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని వర్షాకాలం ప్రారంభమైన వేళ విద్యార్థులకు దుప్పట్లు, తినడానికి ప్లేట్లు, పరుపులు లేక ఇబ్బంది పడుతున్నారని హాస్టల్‌లో మూత్రశాలలు మరుగు దొడ్డకు డోర్లు లేక ఇబ్బందుల పాలౌతున్నారన్నారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించడంలేదని విద్యార్థులు వేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. తక్షణమే అధికారుల స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేకుంటే విద్యార్థులతో కలిసి ఆదోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు.

## నేడు హన్మకొండలో రైతు భరోసా వర్క్‌షాప్

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** రైతు భరోసా పథకం విదివిదానాలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘం సోమవారం హన్మకొండలో వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఇప్పటికే కొన్ని జిల్లాలలో రైతుల నుండి అభిప్రాయాలు సేకరించిన ఉప సంఘం సోమవారం హన్మకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలలో రైతుల నుండి అభిప్రాయాలు సేకరించనుంది. ఈ రైతు భరోసా వర్క్ షాప్ లో మంత్రి వర్గ ఉప సంఘం చైర్మన్ ఉప ముఖ్య మంత్రి బట్టి విక్రమార్క, సభ్యులైన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జిల్లా ఇంచార్జీ మంత్రి హోదాలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా వర్క్‌షాప్‌లో విదివిదానాలపై మంత్రి వర్గ ఉప సంఘం రైతులు, రైతు సంఘాల నుండి తమ అభిప్రాయాలను సేకరించనున్నారు.

## రైతులకు సమాచారం ఇవ్వకుండా భూములు సర్వే చేయడం సరికాదు

సిపిఐ(ఎం) పార్టీ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు

**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సభలు నిర్వహించకుండా అధికారులు భూములు సర్వే చేస్తూ రైతులను భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజ్ అన్నారు. రైతులు గత 3 రోజులుగా నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో రైతులు చేస్తున్న దీక్షలకు ఆదివారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. రైతులను గ్రామ సభలు పెట్టి ఓపించిన తర్వాతనే భూమి సర్వేలు చేయాలి తప్ప అధికారులు రైతులకు తెలియకుండానే గ్రామాలలో సర్వేలు నిర్వహించడం సరైనది కాదన్నారు. గ్రామ సభలు పెట్టే వరకు భూ సేకరణ ఆపాలని లేనిపక్షంలో రైతులతో పెద్ద ఎతున్న పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహేష్ గౌడ్, నరసింహారెడ్డి, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాదం కాదది... అవి హత్యలే

అక్రమ సంబంధం నేపథ్యంలో భార్య, బిడ్డలను హతమార్చిన వైద్యుడు

హత్య నేరం నుంచి తప్పించుకునేందుకు ప్రమాదంగా చిత్రీకరణ

వివరాలను వెల్లడించిన ఖమ్మం ఎసిపి రమణమూర్తి





**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** ప్రాణం పోయాల్సిన వైద్యుడు అక్రమ సంబంధానికి అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో భార్య, పిల్లలు అడ్డుగా నిలిచారని హతమార్చాడు. తనపై ఎటువంటి నేరారోపణ రాకుండా ఉండేందుకు రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. కానీ భార్య వైపు బంధువుల ఆందోళన, పోలీసుల నిష్పాక్షిక విచారణ ఆ వైద్యుడే హంతకుడని తేల్చేందుకు కారణమైంది. ఆదివారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖమ్మం నగర ఏసిపి ఎస్‌వి రమణమూర్తి ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను, నేరం జరిగిన తీరును వివరించారు. ఖ మ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని బావోజీతండాకు చెందిన బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లో జర్మన్ టెన్ ఆసుపత్రిలో మత్తు వైద్యునిగా పనిచేస్తున్నాడు. అతనికి ఏన్కూరు మండలం రంగాపురం తండాకు చెందిన కుమారితో వివాహమైంది. వీరికి కృషిక, కృతిక అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రవీణ్ తాను పనిచేస్తున్న ఆసుపత్రి లో నర్సుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సోని ఫ్రాన్సీస్ అనే ఆమెతో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. భార్య కుమారి పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తించడం, హింసించడం చేస్తుండడంతో పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. శాశ్వతంగా వదిలించుకోవాలనుకున్న ప్రవీణ్ తన ప్రణాళికను అమలు చేసేందుకు భార్య, బిడ్డలతో ఖమ్మం వచ్చాడు. మే 17న ఖమ్మం వచ్చిన ప్రవీణ్ మే 28న తనతో పాటు భార్య, పిల్లలను తీసుకుని ఉదయం ఖమ్మంలో పని చూసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో భార్య తనకు శరీరంలో వేడిగా ఉందని చెప్పడంతో జ్యూస్ తాగుదామని ఆపి చెరుకు రసం తాపించిన తర్వాత తన వద్ద కాల్షియం ఇంజక్షన్ ఉందని అది ఇస్తే త్వరగా తగ్గిపోతుందని భార్య కుమారికి ఇంజక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి కారును కోయచలక రోడ్డుకు తిప్పి మరింత ఉపశమనం కోసం మరో ఇంజక్షన్ చేస్తానంటూ పరిమితికి మించిన డ్రగ్స్‌ను శరీరంలోకి ఇంజెక్ట్ చేశాడు. దీంతో భార్య కుమారి మరణించింది. ఆమె మరణించిందని ధృవీకరించుకున్న తర్వాత తన కుమార్తెలైన కృషిక, కృతికలను గొంతు నులిమి ఒకరి తర్వాత ఒకరిని హత్య చేశాడు. మూడు మృతదేహాలను కారులో వేసుకుని మంచుకొండ హర్యాతండా గ్రామ సమీపంలోని పొలంలోకి కారును తిప్పి చెట్టుకు గుద్ది ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. ప్రమాదంలో భా ర్య, బిడ్డలు చనిపోయారని తనకు గాయాలు అ య్యాయని బంధు వర్గాన్ని, పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అల్లుని ప్రవర్తన, గతంలో జరిగిన ఘటనలను పోల్చుకుని భార్య కుమారి వైపు బంధువులు ఇది ప్రమాదం కాదని హత్యే అంటూ మే 29న ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. శవ పంచనామ తర్వాత పూర్తి వివరాలు వస్తాయని పోలీసులు తెలపడంతో ఆందోళన విరమించారు. తర్వాత రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ వద్ద కూడా మృతులకు న్యాయం చేయాలని ప్రవీణ్‌ను కఠినంగా శిక్షించాలని ఆందోళన చేశా రు. ఖమ్మం సిపి సునీల్ దత్ ఆదేశాలతో ఏసిపి ర మణమూర్తి నేతృత్వంలో సిఐ శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి ఈ కేసును చేధించారు. నిందితున్ని మీడియా ఎదుట హాజరు పర్చారు. ముగ్గురి హత్యకు పాల్పడిన ప్రవీణ్ కేసు లో పోలీసులు వ్యవహరించిన తీరును పలువురు అభినందించారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రజాపక్షం/బెజ్జంకి :** ప్రజాసమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ పార్టీ కార్యకర్తలకు సూచించారు.ఆదివారం మండల కేంద్రంలో సిపిఐ మండల కౌన్సిల్ సమావేశాన్ని పార్టీ మండల సహాయ కార్యదర్శి పండుగ పర్శరాములు అధ్యక్షతన నిర్వహించగా ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద పవన్ హాజరై మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం మతతత్వ రాజకీయాలను మానుకోవాలని కుల మతాల పేరుతో రాజకీయం చేయడమే తప్పా చేసిందేమి లేదని అన్నారు. ఈ ప్రాంతానికి ఎంపిగా ప్రాతినిథ్యం వహిస్తున్న బండి సంజయ్ మండలానికి ఎన్ని నిధులు కేటాయించారో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి, మండల కార్యదర్శి బోనగిరి రూపేష్,ఏఐవైఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బోనగిరి మహేందర్,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగెం మధు,ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు దొంతరవేణి మహేష్, నాయకులు బోనగిరి శ్రావణ్,రొడ్డ లక్ష్మ ణ్, గుండయ్య, విజయ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి ఫలితాలు స్ఫూర్తిగా తీసుకొని

## భవిష్యత్తులో ఎదగాలి

మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** మిమ్ములను కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశం ఇది.. పదవ తరగతి ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో 10/10 జిపిఏ సాధించిన 75 మంది విద్యార్థులకు స్వంతఖర్చులతో ఒక్కొక్కరికి 10 వేల విలువైన ఐ ప్యాడ్స్ ఉచితంగా ఎంఎల్‌ఏ హరీష్‌రావు అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట పదవ తరగతి ఫలితాల్లో వరసగా ఐదుసార్లు అగ్రగామిగా నిలిచిందన్నారు. సిద్దిపేట పేరును నిలబెట్టిన మీకు ప్రత్యేక అభినందనలని, ఒక ఎంఎల్‌గా నాకు గర్వంగా ఉందన్నారు. సిద్దిపేట పేరు చరిత్ర పుటల్లో నిలిపారన్నారు. గత ఏడాది కంటే ఈ సారి మన జిల్లా ఈ సారి ఎక్కువ ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సిద్దిపేట నియోజక వర్గం రాష్ట్ర స్థాయిలో మొదటి స్థాయిలో ఉందని, బాసరలో అత్యధికంగా ఐఐటి సీట్లు సాధించినట్లు తెలిపారు. కాగా బిఆర్ఎస్ సభ్యత్వం కల్గిన కార్యకర్తకు కంటికి రెప్పల కాపాడుకుంటామని ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించి ప్రమాద వశాత్తు మృతిచెందితే వారికుటుంబాలకు ప్రమాదబీమ కల్పించి అండగా నిలుస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కాగా ఆదివారం తహశీల్దార్‌గా పదవి విరమణ చేసిన శ్రీనివాస్‌రావు కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. ఏన్నో ఏళ్ల ప్రజా జీవితంలో సేవలందించిన శ్రీనివాస్‌రావు పదవి విరమణ కార్యక్రమానికి హాజరుకావటం ఏంతో సంతోషంగా ఉందన్నారు.



## ఫిరాయింపులపై స్పందించని న్యాయవ్యవస్థ

కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి : రఘునందన్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్ :** రాష్ట్రంలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై అత్యున్నత న్యాయవ్యవస్థ పట్టించుకోకపోవడం దురదృష్టకరమని మెదక్ ఎంపి రఘునందన్ రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో శ్రీ మహంకాళి ఆషాడ బోనాల జాతర మహోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కెసిఆర్ బాటలోనే సిఎం రేవంత్ రెడ్డి నడుస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నట్లు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను వివిధ రకాలుగా మభ్యపెడుతూ, రోజుకోకరిని కొనుగోలు చేస్తూ పబ్బం గడుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ ఉండగా, సిఎం రేవంత్ రెడ్డి భవిష్యత్తు భయంతో రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అయితే ఒక్కో ఎమ్మెల్యేని కొనుగోలు చేసే బదులుగా ఒకేసారి మూకుమ్మడిగా ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సమస్యలను పక్కన పెట్టడంతో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కేవలం ఫిరాయింపులనే ప్రోత్సహిస్తూ కాలం గడుపుతున్నట్లు ఆరోపించారు. ప్రజలు నమ్మి ఓటేస్తే సంతలో వస్తువుగా ఎమ్మెల్యేలు అమ్ముడవుతుండడం దురదృష్టకరమని నిలదీశారు. ఫిరాయింపులపై కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణలోకి తీసుకొని ఇక్కడి కోర్టు తగిన చర్యలు చేపట్టాలని, అలాగే పద్ధతి మార్చుకొని పక్షంలో సిఎం రేవంత్ రెడ్డి మాజీ సిఎం కెసిఆర్ లాగా ఇంటికే పరిమితం కాక తప్పదని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు మనోహర్ యాదవ్, ఉప్పల మధుసూదన్, జశ్వంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 510 జిఓ నష్టంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం

జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి :** 510 జీవో మూలంగా 4వేల మంది ఉద్యోగులకు నష్టం జరుగుతున్నందున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తానని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. ఆదివారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిసిఐ కార్యాలయంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఆల్ క్యాడర్స్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రామ రాజేష్ ఖన్నా ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. జీవో 510 వలన నష్టం జరిగిందన్నారు. దానిని పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనం తో కూడిన సెలవులు మంజూరు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని జిల్లా అధ్యక్షురాలు జ్యోతి డిమాండ్ చేశారు. ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు అందరిని వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలన్నారు. వారికి కనీస వేతనాలు చెల్లించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం కాలుగు కోడ్‌లుగా విభజించి న 29కోడ్లను రద్దు చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి పిల్లలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించెలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

### జాతీయ ఆరోగ్య మిషన్ నూతన కమిటీ ఎన్నిక

జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటి ఎన్నికల జరిగింది. అధ్యక్షులుగా జ్యోతి, కార్యదర్శిగా గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.లిఖితరాణి, ఉపాధ్యక్షులుగా భాస్కర్, కోశాధికారిగా మల్లేశం, సహాయ కార్యదర్శిగా తిరుచు రజిని, సభ్యులుగా సిహెచ్ అంజయ్య, డాక్టర్ భార్గవి, కొండ లత, అంజయ్య లక్ష్మి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం 510 జీవో ద్వారా జరిగిన నష్టాన్ని సరిచేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈఈ కార్యక్రమంలో సాంబయ్య, సిహెచ్ నిర్మల, రజిని, లిఖిత, భార్గవి, మరిపెల్లి కవిత, రజిని, సౌజన్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీ కొట్టిన కంటైనర్

నాలుగుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య





**ప్రజాపక్షం/ఏటూరు నాగారం** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని 163 జాతీయ రహదారి పైన జెపి ఫంక్షన్ హాల్ హైవే ట్రీట్ ముందు శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వాజేడుకు చెందిన కాకర్లపూడి సత్యనారాయణ, అలియాస్ ఎర్రబాబు (70), సత్య దేవి (60) దంపతులు, తల్లండి నాగరాజు (35) విశాఖ పట్నం బస్సు ఎక్కించేందుకు కుమార్తె అనితను తీసుకొని ఏటూరు నాగారం వైపు ఆటోలో వస్తున్న క్రమంలో శనివారం రాత్రి ఏటూరు నాగారం నుండి వాజేడు వైపు వెళ్తున్న కంటైనర్, ఆటోను ఢీకొట్టడంతో ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు కాగా ఆటోలో ప్రయాణిస్తున్న కాకర్లపూడి సత్యనారాయణ రాజు, అతడి భార్య సత్యవతి దేవి, ఆటో డ్రైవర్ తల్లండి నాగరాజు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా అనితతో పాటు ఆటో డ్రైవర్‌కు తోడు గా వస్తున్న అంజి రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని స్థానిక సామాజిక వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనిత, అంజిరెడ్డిని, వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనిత ఆదివారం తుదిశ్వాస విడిచారు. దీంతో రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య నాలుగుకి చేరింది. తీవ్ర గాయాలైన అంజిరెడ్డి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు వాపోతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఆటోను ఢీకొట్టిన కంటైనర్ డ్రైవర్ వాహనను ఆపకుండా పరార్ కావడం జరిగింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ తాజుద్దీన్ ఆయా మండలాలలోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించడంతో అప్రమత్తమైన పోలీసులు జగన్నాధపురం వైజంక్షన్ వద్ద కంటైనర్ పోలీసులు ఆపడంతో కంటైనర్ వదిలిపెట్టి డ్రైవర్ పరారైనట్లు సమాచారం. జాతీయ రహదారి వెంట ప్రమాదానికి గురి అయ్యాయి గేదె మృతి చెంది గత కొన్ని రోజులుగా కలేబేరం రోడ్డుపైనే ఉండి దుర్వాసన వెదజల్లుతున్నప్పటికీ, సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు స్పెషల్ ఆఫీసర్లు పట్టించుకోకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో గేదె కలేబరాన్ని తప్పించబోయి ఆటో, కంటైనర్ రోడ్డు ప్రమాదానికి గురి అయినట్లు గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఆయా గ్రామాల ప్రజలు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### గుంతల మయంగా రహదారి

ఏటూరు నాగారం 163వ జాతీయ రహదారి ఇసుక లారీల వల్ల రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి దీంతో వర్షాకాలం కావడంతో రహదారిపై వర్షం నీరు నిల్వ ఉండి ప్రమాదాలకు కారణం అవుతున్నట్లు. రహదారి పైన ఏర్పడ గుంతలను పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు. సమయపాలన లేకుండా అతివేగంగా వస్తున్న ఇసుక లారీలను నియంత్రించాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి కృషి చేస్తా

రాష్ట్ర ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండ మండలం టేకుల గూడెంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను కూడా ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నానని, ఆయిల్ పామ్ రైతుల సమస్యలు తెలుసునని చెప్పారు. ఆయిల్ పిమ్ పండిస్తే వరి కంటే అధిక లాభదాయకంగా ఉంటుందని, ఆయిల్ పామ్ ద్వారా ఎకరాకు ఒక లక్షా యాభై వేయిల నుంచి ఒక లక్షా ఎనభై వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఏవైనా ప్రైవేటు కంపెనీలు రైతులను మోసం చేయాలని చూస్తే తాము రైతులకు అండగా నిలుస్తామని, రైతులకు రవాణా, స్టోరేజి, గిట్టుబాటు ధరలు వచ్చేలా చూస్తామని చెప్పారు. ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడగానీ, దొంగల బెడద గానీ ఉండదని, రాష్ట్ర ముఖ్యమంత్రికి మాట రాకుండా దేశంలోనే ఆయిల్ పామ్‌ను ఉన్నతంగా తయారు చేస్తామని అన్నారు. ఆయిల్ పామ్‌కు నాలుగు సంవత్సరాలు కష్టపడితే తరువాత సంవత్సరం నుండి ఆదాయం వస్తుందని, ఆయిల్ పామ్‌ను వాడే డ్రిప్ ఇరిగేషన్‌కు సేల్స్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. రాష్ట్రంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ తప్పకుండా చేస్తామని, ప్రతి ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని, రైతలను ఆయిల్ పామ్ సాగువైపు మళ్లేలా కృషి చేస్తామని అన్నారు. తాను గత,లో ఉమ్మడి వరంగల్ డిసిసిబి చైర్మన్‌గా రైతులకు ఎలాంటి సహాయం చేశానో అలాగే ఆయిల్‌పామ్ రైతులకు కూడా రాష్ట్రంలో సహకారం అందిస్తానని చెప్పారు.

## తక్షణమే కొత్త రేషన్ కార్డులు మంజూరు

ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఎమ్మార్పీఎస్ టిఎస్ ము ఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న జిల్లా అ ధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డుల సమస్య చాలా పెద్ద సమస్య గా మారిందని గత బిఅర్ఎస్ ప్రభుత్వంలో 10 ఏళ్ల నుండి రేషన్ కార్డులు జారీ చేయకపోవడం వల్ల లక్షలాది మంది పెళ్ళైన దంపతులకు ఏ ప్రభుత్వ పథకం అందక చాలా దయనీయమైన పరిస్థితుల్లో బ్రతుకుతున్నారన్నారు. కొత్త గా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిన నూతన రేషన్ కార్డులు ఇస్తుందని ఆశతో ఎదురు చూస్తు న్న అర్హులకు నిరాశే ఎదురు అయిందని రాజయ్య మాదిగ తెలిపారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయకుంటే దశల వా రీగా ఉద్యమం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహే ష్ మాదిగ, నియోజకవర్గ ఇంచార్జి శీలపాక హరీ ష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ మండల నాయకులు రేణుకుంట్ల శ్రవణ్ కుమార్, రాకేష్,పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పర్యటన

ప్రజాపక్షం/రామగిరి : మంథని మున్సిపాలిటీ, రామగిరి, కమన్పూర్ మండలాల్లో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పలు అభివృద్ధి కార్యక్రమంలో సోమవారం పాల్గొననున్నారు. మంతిని మున్సిపాలిటీలో ఉదయం 800 గంటలకు అమృత్ 2 పథకం కింద కేంద్ర, రాష్ట్ర నిధులు 12 కోట్ల 10ల క్షలతో మంథని పోచమ్మ వాడ వద్ద 8 లక్షల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ తో పాటు 25 km పైప్ లైన్ నిర్మణం కోసం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. మంథని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం. చెట్లు నాటే కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఆవరణలో మంత్రి పాల్గొనున్నారు. రామగిరి మండల రత్నాపూర్ గ్రామంలో సింగరేణి నిధులతో 4.16 కోట్ల నిర్మించిన సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మరియు పన్నూరు గ్రామంలో ఐదు కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. అనంతరంకమాన్ పూర్ మండలం పెద్దపెల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వడ్లకొండ అనిల్ గౌడ్ (జెమినీ) తండ్రి వడ్లకొండ కొమురయ్య గౌడ్ దశదినకర్మ కార్యక్రమనికిహాజరుకానున్నారు.

## ఎస్ఆర్పి 3, 3ఎ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఎస్ఆర్పి 3 అండ్ 3ఎ గని మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కే సమ్మయ్య, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, మైనింగ్ స్టాప్ సబ్ కమిటీ ఉపాధ్యక్షులు బాదావత్ బాలకృష్ణ, కార్యదర్శి మారపల్లి బాపు, జాయింట్ కార్యదర్శి రాజశేఖర్, పిట్ కార్యదర్శి మురళీ చౌదరి పాల్గొన్నారు. ఎస్ఆర్పి3 అండ్ 3ఎ నూతన కార్యవర్గంగా ఫిట్ వైస్ ప్రెసిడెంట్ బి. మోహన్ దాస్, పిట్ కార్యదర్శి చిలుముల క్రాంతి కుమార్, అసిస్టెంట్ కార్యదర్శి మొహమ్మద్ మోసిన్, షిఫ్ట్ కార్యదర్శులు రిలేఎ విష్ణు, రిలేబి ప్రభు, రిలేసి వంశీ, రిలేడి దిలీప్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సాయి కుమార్, కళ్యాణ్, అభిలాష్, ప్రసాద్ లను ఎస్ఆర్ని 3 అండ్ 3ఎ శ్రీరాంపూర్ గని మైనింగ్ స్టాప్ సబ్ కమిటీ కొరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మైనింగ్ స్టాఫ్ ఉద్యోగుల హక్కులు, సౌకర్యాలు కొరకు ఈ కమిటీ ఉద్యమించాలని నాయకులు కోరారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నిజాంసాగర్ : హైదరాబాద్లోని ప్రజా భవన్లో, తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క నివాసంలో నల్లపోచమ్మ అమ్మవారికి బోనాల ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు వారి సతీమణి తోట అర్చనతో కలిసి పాల్గొన్నారు. బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, విశిష్ఠ అతిథులుగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్ రెడ్డిలు హాజరయ్యారు. హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మీ, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టంఎ పర్ణికరెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన



ప్రజాపక్షం/నేరడిగొండ : మండలంలోని వాంకిడి గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన నూతన పల్లె దావఖాన పూర్తయిన ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించలనే ఉద్దేశంతో పల్లె దావఖానాలను నిర్మించారు. కానీ సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికీ ఆరోగ్య శాఖకు భవనాన్ని అప్పగించక పోవడంతో ప్రారంభానికి నోచుకోక రోగులకు వైద్య సేవలు అందడం లేదని,పేర్కొంటున్నారు.దరిమిల రోగుల దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరలో ప్రారంభించాలని వాంకిడి ఏరియా ప్రజలు కోరుతున్నారు.

## రాజన్నను దర్శించుకున్న ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్



ప్రజాపక్షం/ వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని ఆదివారం కుటుంబ సమేతంగా ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఎం. వెంకటేశ్వర రావు కోడె మొక్కు చెల్లించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో చైర్మన్ దంపతులకు ఆలయ ఈఓ కె.వినోద్ రెడ్డి శేషవస్త్రం కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. వీరి వెంట ఏఈఓ లు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, ప్రతాప నవీన్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు ఆలయ పరిరక్షకులు, అలీ శంకర్ ఆలయ ఇన్స్పెక్టర్ సంకపల్లి పవన్, ఈవో సిసి ఎడ్ల శివ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కనువిందు చేస్తున్న కుంటాల జలపాతం

ప్రజాపక్షం/నేరడిగొండ : అందమైన అద్భుతమైన పచ్చని అడవి. ప్రకృతి రమణీయతను కనువిందు చేసే జలపాతం. లోయలు, కొండలు మధ్య నుండి పరవాళ్ళు తొక్కుతున్న పాలధార లాంటి నీటితో 42 అడుగులపై నుండి ఎగసిపడే నీరు కుంటాల జలపాతాము నిండుకుండల మారి కనువిందు చేస్తూ మరింత శోభను సంతరించుకుంది. ఆదివారం సందర్శకుల తాకిడితో ముఖ్యంగా సెలవు రోజుల్లో ఇతర రాష్ట్రాలు, హైదరాబాద్ పట్టణం, నుండి వేల సంఖ్యలో సందర్శకులు వచ్చి ప్రకృతి ఒడిలో పరవశించిపోతున్నారు. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునేందుకు ఎగువ ప్రాంతం కుప్టి నుండి కుంటాల గ్రామాల గుండా కడెం నది ప్రవహిస్తూ కుంటాల వద్ద జలపాతంగా మారింది, దీనినే తెలంగాణ నయాగరాగా, రాష్ట్రంలో అతి ఎత్తైన జలపాతంగా పిలవబడుతున్నారు. ఆదివారం జలపాతంలో సందర్శకులతో రోజంతా సందడిగా కుటుంబ సభ్యులతో ప్రకృతి రమణీయతను ఆస్వాదించరు.



# ఆర్కె-7 గని కార్మికులు ఆందోళన చెందొద్దు



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : ఇటీవలే అటవీ శాఖ అధికారులు ఆర్కె7 గనిలో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయాలని చెప్పడాన్ని గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) గా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా మాట్లాడుతూ 2020 నాటికి ఆర్కె 7 మైన్ ల్యాండ్ లీజు ఉందని, అందుకని యాజమాన్యం 2018 వ సంవత్సరంలో ల్యాండ్ లీజ్ ఎక్స్టెన్షన్ చేయాలని పర్మిషన్ కోసం అటవీ శాఖకు లేఖలు పంపించినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు కరోనా పేరుతో ఇతరత్రా కారణాలతో లీజు ఎక్స్టెన్షన్ ఇవ్వలేదని ఆరోపించారు. ఆర్కె7 గనిలో దాదాపు 1400 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఏకపక్షంగా ఉత్పత్తిని నిలిపివేయాలని చెప్పడం వల్ల కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి)గా వెంటనే యాజమాన్యం, చైర్మన్తో మాట్లాడామని అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు తెలిపినట్లు వివరించారు. గుర్తింపు కార్మిక సంఘంగా తాము కూడా ఫారెస్ట్ అధికారులకు, జిల్లా కలెక్టర్కు సోమవారం వినతి పత్రం సమర్పిస్తున్నామని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల విద్యుత్ తయారీ కేంద్రాలలో కొరత ఏర్పడుతుందని అన్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతారని కాబట్టి ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి అటవీశాఖ అధికారులు వెంటనే పర్మిషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతులు ఇచ్చేంత వరకు బొగ్గు ఉత్పత్తి చేసుకొనుటకు అనుమతిని ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సారయ్య, సంపత్ పాల్గొన్నారు.

## గ్రంథాలయ సంస్థ చైర్మన్ను కలిసిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/పిట్లం : జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదివారం నాడు తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ రియాజ్ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వం రియాజ్ను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మెన్గా నియమించడంతో ఆయన ఆదివారం నాడు హైదరాబాద్లోని సెంట్రల్ లైబ్రరీలో పదవీ భాధ్యతలు స్వీకరించారు. వారిని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతిరూపం పోచమ్మ బోనాలు

### ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : తెలంగాణా సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం పోచమ్మ తల్లి బోనాలు అని మాజీమంత్రి, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ఆషాడ మాస బోనాలు భక్తులు కోరిన వెంటనే కోరిన కోర్కెలు అందించే తల్లి పోచమ్మ అని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల పద్మశాలి సేవా సంఘం వాణీ నగర్, శ్రీ లోక మాత పోచమ్మ తల్లి తారకరామ నగర్లో, గోవిందపల్లే వేంకటాద్రి నగర్ కాలని ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్రెడ్డి జ్యోతిలు మాట్లాడుతూ ఆషాడ మాసంలో గ్రామదేవతలను కొలిచి పాడిపంటలతో పాటు అందరూ బాగుండాలని బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో డప్పు చప్పుళ్లు, కోలాట నృత్యాలు, భక్తి పారవశ్యంతో పోచమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుర్రం రాము, దాసరి లావణ్య ప్రవీణ్, కొలగని సత్యం ప్రేమలత, దేవేందర్ నాయక్, మహిళలు, పద్మశాలి సేవా సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యులు, వెంకటాద్రి నగర్ కాలని వాసులు, టీఆర్ నగర్ శ్రీ లోక మాత పోచమ్మ ఆలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సాగుతున్న వన మహోత్సవం



ప్రజాపక్షం/నందిపేట్ : నిజామాబాద్ జిల్లా, నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లోని గ్రామాలలో వన మహోత్సవం ముమ్మరంగా సాగుతంది. పచ్చదనం పెంచడమే లక్ష్యంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత గ్రామ స్తాయి అధికారులకు అప్పగించారు. గతంలో ప్రతి గ్రామంలో వేలకొద్ది మొక్కలు నాటారు. అందులో చాలా వరకు వాటిని కాపాడే వారు లేక నీళ్ళు పోయక చనిపోయాయి. అందుకే ఈ సంవత్సరం గ్రామానికి 3200 మొక్కలు చెరువు గట్ల మీద, ప్రభుత్వ స్తలాల్లో నాటుతున్నారు. సుమారు 3500 పండ్ల మొక్కలు ఇంటింటికి పంచి వాటిని సంరక్షించే బాధ్యత ఇంటివారికి అప్పగించారు. మరికొందరు పంట పొలాల్లో టేలాల్లో మొక్కలు నాటుకుంటున్నారు. ఇలా నందిపేట్ మండలంలో 1.35 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ మేరకు గుంతలు తవ్వడం మొక్కలు నాటడం వంటివి ఉపాధి హామీ సిబ్బంది ప్రయత్నంతో యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయి. అన్ని శాఖల వారిని ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేస్తూ మొక్కలను కాపాడే బాధ్యత ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

# నూతన రోడ్డు నిర్మించాలి

### ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం డిమాండ్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి ఆర్జీ 2 ఏరియా లోని ఓసిపి3 సి హెచ్ పీ నుండి పోతన కాలనీ వరకు నిత్యం కార్మికులు తమ విధులకు వెళుతున్న తరుణంలో అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, సింగరేణి యాజమాన్యం నూతన రోడ్డుతో పాటు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి కందుకూరి రాజారత్నం డిమాండ్ చేశారు. ఆదివారం ఓసిపి 3 సిహెచ్పి నుండి పోతన కాలనీ వరకు ఉన్న రోడ్డును పరిశీలిస్తూ అనంతరం ఆయన మాట్లాడుతూ ఓసిపి 3 సిహెచ్పి నుండి పోతనకాలనీ వరకు కార్మికులతో పాటు ఇతర ప్రజలు తమ గ్రామాల నుండి గోదావరిఖనికి వివిధ పనుల నిమిత్తం రాత్రనకా, పగలనకా వివిధ వాహనాలతో వాహన చోదకులు నిత్యం వస్తూ వెళ్తుంటారని, కనీసం వీధి దీపాలు కూడా లేకపోవడం రోడ్డు మొత్తం పూర్తిగా చెడిపోవడం గుంతలు గుంతలుగా ఏర్పడి ఇటు సింగరేణి కార్మికులు అటు ప్రజలు గుంతలు కనపడకుండా చీకటి సమయంలో కిందపడి అనేక గాయాల పాలవుతున్న సింగరేణి యాజమాన్యం పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆరోపించారు. సింగరేణి యాజమాన్యం యుద్ధప్రాతిపాదికన ఓసిపి 3, సిహెచ్పి నుండి పోతన కాలనీ వరకు నూతన రోడ్డు నిర్మించాలని మరియు స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసి కార్మికులకు ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా చూడాలని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు లేనియెడల డ్యూటీలకు వెళ్లే సింగరేణి కార్మికులు, చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలతో రోడ్డు పైనే బైటాయించి పోరాటాలకు శ్రీకారం చుడుతామని ఆయన సింగరేణి యాజమాన్యాన్ని హెచ్చరించారు.

# వైద్యులు మెరుగైన సేవలందించాలి

### కలెక్టర్ రాజీవ్గాంధీ హన్మంతు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : మెరుగైన సేవలందించాలని వైద్యులకు జిల్లా కలెక్టర్ రాజీవ్గాంధీ హన్మంతు సూచించారు. బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చిన ఉచిత డయాలసిస్ సేవల విభాగాన్ని కలెక్టర్ రాజీవ్గాంధీ హన్మంతు ఆదివారం ప్రారంభించారు. డయాలసిస్ విభాగం ద్వారా రోగులకు అందించే సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సగటున 20 మంది వరకు డయాలసిస్ సేవలు వినియోగించుకోవచ్చని వైద్యులు తెలిపారు. చుట్టుపక్కల మండలాల నుండి డయాలసిస్ పేషెంట్లు ఇక్కడికి వస్తారని, ఏక కాలంలో ఏడుగురు చొప్పున రోగులకు డయాలసిస్ చేయవచ్చని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రోగులకు మెరుగైన సేవలందించాలని, ప్రభుత్వ ఆస్పత్రిల పనితీరుపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. ఆస్పత్రిలోని ఆర్ఓ ప్లాంట్, పోస్ట్ ఆపరేటివ్ వార్డు, ఇతర విభాగాలను కలెక్టర్ సందర్శించి స్థానికంగా గల సౌకర్యాలను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇన్ పేషెంట్లను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవలపై వాకబు చేశారు. వైద్యుల కొరత ఉన్న కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకం కోసం ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజేశ్వర్, తహసీల్దర్ కె. గంగాధర్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివశంకర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు, ఆర్ఎంఓ డాక్టర్ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

### కళ్యాణలక్ష్మీ పథకంలో

# తులం బంగారం జాడెక్కడా?

ప్రజాపక్షం/పిట్లంః రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేద, మధ్య తరగతి ప్రజలు ఎంతో ఆశగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ పథకం ఎప్పుడు అమలులోకి వస్తుందోనని జుక్కల్ నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కళ్యాణలక్ష్మీ పథకంతో పాటు తులం బంగారం అని రేవంత్రెడ్డి హామీ ఇవ్వగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సార్లు భరాస పార్టీ అధికారం చేపట్టగా ఈసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా తులం బంగారం ఊసే లేకుండా పోయింది. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ సైతం చెక్కులు పంపిణీ చేసి చేతులు దులుపుకుంటుందని ప్రజలు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓ మాట, ఎన్నికల తర్వాత మరోమాట అన్నట్లుగా కాంగ్రెస్ వ్యవహరిస్తుండడం శోచనీయం. నియోజకవర్గంలోని అర్హులైన లబ్దిదారులు మాత్రం ప్రభుత్వం అందించే తులం బంగారం కొరకు ఎదురు చూస్తున్నారు.




# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయాలి

### డా.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్





ప్రజాపక్షం/చింతలమానేపల్లి : రైతాంగానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు వెంటనే పూర్తి చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నేత డా. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా సేకరించిన భూములకు ఇంకా రైతులకు నష్టపరిహారం అందలేదని, తక్షణమే పరిహారం చెల్లించాలని అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న తుమ్మిడిహట్టి, సాండ్ గాం, రణవెల్లి, కోర్సిని, గూడెం, హుడికిలి, లోనవెల్లి, సూర్జాపూర్, జంబుగ ఎత్తిపోతల ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న అడ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసి 10 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెరువుల నుండి పంట పొలాలకు నీరుపారే కాలువలు పూడుకుపోయాయని, తూము ద్వారం గేట్లు మరమ్మత్తులు చేయాలని లేని పక్షంలో రైతులకు మద్దతుగా త్వరలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

**ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి**

కాగజ్ నగర్ మండలం అంకుషాపూర్లో అధికార కాంగ్రెస్ నాయకులు చట్టవిరుద్ధంగా నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులుల అభయరణ్యానికి కేవలం 60 మీటర్ల దూరంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, నేషనల్ బోర్డ్ ఫర్ వైల్డ్ లైఫ్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే చట్టవిరుద్ధంగా ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ పూర్తయితే పచ్చని పల్లెలు కాలుష్యం బారినపడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణమహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని కర్జవెల్లిగూడెం మార్గానికి బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడెం, చిత్తమాలో పర్యటించారు. కర్జవెల్లిగూడెం రోడ్డు వర్షాలకు దెబ్బతిని నరక కూపంలా మారిందని అన్నారు. గూడెం నుంచి సిర్పూర్, కాగజ్ నగర్ తోపాటు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారని, విద్యార్థుల బాధలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గోమసే లాహంచు, నీలగౌడ్, రామ్ ప్రసాద్, అవుల రాజు కుమార్ యాదవ్, నవీన్, నాగపూరె బండు పటేల్, దుర్గం వెంకటేష్, చారి గోవింద్ రావు తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ కాంగ్రెస్లో అంతర్గత విభేదాలు

### నియోజకవర్గ ఇన్చార్జి అంశానికి తెరపడేనా...

ప్రజాపక్షం/బాన్సువాడ : బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే గెలవకున్న రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్ కార్యకర్తలు సంతోషపడ్డప్పటికి కార్యకర్తల సంతోషం మున్నాళ్ళ ముచ్చటగానే మారింది. ఇటీవల జరిగిన రాజకీయ సమీకరణల వల్ల బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో కలవరం మొదలైంది. నియోజకవర్గ ఇన్చార్జిగా కొనసాగుతున్న ఏనుగు రవీందర్రెడ్డి పార్టీ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పినప్పటికి ఎక్కడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి కార్యక్రమాల్లో కలిసిన దాఖలాలు లేవు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ కార్పొరేసన్ చైర్మన్ల నియామకాలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన టిపిసిసి సభ్యులు కాసుల బాలరాజుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేసన్ చైర్మన్ పదవి కట్టబెట్టడంతో కాంగ్రెస్ పార్టీలో నాయకులు కార్యకర్తలు ఒక వర్గం సంతోషపడ్డప్పటికి మరొక వర్గం కాసుల బాలరాజుకు చైర్మన్ పదవి రా కుండా ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. పార్టీకోసం కష్టపడి పనిచేసిన నాయకుడిని గుర్తించినందుకు కార్యకర్తలు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు కార్పొరేషన్ చై ర్మన్ పదవి చేపట్టాక మొదటిసారి బాన్సువాడ నియోజకవర్గానికి వస్తున్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఓవైపు కార్యక్రమాలు చేస్తుండగా మరోవైపు ఏనుగు రవీందర్రెడ్డి వర్గం నాయకులు మాత్రం అంటి ముట్టనట్టుగా వ్యవహరిస్తున్న తీరు కాంగ్రెస్ వర్గాల్లో కలవరపెడుతుంది.

**ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్, పార్టీ ఇన్చార్జి ఒక్కతాటిపైకి వచ్చేనా...**

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఏనుగు రవీందర్ రెడ్డి, ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు ముగ్గురు కలిసి ఒక్కతాటిపైకి ఎప్పుడు వస్తారో అని కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. నాయకులు పైకి మాత్రం తాము పాత కొత్త నాయకులను కలుపుకొని వెళ్తామని చెబుతున్నప్పటికి క్షేత్రస్తాయిలో ఎంత మేరకు కలిసి పనిచేస్తారో వేచి చూడాల్సిందే.. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నుండి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ఇన్చార్జిలు ఎమ్మెల్యేలు సమన్వయంతో కలిసి నియోజకవర్గాల్లో పనిచేస్తుండగా బాన్సువాడ నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్రెడ్డి పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్రెడ్డిని కలుపుకోలేకపోవడం వల్ల కిందిస్థాయి కార్యకర్తలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇన్చార్జి అంశం విషయంలో ఎటువంటి అధికారిక ప్రకటన లేకపోవడం వల్ల కార్యకర్తలు తమ భవిష్యత్తు పట్ల ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే పోచారం, పార్టీ ఇన్చార్జి ఏనుగు రవీందర్రెడ్డిని కలుపుకొని పార్టీ కార్యక్రమాలు చేస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గ్రూపు రాజకీయాల వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టం జరగడంతోపాటు ప్రతిపక్ష పార్టీలు క్షేత్రస్తాయిలో బలపడి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

## సిఎం సహాయ నిధి నిరుపేదలకు కొండంత అండ

### జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : జగిత్యాల పట్టణ దేవి శ్రీ గార్డెన్స్లో పట్టణానికి చెందిన 110 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 25 లక్షల 82 వేల 200 రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్లో పార్టీలో చేరానని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రితో కలిసి పని చేసి జగిత్యాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. జగిత్యాల పట్టణ బీద మధ్యతరగతి ప్రజల కోసం 4500 డబల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేసి, మౌలిక సదుపాయాలు కల్పనకి 32 కోట్ల నిధులు మంజూరు చేయటంతో పనులు వేగంగా జరుగుతున్నాయనీ అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లులు, పట్టణ నాయకులు, యూత్ నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో భావవ్యక్తీకరణ

సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని, ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడారు. గత చట్టాలు బ్రిటిష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పనపై దృష్టిసారించిన ప్రభుత్వం కూలంకషంగాచర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని, కేవలం 43గంటల 23సెకన్లు మాత్రమే చర్చించారని తెలిపారు. పేరు బ్రిటిష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బిజెపి మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తెచ్చారని, సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుందని తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయసంహితభారతీయనాగరిక్ సురక్ష సంహిత భారతీయ సాక్ష్యా సంహిత చట్టాలను తెచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు.పార్లమెంటులోవిపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్‌గారూ పొందించబడిందన్నారు. చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణనలోకి తీసుకోలేదని ఐపిసిలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితలో 358కి కుదించారని తెలిపారు. 124 ఎ సెక్షన్‌లో గతంలో ఉన్న రాజద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తెచ్చారని, ఇది రా జ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. 16 ఏళ్ల లోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీసం 20ఏళ్లు శిక్షపడే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024నుంచి అమల్లోకి వచ్చినా గతంలో ఐపిసి ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఫోక్సోలాంటి కేసుల్లో బాధితురాలి పేరును కానీ, కుటుంబ పేరును కానీ విచారణ పూర్తయ్యేంత వరకు బహిర్గత పర్చరాదని పోలీసులు సైతం వివరాలు సీల్డ్ కవర్‌లో న్యాయమూర్తికి అందించి పేరుకు బదులు బాధితురాలిపేరునువాడాల్సి ఉంటుందని సూచించారు. మీడియా సైతం బాధితురాలి పేరును ఉచ్చరిస్తే శిక్షించే అవకాశంఉందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను సంప్రదించిచట్టాలను అమలు చేశారని, న్యాయ నిపుణులనుకానీ బార్‌కౌన్సిల్స్‌ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు.సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్,రాష్ట్రకంట్రోల్‌కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ములజితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఎఎల్ నాయకులు పట్టాభి, ఎస్‌కె లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు తదితరులున్నారు.

## భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

మేకల రవి




**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటుచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అన్నారు. ఆదివారం కేఎల్ మహేంద్రనగర్‌లో జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేకల రవి ప్రసంగించారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం భారీ పరిశ్రమలు ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. కేఎల్ మహేందర్ నగర్ కార్యదర్శి పరికరాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాష్మియా, మండల కార్యదర్శి బూస రవీందర్, సినియర్ నాయకులు ఎండీ ఖాసీం, చంద్ర కుమార్, మంద ఐల్లయ్య, షభానా, పాష, అంజద్, లక్ష్మి , నిక్కత్, హరిదార్‌లు పాల్గొన్నారు.

## పోరాటాల ముద్దుబిడ్డ గుండా మల్లేష్



**ప్రజాపక్షం/ బెల్లంపల్లి :** ఉమ్మడి ఆదిలాబాద్ కమ్యూనిస్టు పార్టీ ముద్దు బిడ్డ, బెల్లంపల్లి మాజీ ఎంఎల్‌ఏ గుండా మల్లేష్ 77వ జయంతిని ఆదివారం పార్టీ శ్రేణులు నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఉద్యమాలలో అంచలంచలుగా ఎదుగుతూ యువజన, అసంఘటిత, సంఘటిత, కార్మిక, కర్షక పోరాటాల్లో చురుకుగా పాల్గొని కార్మిక, కర్షక హక్కులు సాధించిన ఘనత గుండా మల్లేష్‌కు ఉందన్నారు. నాలుగు సార్లు ఎంఎల్‌ఏగా గెలిచినప్పటికీ ఎలాంటి లాభాపేక్షకు పాల్పడకుండా పేదల పెన్నిధిగా పోరాటాలకు మారుపేరుగా ఎర్ర జెండా పోరాటాలను ముందుకు తీసుకెళ్లిన నిజమైన కమ్యూనిస్టు అని అన్నారు. సిపిఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు సిపిఐ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, చిప్ప నరసయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, బికెయంయు రాష్ట్ర నాయకులు అక్క పెల్లి బాపు, గుండా చంద్రమాణిక్యం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోనీ, గుండ సరోజక్క, సిపిఐ సీనియర్ నాయకులు రత్నం రాజ్యం, బొంకూరి రామచందర్, పులిపాక స్వామిదాస్, గుండా ప్రశాంత్, పుల్లూరి ఉదయ్, ఇనుముల రాయమల్లు, నారాయణ, కామెర దుర్గయ్య, తిరుపతి ఉన్నారు.

## అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరం



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** గోదావరిఖని పట్టణం గ్రామ పంచాయతీ నుంచి రామగుండం కార్పొరేషన్ గా మార్పు చెందినందున అభివృద్ధి విషయంలో ప్రజలు, కార్మికుల సహకారం ఉండాల్సిన అవసరం ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రామగుండం కార్పొరేషన్ లో జనాభా పెరిగినందున, దానికి తగ్గట్టుగా కరీంనగర్ కార్పొరేషన్ కు దీటుగా రోడ్ల వెడల్పు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో సింగరేణి యాజమాన్యం శివాజీ నగర్, లక్ష్మి నగర్‌లలో క్వార్టర్‌లను తొలగించడం జరుగుతుందని, ఇట్టి విషయంలో గుర్తింపు సంఘాన్ని బద్నాం చేస్తూ కొందరు అర్థరహితంగా విమర్శలు చేయడం సరికాదని వారు అన్నారు. గోదావరిఖని పట్టణం జనాభా అవసరాలకు తగిన విధంగా అభివృద్ధి జరగాల్సినఅవసరంఉందని,అందుకోసం కష్ట నష్టాలు ఉంటాయని, కొన్ని ఇబ్బందులు తప్పవని వారు అన్నారు. కొంతమంది స్వార్థం కోసం పట్టణ అభివృద్ధినిఅడ్డుకోవడం, కోర్టుకు వెళ్ళడం సరైంది కాదని వారు పేర్కొన్నారు. రోడ్డు వెడల్పు లో క్వార్టర్స్ కోల్పోతున్న కార్మికులకు, ఉద్యోగులకు సెక్టార్ వన్ లో క్వార్టర్స్ అలాట్ చేయాలని ఏఐటియుసి యాజమాన్యంకు చెప్పడం జరిగిందని, శనివారం నాడు తిరిగి కొందరికి కరెంట్ ఇప్పించడంజరిగిందని వారు తెలిపారు. శివాజీ నగర్, లక్ష్మి నగర్‌లలో ఉన్న క్వార్టర్‌లలో ఉన్న కార్మికులకు సెక్టార్ వన్ లో క్వార్టర్స్ కెటాయించేవరకు కరెంట్, నీటి కనెక్షన్ తొలగించవద్దని సింగరేణి యాజమాన్యంను కోరారు. ఏఐటియుసిఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ తో పాటు నాయకులు మిట్ట శంకర్, మానాల శ్రీనివాస్, చెప్యాల భాస్కర్, దాసరి అనిల్, పెరుమాళ్ళ రమేష్‌గౌడ్, తాళ్ళపెల్లి శ్రీనివాస్, బండారి శ్రీనివాస్, వొన్నాల లక్ష్మి నారాయణ, పోతుగంటి వెంకటేష్, బోడకుంట కనకయ్య తో పాటు ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలులో విఫలం




తోట మల్లికార్జున్

**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం సిపిఐ,ఏఐటీయూసీ కార్యాలయంలో ములుగు జిల్లా సమితి సమావేశం జరుగగా సమావేశ అధ్యక్షులు ఆచంటి ప్రసాద్ సిపిఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నిర్వహించడం పై వైఫల్యం చెందినది. కేంద్రం లో బిజెపి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని మిర్చి రైతులు ధరలు లేక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులకు పోడు భూము పట్టాలివ్వాలని ప్రతి కుటుంబంలో స్థలం ఉన్న కుటుంబానికి ఐదు లక్షలు ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీలకు 6 లక్షలు ఇవ్వాలని, రైతుభరోసా అమలు చెయ్యాలని రెండు లక్షలు రుణమాఫీ చెయ్యాలని మహిళలకు 2500 ఇవ్వాలని, నిరుద్యోగ భృతి 4016 రూపాయలు కల్పించాలని, ఇసుక క్వారీల వలన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నవి రహదారులు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, ఉపాధి హామీ కూలీలు 200 రోజులకు గాను రోజుకు 600 ఇవ్వాలని వర్షాలకు రోగాలు సంబంధించిన వైద్యులు వైద్య సిబ్బంది కార్యక్రమాలను పాటించి వ్యాధులు రాకుండా చూడాలని ఈ సందర్భంగా చెప్పారు సిపిఐ పార్టీ ఆగస్టు 22 23 24 తేదీలలో వరంగల్ లో జరిగే రాష్ట్ర స్థాయి సమావేశాల గురించి చర్చించడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడి 150 రోజులు అయినందున చేసిన వాగ్దానాలు ప్రజలకు వెంటనే అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు జంపాల రవీందర్, సిపిఐ జాయింట్ సెక్రెటరీ ఎండీ నాసార్, వడి సారయ్య, నల్లబోయిన, రవీందర్, ద్రర గోపి తదితరులు పాల్గొన్నారు.

## వరదలొచ్చే ప్రమాదం..అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ప్రతినిధిః** ఎగువ ప్రాంతంలో ఉధృతంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులలో వరద నీరు విపరీతంగా చేరడం జరుగుతుందని, ఇదే విధంగా వరద కొనసాగితే మన జిల్లాలో ఉన్నటువంటి అడా ప్రాజెక్టు గేట్లను ఏ క్షణమైనా ఎత్తే అవకాశం ఉన్నందున దిగువన ఉన్న ప్రజలు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి డివి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పాత ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసలలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని, జిల్లా ప్రజలకు ప్రమాదం తలెత్తకుండా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు వాగులు పొంగే రహదారుల్లో ప్రయాణాలు మానుకోవాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్లపై వెళ్లే ప్రయాణికులు సాహసాలు చేసి ప్రమాదాలకు గురికావొద్దని, ఆయా ప్రాంతాలలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో 24 గంటల పాటు పెట్రో కార్స్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో గస్తీ నిర్వహిస్తూ మరింత అప్రమత్తం చేయాలని, ప్రాణహిత నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈతలకు వెళ్ళరాదని, సెల్ఫీ ఫోటోలు తీసుకోవడానికి వెళ్లరాదని తెలిపారు.

## కార్మికులు ఆందోళన చెందొద్దు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** ఇటీవలే అటవీ శాఖ అధికారులు ఆర్‌కె7 గనిలో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయాలని చెప్పడాన్ని గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి) గా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కె. వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీ సైదా మాట్లాడుతూ 2020 నాటికి ఆర్‌కె7 మైన్ ల్యాండ్ లీజు ఉందని, అందుకని యాజమాన్యం 2018 వ సంవత్సరంలో ల్యాండ్ లీజ్ ఎక్స్టెన్షన్ చేయాలని పర్మిషన్ కోసం అటవీ శాఖకు లేఖలు పంపించినట్లు పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు కరోనా పేరుతో ఇతరత్రా కారణాలతో లీజు ఎక్స్టెన్షన్ ఇవ్వలేదని ఆరోపించారు. ఆర్‌కె7 గనిలో దాదాపు 1400 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. అటవీశాఖ అధికారులు ఏకపక్షంగా ఉత్పత్తిని నిలిపివేయాలని చెప్పడం వల్ల కార్మికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని విమర్శించారు. గుర్తింపు కార్మిక సంఘం (ఎఐటియుసి)గా వెంటనే యాజమాన్యం, చైర్మన్ తో మాట్లాడామని అటవీ శాఖ నుంచి అనుమతులు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామని అధికారులు తెలిపినట్లు వివరించారు. అనుమతులు ఇచ్చేంత వరకు బొగ్గు ఉత్పత్తి చేసుకొనుటకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సారయ్య, సంపత్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించరేమి?



**ప్రజాపక్షం/వేములవాడ:** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను తమ సమస్యలను పరిష్కరించాలని కోరడం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వం ఎంపిడబ్ల్యు వ్యవస్థను తీసుకు వచ్చి కార్మికులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసింది. జీవో నంబర్.51 వలన జిపి కేటగిరీలు రద్దు కాబడి అన్ని పనులు చేయాలనే నియమం వలన ఎందరో కార్మికులు అనుకోని ప్రమాదాలు ఎదుర్కొని మరణించడం కూడా జరిగిందన్నారు. మరణించిన కుటుంబాలకు ఎలాంటి భీమా సౌకర్యాలు కల్పించలేదన్నారు. ఇకనైనా మళ్ళీ పాత కేటగిరీల ప్రకారం పనులు చేయించి కారొబార్లను అసిస్టెంట్ కార్యదర్శిగా ప్రమోషన్ ఇచ్చి, కార్మికులందరిని పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, హెల్త్ కార్డులు ఇచ్చి, జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేను కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కన్వీనర్ దుండ్ర పెల్లి రవీందర్, ఈ. దేవయ్య, కె. నాగరాజు, కె. గున్నయ్య, ఏ. ఎల్లయ్య, రమేష్, రాజేష్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/ నిజామాబాద్ ప్రతినిధిః** జిల్లా కేంద్రంలోని దాస్‌నగర్ వద్ద కారు బీభత్సవం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న పలువురు పైకి వెన్యూ కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం కారు రోడ్డు పక్కన ఉన్న కారును ఢీకొట్టింది. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు.

## ప్రజల సమస్యలు పట్టవా?

**ప్రజాపక్షం /నల్లగొండ :** రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని ప్రజల ఆశలని వమ్ము చేయకుండా పరిపాలన సాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు.ఆదివారం సిపిఐ నల్లగొండ నియోజకవర్గ సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.సత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్ల అధికారంలో ఉన్న కెసిఆర్ నిరంకుశ వైఖరికి, ఫ్యూడల్ పాలన వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కట్టారు అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద ఉన్నది ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో నిరుపేదలు ఇళ్ల స్థలాలు,రేషన్ కార్డులు,ఆసరా పెన్షన్ లను పరిష్కరించాలి కోరారు.వైద్యము అందని ద్రాక్షగా మారిపోయినది ప్రైవేట్ ఆస్పత్రులు పరీక్షల పేరుతో ప్రజల రక్త పిలిచి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు అని ఆరోపించారు.ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం అందించాలి ప్రభుత్వ ఆసుపత్రిలో సక్రమంగా పని చేయని డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమన్నారు.అదేవిదంగా జిల్లాలో సిపిఐ పటిష్టం కోసం నియోజకవర్గ,మండల,గ్రామ శాఖల నిర్మాణం సమావేశాలు జరుగుతున్నాయి ఆగస్టు 16,లేదా 17 తేదీలలో జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం జరుగుతుంది అని తెలిపారు. కెవిఎస్‌రెడ్డి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి,లెనిన్, కనగల్ మండల కార్యదర్శి సత్యనారాయణ,దోటి పందరి, ఎస్ కె మదర్, రామకోటి, సుజాత, కౌసల్య, జ్యోతి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్థలాలు, పక్కా ఇళ్లు ఎప్పుడిస్తారు?

కర్రె బిక్షపతి

**ప్రజాపక్షం/దామెర :** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పేదలకు ఇంటి స్థలాలతో పాటు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ హన్మకొండజిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి కోరారు. ఆదివారం సీపీఐ దామెర మండల సమితి సమావేశానికి జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి అధ్యక్షత వహించగా జిల్లా కర్యదర్శి ముఖ్య అతిథిగా మాట్లాడారు. జిల్లాలో ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు లేక వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికి అందరికి విద్య, వైద్యం, కూడు, గూడు, ఉపాధి లేక దారిద్ర్య రేఖకు దిగువనే జీవిస్తున్నారని అన్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేశాయే తప్ప పేదల సంక్షేమానికి కృషిచేయలేదని అన్నారు. పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే



జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో ఎమ్మార్వో కార్యాలయాల ఎదుట జూలై 19న ధర్నా కార్యక్రమాలు నిర్వహించి జూలై 26న జిల్లావ్యాప్తంగా ఉన్న పేదలను, గుడిసెవాసులను సమీకరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ ధర్నాకు అధిక సంఖ్యలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు, గుడిసెవసులు, పేదలు తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు కర్రె లక్ష్మ ణ్, మండల కార్యదర్శి అంబి సాంబయ్య, శివ, జయ, చంద్రయ్య పాల్గొన్నారు.

### హసన్‌పర్తిలో..

భారతకమ్యూనిస్టుపార్టీ హసన్‌పర్తి మండల సమితి సమావేశం ఆదివారం దోమ రాకేష్ అధ్యక్షతన జరుగగా ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి మాట్లాడారు. ఇండ్ల స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలు విజయవంతం చేయాలని కోరారు. సీపీఐజిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, బీకేఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి, బీసీహక్కుల రాష్ట్ర నాయకులు నేదునూరి రాజమౌళి, సీపీఐ జిల్లా నాయకులు కర్రె లక్ష్మ ణ్,మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి,ఎర్రకుమారస్వామి,పరుశరాములు ఉన్నారు.



## గంజాయి మత్తులో మైనర్లు

(మొదటి పేజీ తరువాయి)

గురి చేస్తున్నారు. వరంగల్, హన్మకొండ, కాజీపేట లలోని కొన్ని ప్రాంతాలలో సాయంత్రం గంజాయి మత్తులో దారి వెంట వెళ్లే అమ్మాయిలను ఈవ్ టీజింగ్ చేస్తున్నారు. దీంతో సాయంత్రం అయిందంటే మహిళలు, బాలికలు, చిన్నరులుబయటికివెళ్లేందుకు జంకుతున్నారు. తప్పని సరి పరిస్థితులలో వెళ్లాల్సి వస్తే వారి వెంట తల్లిదండ్రులను లేదా కుటుంబ సభ్యులలో ఎవరినైనా వెంట తీసుకువెళుతున్నారు. ఇక గంజాయి మత్తులో అర్ధరాత్రి వరకూ రోడ్ల వెంట అల్లరి చేస్తూ దారివెంట వెళ్లే వారిని సైతం భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. మరోవైపు మత్తులోనే వాహనాలపై తిరుగుతూ పెద్దఎత్తున వాహనాల సౌండ్ చేస్తూ రోడ్ల వెంట పరుగులు పెడుతున్నారు. ఇటీవల వరంగల్ నగరంలోని శంభునిపేట ప్రాంతమైన దూపకుంట రోడ్‌లో, శివనగర్‌లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. అలాగే వరంగల్ ఉర్సుకు చెందిన ఇద్దరు యువకులను గంజాయి తాగుతుండగా పోలీసులు గతంలో అరెస్టు చేశారు.ఇటీవల కూడా నగరంలో పలు ప్రాంతలలో గంజాయి పట్టుకున్నారు. అలాగే ఇటీవల ఇస్లామియా కళాశాల వద్ద పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా గంజాయి సేవిస్తున్న యువకుల విషయం వెలుగులోకి వచ్చింది. వీరిని మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇలా శివనగర్,కరీమాబాద్, బీఆర్ నగర్, లేబర్ కాలనీ, ఓసిటి, హన్మకొండలోని పలు నిర్మానుష్య ప్రాంతాలలో గంజాయి సరఫరా జరుగుతున్నట్లు తెలుస్తున్నది. పోలీసులు ఇప్పటికైనా గంజాయిని అరికట్టేలా పటిష్టమైన చర్యలు చేపట్టి విద్యార్థులు, యువకులు దాని భారి నుండి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

**కమిషనరేట్‌లో కంట్రోల్‌రూమ్ : సీపీ అంబర్ కిషోర్ ఝా**

వరంగల్ కమిషనరేట్‌లో డ్రగ్, గంజాయి నిరోధానికి కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మత్తు పదార్థాల నిరోధానికి డ్రగ్స్ టీంను కూడా ఏర్పాటు చేసి యువత, విద్యార్థులు మత్తు పదార్థాల భారిన పడకుండా గంజాయిలాంటి వాటి అక్రమ రవాణాను అరికడుతామని తెలిపారు. గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న వారిపై ఇక నుండి ఉక్కుపాదం మోపుతామని ఒక రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, ముగ్గురు ఆర్ఎస్పైలు, మరికొంత మంది పోలీసు సిబ్బందితో ఈ టీం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. ముఖ్యంగా విక్రయాలు జరిగే పాఠశాలలు, ప్రధాన కూడళ్లు,సినిమా టాకీస్‌లు, షఫింగ్ మాల్స్‌పై ప్రత్యేక నిఘ పెట్టనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే 8712584473 నెంబర్‌కు తెలపాలని,సమాచారంతెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడంతో పాటు భారీగా పట్టుబడిన క్రమంలో నగదు పురస్కారం కూడా అందిస్తామని తెలిపారు.

## ఒక్క పరీక్షా పెట్టలేదు

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు కల్పిం చామని అందమైన అబద్ధాల వల అల్లారు' అని చురకలం టించారు. ఎన్ఆర్ఎ ఎన్ని ఉద్యోగాలకు ప్రకటన చేసిందని తాను మరోసారి గుర్తుచేయాలనుకుంటున్నానన్నారు. కోట్లాది మంది యువతకు ఎన్ఆర్ఎ ఒక వరం అని, కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ ద్వారా, ఇది బహుళ పరీక్షలను తొలగిస్తుందని, విలువైన సమయాన్ని అలాగే వనరులను ఆదా చేస్తుందని, పారదర్శకతకు పెద్దపీట వేస్తుందని 2020 ఆగస్టులో చెప్పారని ఖర్గే గుర్తుచేశారు. ప్రధానికి ఖర్గే మూడు ప్రశ్నలు సంధించారు. గత 4 సంవత్సరాలలో ఎన్ఆర్ఎ ఒక్క పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదు? ఎన్ఆర్ఎకు రూ. 1,517.57 కోట్ల నిధులను అందించినప్పటికీ, 4 సంవత్సరాలలో ఇప్పటివరకు రూ. 58 కోట్లు మాత్రమే ఎందుకు ఖర్చు చేశారు? ఎన్ఆర్ఎ ఉద్యోగాల నియామకానికి ఏర్పాటు చేశారా? లేదా ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుస్ రిజర్వేషన్లు లాక్కోవడానికి చేశారా? అని ప్రశ్నించారు. ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)ను పరీక్షలను తారుమారు చేయడానికి, పేపర్‌లను లీక్ చేయడానికి ఉపయోగించుకున్నారని, అది ఎలాంటి పరీక్షలు నిర్వహించలేదని విమర్శించారు. గతంలో కూడా ఎన్ఆర్ఎ సమస్యను కాంగ్రెస్ లేవనెత్తిందని, అయితే మోడీ ప్రభుత్వం ఈ అంశంపై మౌన ప్రతిజ్ఞ చేసిందని ఖర్గే అన్నారు. గత నాలుగేళ్లలో రూ. 58 కోట్లు ఖర్చు చేసినా ఎన్ఆర్ఎ ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేకపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ఎక్స్‌పై ఒక పోస్ట్‌లో మీడియా కథనాన్ని ఉదహరించారు. 'కేంద్ర ప్రభుత్వం 2020లో యువత కోసం 'ఒక దేశం, ఒకే పరీక్ష'ను ప్రకటించింది. దీని బాధ్యతను జాతీయ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎ)కి చాలా ఆర్భాటంగా అప్పగించింది' అని ఆయన అన్నారు. అయితే ఈ ఏజెన్సీ గత 4 ఏళ్లలో రూ.58 కోట్లు ఖర్చు చేసినా ఒక్క పరీక్ష కూడా నిర్వహించలేకపోయిందని రమేష్ అన్నారు. ఎన్ఆర్ఎ కూడా ఎన్‌టిఎ మాదిరిగానే విఫలమైందని ఆయన పేర్కొన్నారు.

## నీటి నిలువకు ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు సీసీ బ్లాక్‌లను తొలగించి మళ్లీ వాటిని అమర్చుతున్నారు. నిన్న మొన్నటి వరకు వర్షాలు లేని కారణంగా మేడిగడ్డ అన్నారం బ్యారేజీల క్రస్ట్‌గేట్ల ముందు, వెనుక భాగంలో ఉన్న ఇసుక మేటలను కొంత మేరకు తొలగించారు. వీటిని పూర్తిస్థాయిలో తొలగించేందుకు రెండు రోజుల క్రితం టెండర్లనూ పిలిచారు. ఇదిలా ఉంటే తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంటోంది. కృష్ణా బేసిన్ లో ప్రాజెక్టులకు వరదనీరురావడంలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాలకు వరద తాకిడి తక్కువగాఉంది. ఇటు మూసీ నుంచి కృష్ణాలోకి ప్రవాహం చేరుతోందని అధికారులు చెబుతున్నారు. అటు శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు ఓ మోస్తారుగా వస్తోందని, సుమారు 49 వేల క్యూసెక్కులవరద నీరు వచ్చి చేరుతోందని ఇరిగేషన్ వర్గాలు పేర్కొంటున్నాయి.ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు,90టీఎంసీలుకాగా ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 1055.70 అడుగులు 41.452 టిఎంసిలుగా ఉందని చెబుతున్నారు.భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరుగనుంది. కాగా ఈ వర్షాకాలంలో అన్నారం, బ్యారేజీ నింపి ఎగువన సుందిళ్ల పంపుహౌస్ ద్వారా ఎత్తిపోసి నీటిని తరలించేందుకు ఇరిగేషన్ ఇఎన్‌సి జనరల్ అనిల్‌కుమార్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అన్నారం బ్యారేజీకి ఎగువన పెద్ద వాగు, మానేరు గ్రావిటీ ద్వారా వచ్చే వరద నీరు కూడా వాడుకునే వీలుందని, ఈ నీటిని ఎగువన సుందిళ్లకు తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. మేడిగడ్డ లక్ష్మి బ్యారేజీ 7వ బ్లాక్‌లో కుంగిన పియర్‌లు 19,20,21ల దిగువన సిసి బ్లాక్‌ల అమరిక, షీట్‌ఫైల్స్ దింపడం దాదాపుగా పూర్తయినట్లు తెలుస్తోంది.రెండురోజులుగా ఎగువన కురుస్తున్న వర్షాలతో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పనులు కొంత మేరకు నిలిచి పోయాయి. కొద్ది పాటి వర్షానికే అన్నారం బ్యారేజీ గేట్ల ముందు భాగంలోకి నీరు చేరుతోందని చెబుతున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన లక్ష్మిప్రసన్న

**ప్రజాపక్షం/వనస్థలిపురం:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగా రెడ్డి ఆధ్వర్యంలో కాటమయ్య రక్షణ కవచం పేరుతో కల్లుగీత కార్మికులకు సేఫ్టీ కిట్లను అందించారు. ప్రజలను నుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బిఎన్‌రెడ్డి నగర్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మి ప్రసన్న రామ్మోహన్‌గౌడ్ కలిసి శాలువతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ మధుయాష్కీ గౌడ్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, పార్లమెంటు సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, యెగ్గె మల్లేశం, ఏవీఎన్‌రెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోట మైసమ్మతల్లికి తొలిబోనం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆషాడ మాసంలో శ్రీ కోట మైసమ్మ అమ్మవారికి భక్తులు తొలిభోనం సమర్పించారు. ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని రైతు కాలనీలో ఉన్న శ్రీ కోట మైసమ్మ అమ్మవారికి మామిడిపల్లి మాజీ ఎంపిటిసి సభ్యురాలు మాధవి రవీందర్ దంపతులతోపాటు భక్తులు తొలిభోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి విజయం సాధిస్తే భోనం సమర్పిస్తానని మాజీ ఎంపిటిసి సభ్యురాలు మాధవి రవీందర్‌రెడ్డిలు మొక్కుకున్నారు. అందుభాగంగానే నేడు అమ్మవారి భోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి భార్య లక్ష్మి , మాజీ సర్పంచ్ ఉమాదేవిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్మగంటి జగన్ గౌడ్, రాంరెడ్డి, మల్లేష్, మాజీ సర్పంచ్ రాజేష్ గౌడ్, మహిళలు, భక్తులు తదితరులు ఉన్నారు.

# భారీ వర్షం.. రాజధాని అతలాకుతలం



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో చాల కాలంగా పలు జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షం కురువడంతో అన్నదాతల నిరీక్షణ కొంత ఫలించింది. రానున్న ఐదు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు రైతన్నలకు చల్లని కబురు అందించారు. ఉదయం నుంచి పూర్తిగా ఎండగా ఉన్న వాతావరణం మధ్యాహ్న తర్వాత ఒక్కసారిగా చల్లబడింది.ఆ తర్వాత పలు జిల్లాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురువగా హైదరాబాద్‌లో మాత్రం కురిసిన అతీ భారీ వర్షం నగర వాసులను ఉక్కిరిబిక్కిరి చేసింది. కేవలం గంట వ్యవధి లోని హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 6.5 సెం.మి. నుంచి 7.6సెం.మి వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మారెడ్‌పల్లిలో 7.53సెం.మివర్షంకురువగా, ఖైరతాబాద్, 7.4సెం.మి., మూషీరాబాద్‌లో 7 సెం.మి,షేక్‌పేట్‌లో 6.9, శేరిలింగంపల్లిలో6.8, బోరబండలో6.7, మాదాపూర్, ఉప్పల్‌లో6.6, సికింద్రాబాద్ మొండా మార్కెట్‌లో 6.1, మల్కాజ్‌గిరిలో 5.9, కూకట్‌పల్లిలో 5.7, సెం.మి. వర్ష పాత ంనమోదైంది. అలాగే రాష్ట్రంలోని పలు జిల్లాలో 3 నుంచి 5.5 సెమి. వర్షం కురిసింది. భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబుబాబాద్, ఆదిలా బాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్గొండ, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, జిల్లాలో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది.

**మరో 5 రోజుల పాటు వర్షం**

సోమవారం నుంచి శుక్రవారం వరకు 5 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉరుములు,మెరుపులతో కూడిన భారీ నుంచి అతిభారీవర్షాలుకురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ , కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుర గాలులతో కూడిన భారీనుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్, కొమరం భీం, ఆసిఫాబాద్, మంచిర్యాల నిర్మల్, జగిత్యాల రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాల పల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్ గిరి, మహబూబ్ నగర్ జిల్లా భారీ వర్షాలు కురవనున్నాయన్నారు. మంగళవారం ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణం అధికారులు తెలిపారు.



**హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం**

హైదరాబాద్ నగరాన్ని అతి భారీ వర్షం ముంచెత్తింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో నగర జీవనం అస్తవ్యస్తమైంది. మారెడ్‌పల్లి, సికింద్రాబాద్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, కుషాయిగూడ, దమ్మాయిగూడ,చర్లపల్లి, కీసర, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, హైదర్‌నగర్, కెపిహెచ్‌బి కాలనీ, బాచుపల్లి, ప్రగతినగర్, నిజాంపేట, కూకట్‌పల్లి, మూసాపేట అమీర్‌పేట్, ఈఎస్‌ఐ, ఎర్రగడ్డ, సనత్ నగర్, బోరబండ, పంజాగుట్ట, జూబ్లీ హిల్స్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, నారాయణ గూడ, హిమాయత్‌నగర్ , ఖైరతాబాద్, లక్డికపూల్‌లో భారీగా వర్షం కురిసింది. అదివారం సెలవురోజు కావడంతో ఆటవిడుపు కోసం బయటికి వచ్చిన నగరవాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో నగరంలోని పలు ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బందనంలో చిక్కుకున్నాయి. రోడ్లపై వరద నీరు నది కాల్వలను తలపించడంతో ప్రయాణికులు అష్ట కష్టాలు పడ్డారు. నగరంలోని అన్ని ప్రధాన రహదార్లుల్లో కిలో మీటర్లమేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రయాణికులు తడిసిపోయారు. రోడ్లపై నడుం లోతుకు మించి వరద నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులుఇబ్బందులు పడ్డారు. వరద దాటికి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని కృష్ణానగర్‌లో ఓ కారు కొట్టుకు పోయింది. నగరంలో చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రయాణికులు హడలిపోయారు.





**అప్రమత్తమైన జిహెచ్‌ఎంసి**

నగరంలో ఒక్కసారిగా భారీ వర్షం కురువడంతో జిహెచ్‌ఎంసి అప్రమత్తమైంది. అత్యవసర బృందాలను రంగంలోకి దింపిన అధికారులు ఎక్కడికక్కడ సహాయ చర్యలను చేపట్టారు. అవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావొద్దని జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి సూచించారు. వర్షానికి సంబంధించి ఏమైనా అత్యవసర సహాయంఅవసరమైతే 04021111111, 9000113667 నెంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

**క్షేత్రస్థాయిలో సందర్శించిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్**

హైదరాబాద్ నగరంలోని వర్ష ప్రభావ ప్రాంతాల్లో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దానకిషోర్ ఆదివారం రాత్రి పర్యటించారు. నగరంలోని శేరిలింగంపల్లి, ఖైరతాబాద్‌తో పాటు వరద ప్రభావిత ప్రాంతాలైన దుర్గం చెరువు, నెక్టర్‌గార్డెన్‌కు వెళ్లారు. ఆయన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులపై ఆరా తీశారు. దానకిషోర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి, జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిహెచ్‌ఎంసి, జలమండలి అత్యవసర బృందా లు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలనురంగంలోకి దించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించితక్షణమేపరిస్థితుల్ని చక్కదిద్దేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితుల్ని తెలుసుకోవాలని సూచించారు.

## జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ 50వ వార్షిక బోనాల స్వర్ణోత్సవాలు




**ప్రజాపక్షం / హైదరాబాద్ :** శ్రీశ్రీశ్రీ జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు సబ్జీమండి గంగపుత్ర సంఘం, గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 50 వ వార్షిక బోనాల స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఘనంగా అమ్మవారికి తొట్టెలా , బోనం సమర్పించారు. న్యూ గంగానగర్ లోని శ్రీశ్రీశ్రీ కనకదుర్గ దేవాలయం నుండి అమ్మవారికి భారీ తొట్టెల ప్రారంభమై సబ్జీమండి లోని మాత మహంకాళి దేవాలయం చేరుకుని అక్కడి నుండి అమ్మవారికి బోనం , తొట్టెల భారీ ఊరేగింపు సాగింది. ఈ ఊరేగింపులో ప్రత్యేక వేషధారణలతో పోతరాజుల విన్యాసాలు కొనసాగగా, అసంఖ్యాక భక్తజన సందోహంతో శ్రీశ్రీశ్రీ గోల్కొండ ఎల్లమ్మ వారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి తొట్టెలా , బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఆనందేశి విజయ్ కిషోర్ , ప్రధాన కార్యదర్శి ఆనందేశి వేణుబాబు , శ్రీశ్రీశ్రీ జగదాంబికా గోల్కొండ ఎల్లమ్మ బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లె వినోద్ కుమార్ , ప్రధాన కార్యదర్శి గుడుమని చంద్రకాంత్ , ముఖ్య అతిధులుగా బిజెపి కామారెడ్డి ఎంఎల్ఏ కాటిపల్లి వెంకటరమణ రెడ్డి , ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ గంగపుత్ర , గంగపుత్ర సంఘం పధాదికారులు, శ్రీ శ్రీ నల్ల పోచమ్మ , మాత మహంకాళి దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## యజమానిని బంధించి చోరీకి పాల్పడిన 8 మంది అరెస్టు




**ప్రజాపక్షం/హైదరాబాద్:**జీతాలు చెల్లించకపోవడంతో యజమానిని కిడ్నాప్ చేసి చోరీకి పాల్పడిన 8 మంది ఉద్యోగులను జూబ్లీహిల్స్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ ఎసిపి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌కు చెందిన రవిచంద్రారెడ్డి గచ్చిబౌలిలో గిగ్లీజ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేశాడు. ఈ సంస్థ కన్సల్టెన్సీల ద్వారా రిక్రూట్ అయిన 12000 మంది ఉద్యోగులకు జీతాలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందుల్లో పడిపోయింది. దీంతో బాధిత ఉద్యోగులు ఈ విషయంపై రవిచంద్రారెడ్డిపై రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో జాబ్‌ఫ్రాడ్ చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలావుండగా బాధిత ఉద్యోగుల్లో ఎనిమిది మంది ఎర్రగడ్డకు చెందిన ఆకుల జగదీష్ (34), షేక్ ఆజాద్ (24),గచ్చిబౌలికి చెందిన కోలగట్ల గౌతమ్ (26), నాగోల్‌కు చెందిన కథా శివ శంకర్‌రెడ్డి(24), సుదగాని సుజిత్ కుమార్ (24), బాచుపల్లికి చెందిన కమల్‌తేజ (27), చిక్కడపల్లికి చెందిన కర్నాటి ముఖేష్ (33), ముషీరాబాద్‌కు చెందిన రాకేష్ అలియాస్ ప్రవీణ్ (24)లు ఈ నెల 9న అర్ధరాత్రి సమయంలో నందగిరి హిల్స్‌లో నివాసముంటున్న రవిచంద్రారెడ్డి ఇంట్లోకి ప్రవేశించారు. రవిచంద్రారెడ్డితో పాటు అతని స్నేహితుడు మోహన్‌పై దాడి చేశారు. ఇంట్లో ఉన్న 80 ల్యాప్‌టాప్‌లు, ఐదు మొబైల్ ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. రవిచంద్రారెడ్డి తల్లి మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులందర్ని ఆదివారం అరెస్టు చేసి వారి నుంచి 80 ల్యాప్‌టాప్‌లు, నాలుగు కార్లు, బైక్, 18 ఫోన్‌లు, మూడు పాస్‌పోర్టులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## వికలాంగుల పోస్టుల భర్తీ ఎప్పుడు?




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర సాయి మూడవ మహాసభలను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కరువునెల్లి వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కిని రాజులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల పోస్టులను భర్తీ చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను సకాలంలో చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగునంగా పెన్షన్ ఇవ్వాలని, దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న పించన్లు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ఉన్నామని, వాటి నిధులకు కేంద్ర ప్రభుత్వం దారి మళ్లించి మరో పథకాలకు వినియోగిస్తుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల పట్ల చిన్నచూపు చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకట్ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం చివరిలో వికలాంగులకు నిధులు కేటాయించడంతో పూర్తి స్థాయిలో వాటిని వినియోగించలేని దుస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల ప్రచారం కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్నారు..కానీ వికలాంగులకు నిధులు కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామీణ స్థాయి నుండి వికలాంగుల వివరాలను సమగ్రంగా సేకరిస్తే మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి జిల్లా ఉపాధ్యక్షుడు చేగూరి శేఖర్, సహాయ కార్యదర్శి నాగార్జున, శ్రీనివాస్, అంతటి మహేష్ గౌడ్, బాల్‌రాజ్, కసాల యాదయ్య, బోడ శ్రీనివాస్, జానయ్య, నర్సింహ్మాలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లకు మరమ్మతులు

**ప్రజాపక్షం/కొత్తూరు:** చిన్నపాటి వర్షానికే పాత జాతీయ రహదారి చెరువును తలపిస్తుంది. కొత్తూరు బ్రిడ్జి నుండి వై జంక్షన్ వరకు పాత జాతీయ రహదారి నరక ప్రయాగంగా మారిపోయింది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంలో స్థానిక కౌన్సిలర్ కరుణ శ్రీ జాడగూడెం సుదర్శన్ గౌడ్, వీరమోని మహేందర్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో టిప్పర్లతో మట్టిని పోయించి మరమ్మత్తులు చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే పాత జాతీయ రహదారి మరమ్మత్తులకు నోచుకోకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేసి శాశ్వస పరిష్కార మార్గాలను ఏర్పాటు చేస్తామని వివరించారు.

## ఎత్తిపోతలకు నిధులు ఇవ్వరూ..

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతుల పథకానికి నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమస్యలతో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతుల ప్రాజెక్టును నిర్మిస్తే సుమారు ఎనిమిది నియోజకవర్గాల ప్రజలకు సాగునీరు, తాగునీరు అంధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని లక్ష్మీ దేవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మిస్తే ఎత్తైన షాద్‌నగర్ ప్రాంతా అన్నదాతలకు సాగునీరు,తాగునీరుఅంధించేందుకుఅవకాశం ఉంటుందన్నారు. దాంతో వెనుకబడిన ఈ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్నదాతలకు సాగునీరు, తాగునీరు అంధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఎన్నో ఏళ్ల తరబడి ఈ ప్రాజెక్టుల కోసం ఈ ప్రాంత ప్రజలు, అన్నదాతలు ఎదురు చూస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా పూర్తి చేసేందుకు బాగుంటుందని వివరించా రు. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందిస్తూ ఈప్రాజెక్టులనునిర్మించేందుకు కావాల్సిన నిధుల విషయంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి చర్చిస్తామన్నారు. షాద్‌నగర్ దగ్గర ఉన్న లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు కృషి చేస్తామని, శాసన సభ ఎన్నికల్లో సైతం ప్రజలకు హామీ ఇచ్చామని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని కోరారు. పరిగి, చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, మనోహార్‌రెడ్డి ఉన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న కల్లు గీత వృత్తి పనివారల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిల్ గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షుడు పల్లె రాములు,కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్ మెట్‌లో ఆదివారం నిర్వహించిన గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కిట్స్' పంపిణీ కార్యక్రమం జరిగింది. సిఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రతినిధుల బృందం వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో గీత వృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమంతో పాటు వనాల పెంపకానికి 10 ఎకరాల చొప్పున భూమిని కేటాయించాలని, ప్రస్తుతం ఉన్న ఎక్స్‌గ్రేషియాను పెంచాలని కోరారు. కల్లు గీత సమయంలో ప్రమాదానికి గురైన కార్మిక కుటుంబాలకు రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలు, తాత్కాలిక గాయాలైన బాధితులకు రూ. రూ. 2లక్షలను పెంచాలని, అలాగే మెడికల్ బోర్డ్ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ సివిల్ అసిస్టెంట్ సర్జన్ పర్యవేక్షణలో తాత్కాలిక/ శాశ్వత వికలాంగుడి నిర్ధారణ సర్టిఫికెట్ పద్ధతిని పునరుద్ధరించాలని వారు సిఎంను కోరారు. జిల్లాలోని అన్ని కల్లు గీత వృత్తి సహకార సంఘాలు, టిఎఫ్‌టి, శాశ్వత లైసెన్స్, అర్హులైనవారందరికీ గుర్తింపు కార్డులను, ,సభ్యులకు ఉచితంగా వృత్తి పరికరాలు, వాహనాలు, కల్లు దుకాణాల ఏర్పాటుకు గ్రామాలలో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని, పట్టణాల్లో రెండు చదరపు గజాల స్థలాన్ని కేటాయించాలని , అలాగే వాటి నిర్మాణానికి ఆర్థిక సహాకారం అందించాలని కోరారు. కల్లు గీత పారిశ్రామిక ఆర్థిక సహాకంర ,కార్పొరేషన్ కురూ.5వేలకోట్లుకేటాయించాలన్నారు.ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు,ప్రజానాయకులు,పార్లమెంట్ ,శాసన సభ మాజీ సభ్యులు దివంగత బొమ్మగాని ధర్మభిక్షం గీత పనివారల సంఘం, అఖిల భారత గీత పనివార్ల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యమాలు,వాటి ఫలితంగా కల్లు గీత వృత్తిలో గతంలో ఉన్న హర్రాస్ విధానం రద్దుతో పాటు సహకార సంఘాలు, నీరా తదితర లాంటి పథకాలను సాధించుకున్నామని వారు వివరించారు.















ఆదివారం గోల్కొండకోట వద్ద బోనాల సందడి దృశ్యాలు

## డిఎస్సి వాయిదా వేయండి

బిసి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** రాష్ట్రంలోని నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు ,ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరువల్ల నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సర్కారు ఉద్యోగాల భర్తీ హర్షనీయమైన నిరుద్యోగుల డిమాండ్లు , విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకొని సానుకూలంగా స్పందించి డీఎస్సీని వాయిదా వేయాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల భర్తీ విషయంలో తీసుకుంటున్న విషయంలో స్వాగతిస్తూ ప్రిపరేషన్ విషయంలో సమయం లేనందున పరీక్షలకు మధ్య ఎక్కువ సమయం లేనందున, టీచర్ ఉద్యోగులకు సంబంధించి సిలబస్ బాగా పెరిగినందున వాయిదా వేయాలని ఆయన కోరారు. పదేళ్లపాటు ఉద్యోగాల కోసం వేచి ఉండటంతో నిరుద్యోగ యువతలో ఆత్రుత ఆందోళన పెరిగాయి. వరుస పరీక్షల నిర్వహణ షెడ్యూలు ఇప్పటికే ప్రకటించిన పోటీ పరీక్షలపై నిర్ణయించుకోలేని స్థితితో నిరుద్యోగులు ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఆలోచించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వ పరంగా స్పందించడం లేదా ఉద్యమాలు చేపడుతున్న సంఘాల ప్రతినిధులతో చర్చించి సమస్యను పరిష్కరించి ముందుకు వెళ్లాలని శ్రీనివాస్ సాగర్ కోరారు.



## ఘనంగా మల్లు రవి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవి జన్మదిన వేడుకలను ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పిలిస్తే పలికే నాయకుడు మల్లురవిగా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పార్టీ సిద్ధాంతల కోసం పనిచేస్తూ పార్టీ బలోపేతం ఎంతో పాటు పడుతున్నారని అన్నారు. సీనియర్ నేతగా గుర్తింపు పొంది ఎంతోమంది యువ నాయకులకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. మల్లురవి భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు, బెక్కరి అనిత, లింగం నాయక్, అజ్మత్ అలి, ఆవేజ్ అహ్మద్, నాగరాజు, ముజీబ్ తదితరులు ఉన్నారు.



**మల్దకల్‌లో ...**

**ప్రజాపక్షం/ మల్దకల్ :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలో ఆదివారం అంబేద్కర్ కాలనీలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎంపీ డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేసి ఒకరికి ఒక్కరు కేకు తినిపిస్తూ ఘనంగా నిర్వహించారు .ఇందులో భాగంగా ఇటువంటి జన్మదిన వేడుకలు ముందు భవిష్యత్‌లో ఇంక ఎన్నో జరుపుకోవాలని ,వారి ఆరోగ్య ఐశ్వర్యాలతో నిండు నూరేళ్ల ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో సద్దలోని పల్లి మాజీ సర్పంచ్ గోపాల్ ,మాజీ ఎంపీపీ గోవిందు ,సీకిన మల్దకల్ ,రాజేష్ ,ఎకోబు, ప్రవీణ్ లు ఉన్నారు .



**ఎంపి జన్మదిన వేడుకలలో తగిలికృష్ణయ్య**

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు, నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి పుట్టినరోజు వేడుకలలో పెద్దకొత్తపల్లి కాంగ్రెస్ మండలఅధ్యక్షులు తగిలికృష్ణయ్య పాల్గొని డాక్టర్ మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తగిలికృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఇందిరమ్మరాజ్యంకోసం ఎన్ని అడ్డంకులు, అవరోధాలు వచ్చిన ఢిల్లీనుంచి గల్లీదాకా కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం అహర్నిశలు కష్టపడి, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి డాక్టర్ మల్లురవి కీలకపాత్ర పోషించారని అన్నారు.



**కల్వకుర్తి...**

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో కేక్‌కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి, ఎన్నంభూపతిరెడ్డి, కల్వకుర్తిబ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు కాయితివిజయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్‌లు గోరటిశ్రీనివాసులు, రవీందర్, మాజీకౌన్సిలర్ రామరాజు, నాయకులు భాస్కర్‌రెడ్డి, పుస్తకాలరాహుల్, మిర్యాలదామోదర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, భాస్కర్, చెన్నకేశవులు, వెంకటేష్, దున్నసురేష్, పరుషరామ్ పాల్గొన్నారు.

**వెల్దండలో :**

**ప్రజాపక్షం/వెల్దండ :** మల్లురవి జన్మదినం సందర్భంగా మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో పార్టీకార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్, పండ్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో తాలుకాకిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, మట్టవెంకటయ్యగౌడ్, ఎర్రశ్రీనుముదిరాజ్, తిరుపతిరెడ్డి, మల్లెపూలలక్ష్మ య్య, కొయ్యలపుల్లారావు, నారాయణ, నాగేష్‌గౌడ్, కిష్టాల్, నర్సింహ్మ పాల్గొన్నారు.



**ఆరోగ్యంగా జీవించాలి**

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : పార్లమెంట్ పరిధిలోని పేదలకుమరింత సేవలుచేసేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్దిదారులకు అందించేందుకు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించాలని ఎంపిడాక్టర్ మల్లురవి రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో ముందుకుసాగాలని ఎమ్మెల్యే డాక్టర్‌రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం డాక్టర్‌మల్లురవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన స్వగృహంలో పుష్పగుచ్ఛంఅందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మెగారెడ్డి, కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

పేద ప్రజల సంక్షేమానికి పాటుపడిన ఇందిరాగాంధీ

# సంవిదాన్ హత్యా దివస్‌గా గెజిట్ సరికాదు

టిపిసిసి ఉపాధ్యక్షుడు, టిజిఎంఎఫ్‌సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ తన హయాంలో పేద ప్రజల సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారని టీపీసీసీ ఉపాధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజభరణల రద్దు చేసి బ్యాంకులను జాతీయం చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత ఇందిరాగాంధీ కి దక్కుతుందన్నారు. ఇందిరాగాంధీ పేదలకు చేస్తున్న మేలును జీర్ణించుకోలేని అప్పటి పెట్టుబడిదారులు, రాజులు, కుట్రపూరితంగా వ్యవహరించి ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూశారని, అందువల్ల తప్పనిపరిస్థితుల్లో ఎమర్జెన్సీ విధించినట్లు తెలిపారు. ఎమర్జెన్సి పట్ల అపోహలు ఉన్నప్పటికి తర్వాత ప్రజలకు అర్థమైందని, రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. కాని 1975 లో ఎమర్జెన్సీని ఇప్పటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సంవిదాన్ హత్య దివాస్‌గా గజిటెడ్ తీసుకురావడం సరికాదని, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గజిట్‌ను వెంటనే విరమించుకోవాలని డిమాండు చేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండియా కూటమి పట్ల దేశావ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న మద్దతును తట్టుకోలేక బిజెపి ప్రభుత్వం ఎమర్జెన్సీని ముందుకు తెస్తున్నదని ఆరోపించారు. ప్రజల మధ్య వైషమ్యాలు తీసుకోస్తూ స్వార్ధ రాజకీయాలకు పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. రాజ్యాంగానికి తూర్పు పొదుస్తున్న మీరు రాజ్యాంగం గురించి మాట్లాడుతుండడం హాస్యాస్పదమని అన్నారు. బిజెపి విధానాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్, డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, లింగం నాయక్, అజ్మత్ అలీ, అనేజ్ అహ్మద్, నాగరాజు, ముజీబ్ తదితరులు ఉన్నారు.



జాతీయ స్థాయి టైక్వాండో ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో

## కొత్తకోట విద్యార్థికి బంగారు పథకం

**ప్రజాపక్షం / కొత్తకోట :** ఈ నెల 12,13,14లో హైదరాబాద్‌లో శ్రీ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు వెట్రాన్స్ ఇండియా స్పోర్ట్స్ వింగ్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు తమిళనాడు మహారాష్ట్ర కర్ణాటక ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా , ఉత్తర ప్రదేశ్‌కి సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో కొత్తకోటకు చెందిన గాడ్స్ అన్ వారియర్స్ టైక్వాండో అకాడమీ చెందిన మాస్టర్ అబ్దుల్ నబీ శిష్యులు పాల్గొని బంగారు పథకం సాధించాలని తెలిపారు. అండర్ 13 ఇయర్స్ , 26 కేజీల విభాగంలో పొంసే ఈవెంట్లో పాల్గొని ఎస్‌కె. గౌస్ పాషా బంగారు పథకం సాధించారు. పథకం సాధించిన విద్యార్థికి గ్రౌండ్ మాస్టర్ జయంతి రెడ్డి చేతుల మీదుగా పథఖం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ అబ్దుల్ నబీ, సయ్యద్ అహ్మద్ , ఆజాద్ , జాఫర్ , సాధిక్ , హరీష్ యాదవ్ , పృధ్వీరాజ్ , శివరాజ్ , ఇంతియాజ్ , అంజి, అరవింద్ చారి, కురుమూర్తియాదవ్ , మీ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

## తాగునీటి సమస్యకు చెక్

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** మండల పరిధిలోని కంబళపురం గ్రామంలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే మెగారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి గ్రామానికి బోర్ బండి పంపించి బోర్ వేయించడం జరిగిందని కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే మెగా రెడ్డికి , మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డికి కంబళపురం గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేష్ , మాజీ సర్పంచ్ వెంకటయ్య, యువకులు, గ్రామస్తులు ఉన్నారు.

## అక్రమ కట్టడాల కూల్చివేత

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రభుత్వస్థలాల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లను తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో మన్ననూరు గ్రామంలో కూల్చివేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన్ననూరు గ్రామంలోని రైతువేదిక సమీపంలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వస్థలంలో ఉన్న అక్రమనిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు తెలిపారు. ఈస్థలంలోఎలాంటి అనుమతులులేకుండా అప్పటి రాజకీయనాయకుల అండదండలతో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారన్నారు. దీనిపైగతంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పలునోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. అయిన పట్టించుకోకుండా నిర్మాణాలు చేపట్టారని ఇందుకు అప్పటి ప్రభుత్వ నాయకుల అండదండలు ఉన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఇండ్లనుకూల్చివేస్తున్నట్లు తెలిపారు. మన్ననూరులోని ఆర్అండ్‌బి అతిథి గృహం నిర్మించేందుకు నిధులుమంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. శ్రీశైలం హైదరాబాద్ జాతీయరహదారిపై ఎలాంటి అక్రమ నిర్మాణాలుచేపట్టిన నోటీసులేకుండా కూల్చివేస్తామన్నారు.

## ముగిసిన ఉచితసర్జికల్ ఆపరేషన్లు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తనవృత్తిని పేదప్రజలకు అందించేందుకు గతనెల 11నుంచి నేటివరకు ఉచిత సర్జికల్ ఆపరేషన్లు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిరీత్యా తాను వైద్యుడినని ఎమ్మెల్యే అయినప్పటికి పేదలకు సహాయం చేయాలని 21రోజుల్లో 660 సర్జికల్ ఆపరేషన్లుఅచ్చంపేట వందపడకల ఆస్పత్రిలో చేసినట్లు తెలిపారు. ఇక్కడి ప్రాంతీయులంతా అట్టడుగు పేదవర్గాలవారు అధికంగా ఉన్నందున ఈక్యాంపు నిర్వహించి ఉచిత ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల20నుంచి ఉచితకార్డియాలజీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిలోచేసిన వీడియో విడుదల చేశారు. నల్లమలలో మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో వైద్యశాఖమంత్రి దామోదరరాజనర్సింహ్మాతో ప్రారంభించి నిర్వహించినట్లు తెలిపారు.



## ఘనంగా గోరింటాకు మహోత్సవం

ప్రజాపక్షం/వెల్దండ : మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ప్రిన్సిపాల్ స్రవంతి గోరింటాకు మహోత్సవం వేడుకను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆషాడమాసంలో ఆడపడుచులు గోరింటాకు పెట్టుకుంటే మహాలక్ష్మి ఇంటికి వస్తుందని, గోరింటాకు పెట్టుకొని ఎర్రగా పండటంతో ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో కొత్తగాచేరిన విద్యార్థినిలకు ఇంటివాతావరణాన్ని సృష్టించడం కోసం ఇలాంటి వేడుకలను జరుపుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



## తల్లి లేని లోటు తీరనిది

జర్నలిస్టు మాతృమూర్తికి ఘన నివాళి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** సృష్టికి మూలం అమ్మ ఆ తల్లిని లోటు తీరనిది అని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ అన్నారు. ఆదివారం విలేకరి శ్రీనివాస్ మాతృ వినియోగం తెల్లవారు జామున జరగడంతో విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూ (ఐజేయూ) జిల్లా నాయకులతో కలిసి పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో భౌతిక దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గుండ్రాతి మధుగౌడ్ మాట్లాడుతూ జర్నలిస్ట్ శ్రీనివాస్ కుటుంబానికి వెండంటూ ఉంటామని భరోసా కల్పించి శోకసముద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఆయనతో పాటు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు, యూనియన్ జిల్లా ఎడ్యుకేషన్ కన్వీనర్ మోహన్ , ఆంధ్రప్రభ సీనియర్ జర్నలిస్ట్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానస్పద మృతిపై కేసు నమోదు



**ప్రజాపక్షం / పెబ్బేరు :** మండల కేంద్రంలో స్థిరబడ్డ నాగరాల గ్రామానికి చెందిన నర్సిములు (54) తన ఇంటిలో మంచంపై విగత జీవిగా పడి ఉండటంతో తన అన్న కుమారుడు ప్రమోద్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు స్థానిక స్టేషన్ హౌస్ ఆఫీసర్ హరి ప్రసాద్ రెడ్డి నూతన చట్టాల ప్రకారం భారత న్యాయ సురక్ష సంహిత సెక్షన్ 194 ప్రకారం క్రైమ్ నంబర్ 175/2024 కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# ఆరోగ్య భద్రతకే అధిక ప్రాధాన్యత

**-బాధితులకు చెక్కుల పంపిణీ**

**-గ్రామీణ మహిళలతో ముచ్చటించిన పొంగులేటి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల పరిధిలోని 132 మందికి రూ. 3266500 విలువ గల సిఎంఆర్ఎఫ్ చెక్కులను క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని పొంగులేటి తెలిపారు. ఎల్‌వోసిల ద్వారా 120 మంది అనారోగ్య బాధితులకు కోటి రూపాయలకు పైగా ఇప్పించడం జరిగిందన్నారు. పాలేరు నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు వెళుతూ మధ్యలో వ్యవసాయ పనులు చేస్తున్న మహిళలతో ఆయన ముచ్చటించారు. రైతు భరోసా పథకం పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలో కొండాపురం, ఆరెంపుల సహా పలు గ్రామాల్లో సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. గూడూరుపాడులో ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఎంఅండ్‌హెచ్‌వో మాలతి, ఆర్డీవో గణేష్, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## నిధులు మంజూరు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని జిల్లెల్ల గ్రామంలో పలు అభివృద్ధిపనులకు మాజీసర్పంచ్ జిల్లెల్లరాములు విన్నపంమేరకు ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి 5లక్షల రూపాయల నిధులను మంజూరు చేశారు. నిధుల మంజూరుకాపిని మాజీసర్పంచ్ జిల్లెల్లరాములుకు అందజేశారు. ఇప్పటికే గ్రామానికి 80లక్షలనిధులు మంజూరుచేశారని, ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధిచేస్తామని అడిగినవెంటనే గ్రామంలో అభివృద్ధిపనులకు నిధులు మంజూరుచేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో పూరిచిన్నబాలరాజు ఆధ్వర్యంలో శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా కన్నులపండుగగా ఈసందర్భంగా ఉత్సవ విగ్రహాలను మండలకేంద్రంలో పురవీధులగుండా ఊరేగింపు నిర్వహించి వేదమంత్రోచ్చరణలమధ్య కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చి కల్యాణం ఈకల్యాణ మహోత్సవానికి చుట్టుపక్కలగ్రామాల మహిళలతోపాటు సుదూర ప్రాంతాలనుంచి మహిళలుభక్తులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు. కల్యాణ ఉత్సవానికి పలువురు నాయకులు హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధపార్టీల నాయకులు ఎన్నంభూపతిరెడ్డి, ఎన్నంవిజేందర్‌రెడ్డి, చిందంకృష్ణయ్య, నక్కరకంటిశ్రీనివాసులు, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రవిద్యాకమిటి చైర్మన్ మిడిదొడ్డిశ్యాంసుందర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చురామకృష్ణ,మట్టవెంకటయ్యగౌడ్, పాపిశెట్టిరాము, ఎర్రశ్రీనుముదిరాజ్, కొయ్యలపుల్లారావు, పూరిచిన్నబాలరాజు, పూరిరమేష్, బాలస్వామి, బికుమండ్లశ్రీనివాస్, పూరివజ్రలింగం ఉన్నారు.

## ఆర్‌టిసి చైర్మన్ ఎంపికపట్ల హర్షం

ప్రజాపక్షం/వంగూర్ : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణను తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి కార్పొరేషన్‌చైర్మన్ ఎంపికవిషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం హర్షణీయమని అచ్చంపేట నియోజకవర్గ యూత్‌కాంగ్రెస్ అధ్యక్షులు క్యామమల్లయ్య అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు రాష్ట్రప్రభుత్వం సముచితస్థానం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని చెదురుపల్లి గ్రామానికిచెందిన నిరంజన్ శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందాడు. నిరంజన్ మృతిచెందిన విషయాన్ని చారిటబుల్‌ట్రస్టు సభ్యులద్వారా తెలుసుకున్న మిషన్‌భగీరథ మాజీవైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీజడ్పిటిసి ఉప్పలవెంకటేష్ ఫోన్లో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబసభ్యులకు ట్రస్టు సభ్యులు చంద్రశేఖర్‌ద్వారా ఆర్థికసాయం అందజేశారు.



## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి : కోడేరు మండలకేంద్రంలో మాజీజడ్పివైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి నివాసంలో మాజీ ఎమ్మెల్యేబీరం హర్షవర్దన్‌రెడ్డి ఆదివారం బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులతో సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ముత్తిరెడ్డిపల్లి గ్రామంలో కిష్టమ్మ సంవత్సరికం కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. ఎత్తం గ్రామానికిచెందిన బెక్కం కృష్ణారెడ్డి గత కొద్దిరోజులక్రితం విద్యుత్‌షాక్‌తో మరణించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఆయనవెంట టిఆర్‌ఎస్ నాయకులతోపాటు గ్రామప్రజలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలకు యువత చేయూత

**ప్రజాపక్షం/జడ్చర్ల :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామంలోని యువకులు అందరు చేయి చేయి కలిపి ముందుకు నడిచారు. గంగాపురం గ్రామంలోని యువకులందరు ప్రభుత్వ పాటశాలలో కావలసిన ఆటస్థలం దాని చదునుకు ముందుకు వచ్చి మొర్రం మట్టి వేయించడం ఆట వస్తువులు అందజేయడం మొదలైనవి చేకూర్చి విద్యార్థులు ప్రగతికి ముందుకు నిలిచారు. దీనిలో మైలారం శివారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీరు గ్రామ యువకులు కేశవ్, గౌరి శంకర్, నరేశ్ చారి, చంద్ర ప్రకాశ్, అరవింద్, శివ పాల్గొన్నారు. వీరిని గంగాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జిహెచ్‌యం అనంతప్ప పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి మాట్లాడుతూ ఇదే పాఠశాలలో చదివి పాఠశాల అభివృద్ధికి పాటు పడడం ఆనందంగా ఉందని, యువకులందరు ఇలాంటి కార్యక్రమంలో ముందుండాలని కోరారు.



## శ్రీతిమ్మప్ప స్వామి దేవాలయం దర్శించుకున్న అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం /మల్దకల్:** శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని ఆదివారం జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ ముసివి వెంకటేశ్వర్లు అధికారులతో కలిసి సందర్శించుకున్నారు వారికి ఆలయ అర్చకులు మధుసూదనాచారి ,రామేష్ ,రవి స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు .అనంతరం స్వామి వారి శేష వస్త్రం అందజేశారు .ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ కాంతమ్మ ,డిఆర్ డిఓ నర్సింగరావు ,చంద్రశేఖర రావు తదితరులు ఉన్నారు.

## 18న బషీరాబాద్‌కు మంత్రి కోమటిరెడ్డి రాక

**ప్రజాపక్షం/తాండూరు:** ఈ నెల 18న బషీరాబాద్ మండలానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలో జరిగే వ్యవసాయ మార్కట్ కమిటి కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యఅథితిగా హాజరు కానున్నారని తెలిపారు. వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాలతో పాటు మండలంలో వివిధ రోడ్లు, భవనాల అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తారని తెలిపారు. .

## సిఎంతో ఎమ్మెల్యే సోదరుడు భేటీ

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు తాండూరు ఎంఎల్ఎ సోదరుడు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డితో బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన సిఎంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిఎం తాండూరు కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. పలు



రాజకీయ అంశాలపై వారు చర్చించారు.

## ఆదిత్య విల్లా క్లబ్ కమిటీ హాల్ ప్రారంభం



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి దండముడి ఎంక్లవ్ వద్ద నిర్వహించిన ఆదిత్య విల్లా క్లబ్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని కమ్యూనిటీ హాల్ ప్రాంగణం లో మొక్కలు నాటీ రిబ్బన్ కట్ చేసి కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన మేడ్చల్ మల్కాజ్గిరి బీజేపీ పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు సభ్యులు ఆర్ భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ సర్కిల్ డీసీ నర్సింహ, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, ఈ కార్యక్రమం లో ఆదిత్య విల్లా చైర్మన్ వి.భాస్కర్ రెడ్డి, ఎ.వెంకటరమణ, ఎన్.జగన్ మోహన్ రెడ్డి, వి.రాజశేఖర్ రెడ్డి, ఎ.సుధాకర్ రెడ్డి, ఎం.వి.ఎల్ ప్రసాద్, భాస్కర్ రావు, నిర్మల్ అగర్వాల్, పి. లీలా,గిరివర్ధన్ రెడ్డి, కట్ట కుమార్, వెంకటేశ్వర రెడ్డి, వెంకట్ రెడ్డి,నార్లకంటి దుర్గయ్య,ప్రభాకర్ రెడ్డి,జె. రాజు,ఎశ్వంత్,శ్రీకాంత్ రెడ్డి, వర్మ, ఈశ్వర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యావంతులకు అవకాశమివ్వాలి



**ప్రజాపక్షం/బంట్వారం :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చదువుకున్నా నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని బస్వాపూర్ గ్రామ చేందిన పాఠశాల మాజీ విద్యా కమిటి అధ్యక్షులు మంగలి శివరాజ్ శుక్రవారం అన్నారు. సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో అబివృద్ధి జరగాలంటే చదువుకున్నా విద్యావంతులైన యువతకు అవకాశం కల్పిస్తే ప్రభుత్వ నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధి కోసం వారి బాధ్యత మరచిపోకుండా ఆహర్నిషలు ప్రజ సమస్యల పట్ల నిర్లక్ష్యం చేయకుండా గ్రామాల్లో నాణ్యత కుడి పనులు చేసేందుకు విలుంటుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అధిక నిధుల తీసుకొచ్చి గ్రామాలను ఉన్నతమైన గ్రామాలుగా తిర్చి దిద్దెందుకు అవకావముంటుందన్నారు. గ్రామాల్లో నిరుద్యోగా యువత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చిన్న తరహా పరిశ్రమలకు కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైన ఇక కనీసం విద్యార్హత ఇంటార్మీడియట్ లేదా డిగ్రీ చదువుకున్న విద్యావంతులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం

**ప్రజాపక్షం/తాండూరు:** ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఎంతటి కష్టమైన సాధించవచ్చునని తాండూరు మాజీ జడ్పీటిసి గౌడ్ మంజుల వెంకటేశం అన్నారు.తాండూరు మండల పరిధి చెంగోల్ గ్రామంలో ఉచిత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. పేద వారికి ఉచిత వైద్యాన్ని అందించెందుకు ముందుకు వచ్చిన స్పందనరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెంగోల్ గ్రామంలో ఇక నుండి ప్రతి నెల ఉచితి వైద్య శిబిరాన్ని ఏర్పాటు కృషి చేస్తానని అన్నారు. ఉచిత వైద్య శిభిరంలో 126మంది పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడి విష్ణు, శృతి, లయ, రవి, వెంకటయ్య, గోరెప్ప, శ్రీకాంత్, ఎం. చిన్న, గ్రామస్తులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి అభద్రతా భావం : బిజెపి కార్పొరేటర్ శ్రవణ్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** రంగారెడ్డి జిల్లాలోని అబ్దుల్లాపూర్‌లో ముఖ్యమంత్రి సభ జరుగుతోందని మల్కాజిగిరి జిల్లాలో బిజెపి కార్యకర్తలను అరెస్టు చేయటం అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి అభద్రతా భావం, తప్పులు చేస్తున్నామన్న భయం ఏర్పడిందన్న విషయాన్ని స్పష్టం చేస్తోందని బిజెపి ఒబిసి తెలంగాణా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గోపాల కృష్ణ, మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, వినాయకనగర్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఓం ప్రకాష్,ఎం.సాయికుమార్, బిజెవైఎం మేడ్చల్ జిల్లా నాయకులు శ్రీకాంత్ యాదవ్, కృష్ణప్రసాద్, జహంగీర్‌లు అన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి
చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి వెంకన్నహిల్స్ ఫేస్2 లో స్థానికులతో కలిసి కాలనీ లో పర్యటించి స్థానిక సమస్యలు మరియు కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందుల గురించి కాలనీ వాసులను అడిగి తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, ఈ కార్యక్రమం లో కాలనీ అధ్యక్షులు జయం చారీ, జనరల్ సెక్రటరీ శ్రవణ్,లక్ష్మణ్ నాయుడు,రాజేందర్, పర్రంకుశం నాయుడు, సుభాష్, తిరుపతి రెడ్డి, దుర్గా రావు, సత్యనారాయణ, రవీంద్ర రెడ్డి, మేఘన, కీర్తి చంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రావు, ప్రహ్లాద్, రమేష్, పిచ్చయ్య, యాదగిరి, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్
# బోనాలకు ముస్తాబు

ఆగస్టు 4న వైభవంగా బోనాల జాతర



**ప్రజాపక్షం/బోడుప్పల్:** తెలంగాణలో అమ్మవారిని పూజించే ఉత్సవం బోనాల పండుగ సంస్కృతీ సంప్రదాయాలు కలబోసిన గ్రామదేవతల పండుగిది. బోనాల జాతరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ముస్తాబవుతోంది. ఆగస్టు 4న ఆదివారం బోనాల వేడుకలు జరుపుకొనుటకు మేడిపల్లి లోని శ్రీ వీరాంజనేయ స్వామీ దేవాలయం ఆలయ చైర్మన్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కమీషనర్ త్రిశేశ్వర్ రావు, కార్పొరేటర్లు, కొఆప్షన్ సభ్యులు, పట్టణ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానించారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, గత సంవత్సరం లాగే ఈసారి కూడా బోనాలను అంగరంగవైభవంగా నిర్వహించేందుకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ భారీ ఏర్పాట్లు చేయనుంది. నగర పరిధిలోని అన్ని అమ్మవారి దేవాలయాలకు రంగులు వేయడం, విద్యుద్దీపాలంకరణ, పరిశుభ్రత,మంచి నీరు, తొట్టేల ఊరేగింపు, పార్కింగ్, బందోబస్త్‌తో పాటు పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసేవిధంగా అధికారులకు దిశా నిర్దేశం చేసారు. మతసామరస్యానికి..తెలంగాణ జన జీవన సాంస్కృతిక వైభవానికి ప్రతీకలైన బోనాల పండుగను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలందరూ అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కోరారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ ద్వారా పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నట్లు మేడిపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ గోవింద్ రెడ్డి, కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మద్ది యుగేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి,కొఆప్షన్ సభ్యులు బోడిగే రాందాస్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, బీజేపీ అధ్యక్షులు నెమిలికొండ అనిల్ రెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, బండి సతీష్ గౌడ్, అలవాల దేవేందర్ గౌడ్, జావీద్ ఖాన్, బోడిగే కృష్ణ గౌడ్, యాసారం మహేష్, పాశం బుచ్చియాద వ్, కర్రే బాలరాం, పంగ మహేందర్, పంగ ప్ర ణయ్, శ్రీనివాస్, కిర ణ్, ఆలయ బోర్డు సభ్య లు ఎర్ర ఐలేష్ యాదవ్, జంగచారి,నాగరాజు, పవన్ గౌడ్, ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, కాలనీ అధ్యక్షకార్యదర్శులు, వివిధ దేవాలయాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## శక్తికి స్వరూపం రేణుక ఎల్లమ్మ అమ్మవారు

ఎమ్మెల్యే కె.పి.వివేకానంద



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట డివిజన్ కూన మహాలక్ష్మి నగర్ నందు నిర్వహించిన రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్. మాట్లాడుతూ శక్తికి స్వరూపం అమ్మవారు అని, అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు జీవించాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు హజ్రత్ అలీ, అజం, మహేందర్, బ్రహ్మానందచారి, నాని, ప్రభాకర్, దాసు, విఠల్, మనోజ్, మజ్జి శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, ఎర్ర లక్ష్మయ్య, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గుర్తు తెలియని వృద్దుడి మృత దేహం లభ్యమైన సంఘటన తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుం ది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి బస్టాప్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి సుమారుగా (65) వయస్సు గల వృద్దుడు తుర్కపల్లి బస్టాప్‌లో మృతి చెందాడని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించారు. బస్టాండ్‌లో బిక్షాటన చేస్తూ రాత్రిపూట బస్టాండ్‌లోనే పడుకునేవాడని స్థానికులు తెలిపారు. ఈ వృద్దుడు అనారోగ్యం లేదా ఇతర కారణాల వలన మృతి చెంది ఉండవచ్చని పోలీసులు బావిస్తున్నారు. మృత దేహాన్ని స్వాదీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## పోటీ పరీక్షల్లో రాణించాలి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** విద్యార్థులు పో టీ పరీక్షల్లో సరైన శిక్షణ పొంది ఉన్నత స్థాయిలో రాణించాలని ఉప్పల్ ఎమ్మె ల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్పేట హెచ్‌బికాలనీ డివిజన్‌లోని తిరుమలనగర్ కాలనీలో శ్రీ సాయి ఎడ్యుకేషనల్ అకాడమిని స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కల్సి ఆయన ఆదివారం ప్రారంభించారు. పదేళ్ల క్రితం పదో తరగతి విద్యార్థులకు ట్యూషన్ పేరిట చిన్న స్థాయిలో స్థాపిం చి విద్యార్థులను తీర్చిదిద్దిన నిర్వాహకులు తల్లిదండ్రులు, విద్యార్థుల ఆశాభావాలకు అనుగుణంగా ఎంసెట్, నీట్, ఐఐటి, జెఈఈ దేశ వ్యాప్త పోటీ పరీక్షలకు ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణఇచ్చేస్థాయికి ఎదగటాన్నిఎమ్మెల్యే అభినందించారు

## సీజనల్ వ్యాధులపై అవగాహన

**ప్రజాపక్షం/బోడుప్పల్:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్‌లో ఆర్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమల హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి, కాం గ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పన్నాల శ్రీనివాస్ రెడ్డి, కమల హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆశా అశోక్ కుమార్, ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రా రంభించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి ఉచితంగా బిపి, ఇసిజి, ఊపిరితిత్తుల పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భం గా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆర్‌వి ఫౌండేషన్ స్థాపించి ప్రతి ఏటా చలివేంద్రాలు, ఉచిత వైద్య శిబిరాలు, పేద విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ, రక్తదాన శిబిరాలు వంటి సామాజిక సేవా కార్యక్రమాల ను నిర్వహిస్తున్న తుంగతుర్తి గారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. డాక్టర్ ఆశ అశోక్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బిపి, షుగర్, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా మహిళలకు ఆరోగ్యం ఆహార అలవాట్లపై ప్రత్యేక అవగాహన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని



ప్రజలకు డాక్టర్ ఆశ అశోక్ అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అశోక్ కుమార్, కమల హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కార్తీక్, కమల హాస్పిటల్ జనరల్ మేనేజర్ జోగు నవీన్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ తుంగ ఉపేందర్, పలువురు కాంగ్రెస్ నాయకులు ,మారుతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, కాలనీవాసులు కైలాష్, బాబు,రాజు,ప్రసాద్ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ఘట్కేసర్:** జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1995–1996 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పోచారం మున్సిపాలిటీలోని అన్నోజిగూడ తులిప్స్ హోటల్లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం తమకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. విద్యార్థులు తమ తమ జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని తమ తమ పిల్లలకు ఆస్తులు అంతస్తుల కన్నా ఉన్నతమైన విద్యను మంచి జ్ఞానం అందించడం నిజమైన ఆస్తులని సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులు సుధీర్ రెడ్డి, కృపానందం, సలీం, హనుమంత్ రెడ్డి, రమేష్ కుమార్, పోచి రెడ్డి, భద్రారెడ్డి, లక్ష్మీ నరసమ్మ, సరస్వతి, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** కొన్ని సంవత్సరాల తర్వాత నాటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వికారాబాద్ జిల్లా దారూర్ మండలం కుక్కిందలో గ్రామంలో 2003–04 బ్యాచ్ కి సంబంధించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చాలా రోజుల తర్వాత కలుసుకోవడంతో పూర్వవిద్యార్థులు గత స్మృతులు గుర్తు చేసుకోని ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి గురించి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించి గౌరవించారు. విద్య బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్, సోమశేఖర్ లతోపాటు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన మామిండ్ల శ్రీనివాస్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కేంద్రహోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆయన నివాసం కరీంగనగర్‌లో మేడ్చల్ జిల్లా మున్నూరుకాపు సంఘం గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజావసరాల దృష్ట్యా ప్రజల సమస్యలపై ప్రతి ఒక్కరు పనిచేయాలని అన్నారు. అనంతరం మున్నురుకాపు సంఘం మేడ్చల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్ కేంద్రహోం సహాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన బండి సంజయ్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షుడు కుత్బుల్లాపూర్ సదానందం, రాజ్‌కుమార్, నర్సింగ్, నవీన్, మున్నురుకాపు కులసోదరులు పాల్గొన్నారు.

## మృత్యు ఘోషను తలపిస్తున్న కొత్తూరు వైజంక్షన్

**ప్రజాపక్షం/కొత్తూరు:** బెంగళూర్‌హైదారాబాద్ 44వ జాతీయ రహదారి కొత్తూరు వై జంక్షన్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారిపోయింది. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుండటం..ఎటు నుండి ఏ వాహనం వచ్చి ఢీకొంటుందోననే భయంలో ప్రయాణికులు, ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రజలు రోడ్డు ప్రమాదాల భారిన పడి మృత్యుఘోష తలపిస్తుంటే అధికారులు మాత్రం నియంత్రణ చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమైందని ప్రయాణిలు ఆరోపిస్తున్నారు. ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మించినప్పటికి ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని, చిన్నపాటి వర్షం వస్తే చాలు చెరువును తలపిస్తుందని మున్సిపల్ ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు ప్రమాదాల నుండి రక్షించండి మహా ప్రభో అంటూ వాహనదారులు అధికారులను వేడుకుంటున్నారు. శంషాబాద్ నుండి కొత్తూరు వద్దకు చేరుకొగానే ప్రయాణికుల్లో, ప్రజల్లో తీవ్ర భయం నెలకొంటుంది. ఎటు నుండి ఏ వాహనం వచ్చి ఢీకొంటుందోననే భయంలో ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ప్రయాణాలను కొనసాగిస్తున్నారు. 44వ జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణ సమయంలో సంబంధిత శాఖ అధికారులు చేసి తప్పిదాల వల్లనే నేడు కొత్తూరు వైజంక్షన్ స్పాంట్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారి విస్తరణ సమయంలో గ్రామాల వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించి నిర్మించి ఉంటే ప్రమాదాలు చోటు చేసుకునేవి కావని, ఈ వైజంక్షన్ కారణంగా అనేక మంది ప్రమాణాలు గాలిలో కలిసి పోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైజంక్షన్ సమీపంలోనే అండర్‌పాస్ నిర్మించాలని ఆందోళన చేస్తే ఎన్‌హెచ్1 అధికారులు రూ.17కోట్లతో అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. కానీ అది వాహనదారులకు ఎలాంటి ఉపయోగకంగా లేకుండా పోయిందని వాహనదారులు మండిపడుతున్నారు. అండర్‌పాస్ నిర్మాణ డీజైన్‌లో లోపాలు ఉండటంతోనే వర్షపునీరు నిలుస్తుందని, దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గత ఏడాది నుంచే అండర్‌పాస్ ప్రారంభించినప్పటికి ఫలితం లేకుండా పోయిందని అంటున్నారు. నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు ఇటీవల కాలంలో పైపులు ఏర్పాటు చేసి మోటర్ సహాయంతో బయటకు నీటిని పంపిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో కోతలు ఏర్పడటంతో నీటిని తరలించడంలో కొంత జాప్యం అనేది ఏర్పడుతుందని వాహనదారులు అంటున్నారు.

**కొత్తూరు వైజంక్షన్‌లో ప్రమాదాలు ఇలా..**

రోడ్డు ప్రమాదాలకు కొలువైన వైజంక్షన్‌లో నిత్యం చోటు చేసుకుంటున్నాయి. కొత్తూరు మున్సిపాలిటికి అనుకొని ఉన్న 44వ జాతీయ రహదారి ఉండటంతో వాహరాల రద్దీ కూడా అదే విధంగా ఉంటుంది. కొత్తూరు సమీపంలో పారిశ్రామిక ప్రాంతం ఉండటంతో భారీ వాహనాలు పెద్ద ఎత్తున వచ్చి వెళ్తుంటాయి. అదే విధంగా హైదారాబాద్ నుండి కొత్తూరు మీదుగా షాద్‌నగర్ నియోజవకవర్గంలోని వివిధ ప్రాంతాలకు, పరిశ్రమలకు భారీ, చిన్న వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటాయి. అంతరాష్ట్ర రహదారులు కర్ణాటక, మహారాష్ట్రతోపాటు పరిగి, వికారాబాద్, తాండూరు వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే కొత్తూరు వైజంక్షన్ దాటి వెళ్ళాల్సిందే.

**ఆరు నెలల్లోనే 10మంది మృత్యువాత**

గడిన ఆరు నెలల్లోనే సుమారు 10మంది వాహనదారులు మృత్యువాత పడినట్లు పోలీసుల రికార్డులు తెలుపుతున్నాయి. క్షతగాత్రుల సంఖ్య మాత్రం ఎక్కువగానే ఉంటుందని చెప్పవచ్చు. ఎన్‌హెచ్1అధికారులు చేసిన చిన్న



తప్పిదంతోనే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, దాంతో ఎంతో మంది అనాథలు, కుటుంబ పెద్దలను కొల్పోవల్సి వస్తుందని అంటున్నారు.

**వైజంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటుకు కృషి చేస్తాం**
**–షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

కొత్తూరు మున్సిపాలిటి పరిధిలో ఉన్న వై జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులతో చర్చించడం జరిగిందని, మరోవారు వారి దృష్టికి తీసుకువెళ్ళి త్వరగా పనులు చేపట్టేందుకు కృషి చేసే విధంగా చూస్తామని తెలిపారు.

**వై జంక్షన్ వద్ద బారికేడ్లతో మూసివేశాం:** రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే వై జంక్షన్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ వివరించారు. హైదారాబాద్ నుండి కొత్తూరు మీదుగా షాద్‌నగర్ వచ్చే వాహదారులు అండర్‌పాస్ నుండి రావాల్సిందేనని, వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ట్రాఫిక్ నిలిచిపోకుండా ఉండేందుకు ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేశామని తెలిపారు.

# క్రీడ

# సంజూ అర్ధశతకం

## జింబాబ్వేపై టీమ్‌ఇండియా ఘన విజయం

## 4-1తో ముగిసిన సిరీస్



**హరారే :** జింబాబ్వేతో 5 టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగిన చివరి మ్యాచ్‌లోనూ భారత్ ఘన విజయం సాధించింది. 42 పరుగుల భారీ తేడాతో ప్రత్యర్థిని చిత్తు చేసి.. 4—1 తేడాతో సిరీస్‌ను ముగించింది. ఇప్పటికే సిరీస్ టీమ్ ఇండియా వశంకాగా.. నామమాత్రపు ఐదో మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. తొలుత 168 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన భారత్.. ప్రత్యర్థిని 18.3 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌట్ చేసింది. లక్ష్య ఛేదనకు దిగిన జింబాబ్వేకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ముఖేశ్ కుమార్ వేసిన తొలి ఓవర్ మూడో బంతికే ఓపెనర్ వెస్లీ (0) బౌల్డయ్యాడు. తొలిడౌన్‌లో వచ్చిన బ్రియాన్ (10)తో కలిసి మరో ఓపెనర్ మరుమని (27) ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశాడు. అయితే, వాషింగ్టన్ సుందర్ బౌలింగ్‌లో మరుమని ఎల్‌బిడబ్ల్యుగా పెవిలియన్‌కు చేరాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో శివం దుబేకు క్యాచ్ ఇచ్చి బ్రియాన్ వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. చివర్లో అక్రమ్ (27) కాస్త ఫర్వేలేదనిపించాడు. భారత్ బౌలర్లలో ముఖేశ్ కుమార్ 4 వికెట్లు పడగొట్టగా.. శివం దుబే 2, తుషార్, వాషింగ్టన్ సుందర్, అభిషేక్ శర్మ తలో వికెట్ తీశారు.

**ఎదురుదెబ్బ తగిలినా..**

తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియాకు ప్రారంభంలో కఠిన పరిస్థితులు ఎదురైనప్పటికీ.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. సంజు శాంసన్ (58; 45 బంతుల్లో 1x4, 4x6) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. తొలి ఓవర్లోనే ఓపెనర్ యశస్వి జైశ్వాల్ (12; 5 బంతుల్లో 2x6) రజా బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. తొలి డౌన్‌లో వచ్చిన అభిషేక్ శర్మ (14; 11 బంతుల్లో 1X4,1X6) పెద్దగా రాణించలేకపోయాడు. ముజరబాణి బౌలింగ్‌లో క్లైవ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. మరో ఓపెనర్ గిల్ (13; 14 బంతుల్లో 2x4), రెండో డౌన్‌లో వచ్చిన శాంసన్‌తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించే ప్రయత్నం చేశాడు. కానీ, ఈ జోడీని రిచర్డ్ విడగొట్టాడు. జట్టు స్కోరు 40 పరుగుల వద్ద రజాక్‌కు క్యాచ్ ఇచ్చి.. గిల్ పెవిలియన్‌కు చేరాడు. ఐదు ఓవర్ల లోపే కీలకమైన మూడు వికెట్లు కోల్పోవడంతో భారత్ జోరు తగ్గింది. రియాన్ పరాగ్ (22)తో కలిసి శాంసన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. క్రీజులో నిలదొక్కుకుంటూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాదుతూ.. బౌలర్లపై కాస్త ఒత్తిడి పెంచాడు. అయితే, 30 పరుగుల వ్యవధిలోనే వీరిద్దరూ ఔటయ్యారు. అప్పటికి జట్టు స్కోరు 135. చివర్లో శివం దుబే (26), రింకూ సింగ్ (11) కాస్త దూకుడుగా ఆడటంతో భారత్ మంచి స్కోరే చేసింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబాణి 2 వికెట్లు పడగొట్టగా.. సికిందర్, రిచర్డ్, బ్రాండన్ తలో వికెట్ తీశారు.

# భళా అల్కరాస్

## జకోవిచ్‌ను ఓడించి రెండోసారి వింబుల్డన్ టైటిల్ కైవసం



**స్పెయిన్ :** యంగ్ ప్లేయర్ కార్లోస్ అల్కరాస్ వింబుల్డన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో స్టార్ ప్లేయర్ నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. 24 గ్రాండ్ స్లామ్‌లు గెలిచిన జకోవిచ్‌పై 6—2, 6—2, 7—6 (7—4)తో గెలుపొందాడు. తొలి రెండు సెట్‌లను ఈజీగా గెలిచినప్పటికీ, మూడో సెట్‌లో ఇద్దరి మధ్య గట్టి పోటీ నెలకొంది. 66తో మూడో సెట్ సమం కావడం వల్ల మ్యాచ్ ట్రై బ్రేకర్‌కు చేరుకుంది. అందులో కార్లోస్ 7—4తో జకోవిచ్‌ను ఓడించాడు. దీంతో వరుసగా రెండోసారి వింబుల్డన్ విజేతగా అల్కరాస్ చరిత్రకెక్కాడు. టోర్నీ మొదటి నుంచే అల్కరాస్ చాలా కాన్ఫిడెంట్‌గా ఆడాడు. తన మూవ్స్‌తో ప్రత్యర్థులను కట్టుబెట్టాడు. సెమీఫైనల్స్‌లో ఎనర్జిటిక్‌గా ఆడి రష్య ఆటగాడు డానిల్ మెద్వెదేవ్‌ను ఓడించిన ఈ యంగ్ స్టార్, ఆదివారం స్పెయిన్ కోర్టు వేదికగా జరిగిన పోరులో చెలరేగిపోయాడు. మొదటి సెట్ నుంచి నుంచి జోరుగా ఆడి గెలుపొందాడు. ఇక అదే ఊపు మీద రెండో సెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సెట్ తర్వాత జకోవిక్ కాస్త ఒత్తిడిలో పడిపోయాడు. కానీ కాసేపటికే వేగం పుంజుకొని జకోవిచ్ నిలదొక్కుకున్నాడు. దీంతో మూడో సెట్ కాస్త ఉత్కంఠగా సాగింది. అయితే నువ్వా నేనా అంటూ సాగిన ఈ గేమ్‌లో ఆఖరివరకూ పోరాడి టైటిల్‌ను ముద్దాడాడు అల్కరాస్. దీంతో వరుసగా రెండోసారి వింబుల్డన్ విజేతగా నిలిచాడు. అయితే గతేడాది జరిగిన వింబుల్డన్ ఫైనల్‌లోనూ అల్కరాస్ జకోవిచ్‌ను ఓడించాడు.

# అలా చేసింది నేనే

## అందరూ మర్చిపోయినట్లు ఉన్నారుగా : సౌరభ్ గంగూలీ



**న్యూఢిల్లీ :** టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్, బిసిసిఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతున్నాయి. తనపై కామెంట్ చేసే విమర్శకులపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. వారందరూ ఓ విషయం గురించి మర్చిపోయారంటూ వ్యాఖ్యానించాడు. టీ20 ప్రపంచప్ గెలుపుతో దేశమంతా సంబరాలు చేసుకున్నారని, ఆ ఖ్యాతిని కొనియాడుతున్నారని అన్నాడు. అయితే ఈ విజయానికి వెనక ఉన్న రోహిత్ శర్మను టీమ్ ఇండియా కెప్టెన్‌గా చేసిన తనను మాత్రం అందరూ మర్చిపోయారంటూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు. 'రోహిత్ శర్మకు నేను టీమ్‌ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు అందించినప్పుడు అందరూ నన్ను విమర్శించారు. ఇప్పుడు అతడి సారథ్యంలోనే భారత్ టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది. దీంతో అందరూ నన్ను విమర్శించడం మానేశారు. అందరూ ఆ విషయాన్ని మరచిపోయారని నేను అనుకుంటున్నా. రోహిత్‌ను భారత జట్టుకు కెప్టెన్‌గా నియమించింది నేనే' అంటూ గంగూలీ అన్నాడు.

# దేవర లీక్స్‌తో జాగ్రత్తలు.!

# రీల్




మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ (Janhvi Kapoor) టాలీవుడ్ డెబ్యూ ఇస్తూ చేస్తున్న లేటెస్ట్ అవైటెడ్ సినిమానే దేవర. మరి దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై గట్టి అంచనాలు నెలకొనగా ఇప్పుడుకే వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ తో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ సినిమా విషయంలో ఇటీవల కొన్ని లీకులు బయటికి బయటకి వచ్చిన సంగతి తెలిసిందే.

ఆన్ లోకేషన్ నుంచే పలు వీడియోలు బయటకి వచ్చేసాయి. అలాగే రీసెంట్ గా ఓ డైలాగ్ కూడా దేవర సినిమా లోనిదే అంటూ ఓ లైన్ కూడా వైరల్ అయ్యింది. దీనితో ఈ లీక్స్ విషయంలో మేకర్స్ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టుగా తెలుస్తుంది. ఇక నుంచి డైలాగ్స్ కానీ ఎలాంటి విజువల్స్ కూడా బయటకి రాకుండా పటిష్టమైన సూచనలు కొరటాల అందిస్తున్నాడట.

మరి ఇప్పుడు ఉన్న సమయంలో ఎంత జాగ్రత్తగా ఉంటున్నప్పటికీ ఏదో కలా లీక్స్ బయటకి వచ్చేస్తున్నాయి. మరి ముందు రోజుల్లో అయినా దేవర నుంచి ఆగుతాయో లేదో చూడాలి.

## డార్లింగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ కు హీరో నాని!




టాలీవుడ్ నటుడు, కమెడియన్ ప్రియదర్శి మరియు నభా నటేష్ ప్రధాన జంటగా నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ డార్లింగ్. జూలై 19, 2024న థియేటర్లలోకి రానున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. అశ్విన్ రామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇప్పటికే ఈ చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇటీవల రిలీజైన ట్రైలర్ సినిమాపై మరింత ఆసక్తి కలిగించే విధంగా ఉంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ ను వేగవంతం చేయడం జరిగింది.

అందులో భాగంగా ప్రీ రిలీజ్ ఈవెంట్ ను ప్లాన్ చేయడం జరిగింది. జూలై 15 సోమవారం రోజున హైదరాబాద్ లోని పార్క్ హయాత్ లో ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకకి నాచురల్ స్టార్ నాని ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అనన్య నాగళ్ల, మోయిన్, శివా రెడ్డి, మురళీధర్ గౌడ్, బ్రహ్మానందం, కళ్యాణి రాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని ప్రైమ్షో ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై కె. నిరంజన్ రెడ్డి మరియు చైతన్య రెడ్డి నిర్మించారు. ఈ చిత్రానికి వివేక్ సాగర్ సంగీతం అందించారు.

## 'రాజ్ తరుణ్ ప్రేయసి' సంచలన కామెంట్స్



యంగ్ హీరో రాజ్ తరుణ్ తనను మోసం చేశాడంటూ 'రాజ్ తరుణ్ ప్రేయసి' లావణ్య ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికితోడు లావణ్య ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేయడం, పోలీసులు ఆమె ఇంటికి వెళ్లి రక్షించడంతో ఈ వ్యవహారం మొత్తానికి హాట్ టాపిక్ గా మారింది. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ..నా న్యాయ పోరాటాన్ని కొనసాగిస్తాను. రాజ్ తరుణ్ నాకు కావాలి. తను లేని ఈ జీవితం నాకు వద్దు. తన కోసమే నేను ఫైట్ చేస్తున్నాను. నేను డిప్రెషన్లో ఉన్నాను అందుకే చనిపోవాలి ప్రయత్నం చేశాను.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'మరోవైపు నేను పెట్టిన కేసును వెనక్కి తీసుకోమని తరచూ నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. నాకు ప్రాణహాని ఉంది. రాజ్ తరుణ్ మేనేజర్, లాయర్ నాతో మాట్లాడారు. రూ. 5 కోట్లు ఇస్తాము ఈ కేసు రిటర్న్ తీసుకోమని ఆఫర్ చేశారు. నాకు రాజ్ తరుణ్ కావాలి. తను నా దగ్గరికి రాకపోతే, నేను ప్రాణాలతో ఉండను. ఈ కేసు విషయమై నేను 'మా' అసోసియేష్కి వెళ్తాను. అవసరమైతే అమరణ నిరాహార దీక్ష చేస్తాను' అని లావణ్య చెప్పుకొచ్చింది.

## ధనుష్ రాయన్ ట్రైలర్‌కు డేట్ ఫిక్స్!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న లేటెస్ట్ మూవీ రాయన్. ఈ చిత్రం ధనుష్ కెరీర్ లో 50 వ చిత్రంగా తెరకెక్కింది. జూలై 26, 2024 న వరల్ వైడ్ గా థియేటర్లలో రిలీజ్ కి రెడీ అయి-పోయిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ డేట్ దగ్గర పడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ ను వేగవంతం చేయడం జరిగింది. ఈ చిత్రం నుండి ట్రైలర్ ను విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఈ చిత్రం ట్రైలర్ ను జూలై 16 వ తేదీన రిలీజ్ చేయనున్నారు. ఇదే విషయాన్ని సరికొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు. SJ సూర్య, సందీప్ కిషన్, సెల్వరాఘవన్, ప్రకాష్‌రాజ్, దుషార విజయన్, అపర్ణా బాలమురళి, వరలక్ష్మి శరత్కుమార్, జయరామ్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు విన్నర్ ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించారు. సన్ పిక్చర్స్ బ్యానర్ కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎదురు చూస్తున్నారు.




# లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేతగా గౌరవ్ గగొయ్



## చీఫ్ విప్‌గా సురేష్, విప్‌లుగా మాణిక్కం ఠాకూర్, జావెద్

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేతగా గౌరవ్ గగొయ్‌ని ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు లేఖను స్పీకర్ ఓమ్ బిర్లాకు పంపింది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత, చీఫ్ విప్, మరో ఇద్దరు విప్‌ల నియామకానికి సంబంధించి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ లోక్‌సభ స్పీకర్ ఓమ్ బిర్లాకు లేఖ ద్వారా సమాచారం అందించినట్లు ఎఐసిసి జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేతగా గగోయ్ నియామకం కాగా, పార్టీ చీఫ్ విప్‌గా కేరళ నుంచి ఏడుసార్లు ఎంపిగా ఎన్నికైన కొడికున్నిల్ సురేష్‌ను నియమించినట్లు ఆయన చెప్పారు. విరుధునగర్ ఎంపి మాణిక్కం ఠాకూర్, కిషన్‌గంజ్ పార్లమెంట్ సభ్యుడు మహమ్మద్ జావెద్ పార్టీ విప్‌గా నియమితులైనట్లు వేణుగోపాల్ తెలిపారు. అంతకు ముందు రాహుల్ లోక్‌సభలో ప్రతిపక్షనేతగా నియమితులైనట్లు తెలిసిందే.

# ఎక్స్‌లో 100 మిలియన్ల ఫాలోవర్స్



## ప్రపంచ నేతల్లో మోదీయే టాప్!

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన ఫీట్ సాధించారు. మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌లో ఆయన్ను అనుసరిస్తున్న వారి సంఖ్య 100 మిలియన్ల (10 కోట్లు) దాటింది. గతంలో తనను ఫాలోవర్స్ విషయంలో కొత్త రికార్డు నెలకొల్పిన మోదీ, ఇప్పుడు ఆ రికార్డును ఆయనే బద్దలుగొట్టారు. దీనిపై ప్రధాని మోదీహర్షం వ్యక్తం చేశారు. ఎక్స్‌లో ఉండటం, ఈ సామాజిక మాధ్యమం వేదికగా చర్చలు, ప్రజల ఆశీర్వాదాలు, నిర్మాణాత్మక విమర్శలు తదితర వాటికి ఆదరణ లభిస్తుండటం సంతోషంగా ఉందని చెప్పారు. భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని పోస్ట్ చేశారు. 2009లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీ ట్విట్టర్ వినియోగించడం ప్రారంభించారు. అనతికాలంలోనే 2010లో ఆయన లక్ష మంది ఫాలోవర్లను సంపాదించుకున్నారు. ప్రస్తుత ప్రపంచ నేతల్లో ఎవరికీ ఈ స్థాయి ఆదరణ లేదు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు ఎక్స్‌లో 38.1 మిలియన్ల మంది ఫాలోవర్లు ఉన్నారు.

# కేజ్రీవాల్ 8.5 కేజీల బరువు తగ్గారు..

## ఆరోగ్యంపై ఆప్ ఆందోళన




**న్యూఢిల్లీ :** మద్యం విధానం కేసులో అరెస్టయి జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆప్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఆయన ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని పేర్కొంది. ఢిల్లీ మంత్రి ఆతిశీ ఆదివారం మీడియాతో మాట్లాడారు. కేజ్రీవాల్‌కు తీవ్ర మధుమేహం ఉందని, ప్రమాదకర స్థాయికి చక్కెర స్థాయిలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 'నకిలీ కేసులో బిజెపి కేజ్రీవాల్‌ను కుట్రపూరితంగా జైలులో పెట్టింది. అతని ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం ఉంది. బరువు 8.5 కిలోలు తగ్గారు. నిద్రలో ఆయన చక్కెర స్థాయిలు ఐదుసార్లు 50 కంటే తక్కువకు పడిపోయాయి. మధుమేహులకు ఇది ఆందోళన కలిగించే పరిస్థితి. జైలులో ఉన్నందున సరైన వైద్య సహాయం పొందలేకపోతున్నారు. కేజ్రీవాల్ స్ట్రోక్‌కు గురైనా, మెదడు దెబ్బతిన్నట్లయితే ఎవరు బాధ్యత వహిస్తారు?' అని ఆతిశీ ప్రశ్నించారు. ఈ అంశంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశంపై విలేకర్లు ప్రశ్నించగా.. దీనిపై న్యాయవాదులు, వైద్యులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఒకవేళ కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే.. ఈ దేశం మాత్రమే కాదు.. దేవుడు కూడా క్షమించరని బిజెపి తెలుసుకోవాలని ఆతిశీ అన్నారు.

# మహారాష్ట్ర సిఎంతో ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



**ముంబయి:** మహారాష్ట్ర పర్యటనలో ఉన్న ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే తో భేటీ అయ్యారు. తన అధికారిక నివాసమైన వర్షకు విచ్చేసిన చంద్రబాబుకు షిండే సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిస్థితులు, పలు రంగాల్లో పరస్పర సహకారం, మౌలికవసతుల అభివృద్ధి, పలు ఆర్థిక అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఇద్దరు సిఎంల మధ్య దాదాపు అరగంట పాటు చర్చలు కొనసాగినట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో భేటీకి సంబంధించిన ఫొటోలను సిఎం ఏక్‌నాథ్ షిండే తన 'ఎక్స్'లో షేర్ చేసుకున్నారు. ఇరు రాష్ట్రాలు పరస్పర సహకారం ద్వారా అభివృద్ధిని ఎలా సాధించవచ్చనే అంశాలపై ప్రధానంగా చర్చించినట్లు షిండే పేర్కొన్నారు. ఈ భేటీలో కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, మహారాష్ట్ర పీడబ్ల్యూడీ మంత్రి దాదా భుసే, షిండే తనయుడు, ఎంపీ శ్రీకాంత్ షిండే ఉన్నారు. ఇరు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ రంగంలో అవకాశాల విస్తరణ తదితర అంశాలపైనా చర్చించినట్లు సమాచారం. టిడిపి, శివసేన (షిండే) పార్టీలు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న విషయం తెలిసిందే.

# నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి



**కాఠ్మాండూ :** నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి నియమితులయ్యారు. అంతకుముందు ప్రధానిగా ఉన్న పుష్పకమల్ దహల్ అలియాస్ ప్రచండ(69) నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం ఇటీవల కుప్పకూలిన విషయం తెలిసిందే. పార్లమెంటులోని ప్రతినిధుల సభలో శుక్రవారం నిర్వహించిన విశ్వాస పరీక్షలో ప్రచండ ఓడిపోయారు. ఈ క్రమంలోనే కె.పి.శర్మ ఓలి (72) నేతృత్వంలోని సీపీఎన్‌యూఎంఎల్, మరో మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా సారథ్యంలోని నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ)ల కూటమి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే 165 మంది సభ్యుల (సీపీఎన్‌యూఎంఎల్ 77, ఎన్‌సీ 88) సంతకాలను ఓలి సమర్పించారు. కాగా, 275 సీట్లున్న సభలో విశ్వాస తీర్మానం నెగ్గడానికి 138 ఓట్లు కావాల్సి ఉండగా, ప్రచండకు అనుకూలంగా 63 ఓట్లు మాత్రమే వచ్చాయి. 194 ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. దీంతో ప్రచండ ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. కొత్త ప్రధానిగా ఓలిని దేశ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ నియమించారు. ఓలితో పాటు కొత్త మంత్రివర్గం సోమవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. కొన్ని రోజుల క్రితమే ఓలి, దేవ్‌బాల మధ్య అధికారాన్ని పంచుకోవడంపై ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తొలి 18 నెలలు ఓలి ప్రధానిగా ఉంటారు. ఆయన ఇదివరకు రెండుసార్లు ప్రధానిగా పనిచేశారు. ఆ తర్వాత పార్లమెంటు గడువు ముగిసేవరకూ దేవ్‌బా ప్రధానిగా కొనసాగుతారు.

# ఎల్‌ఒసి వెంబడి కాల్పులు..

## ముగ్గురు ఉగ్రవాదుల హతం



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లోని భారత్ పాక్ సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) మీదుగా భారత్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఉగ్రవాదులను భద్రతాబలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. చొరబాటు వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతున్నట్లు ఆర్మీ ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు మృతి చెందిన వారు ఏ ఉగ్రసంస్థకు చెందిన వారన్నదానిపై స్పష్టత లేదు.

# అతి విశ్వాసమే దెబ్బ తీసింది..

## లోక్ సభ ఫలితాలపై సిఎం యోగి ఆదిత్యనాథ్ సంచలనంవ్యాఖ్య



**లక్నో :** లోక్ సభ ఎన్నికల్లో ప్రతిపక్షాల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మారని అందుకే లోక్ సభ ఫలితాల్లో బిజెపి వెనకబడిందని యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. యుపిలో ఆదివారం జరిగిన బిజెపి వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలుపుపై అతి విశ్వాసం పెట్టుకోవడం వల్లే బిజెపి దెబ్బ తిందని.. మునుపటి ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని మాత్రమే పొందగలిగిందన్నారు. 'ప్రధాని మోదీ నేతృత్వంలో బిజెపి సమర్థంగా పని చేసింది. 2014 నుంచి ఇటీవల జరిగిన ఎన్నికల వరకు ప్రతిపక్షాలను ధీటుగా ఎదుర్కొన్నాం. 2014లో మనకు వచ్చిన ఓట్ల శాతంతోనే 2024లోనూ విజయం సాధించాం. కానీ ఈ సారి చాలా మార్పు వచ్చింది. ఓట్ల శాతాన్ని తిరిగి పొందినప్పటికీ, విపక్షాల ఓట్ల శాతం పెరిగింది. గెలుపుపై అతి విశ్వాసమే దీనికి కారణం అనడంలో సందేహం లేదు. ఇకపై ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా పని చేయాలి. ప్రతి కార్యకర్త కష్టంలో నాయకులు వెంటే ఉండాలి. ఉత్తరప్రదేశ్‌లో మన ప్రభుత్వం శాంతిభద్రతలను పరిరక్షిస్తోంది. విపక్షాలు హింసను ప్రేరేపించాలని చూసినా డబల్ ఇంజిన్ సర్కార్ వాటిని తిప్పికొట్టింది'' అని యోగి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇటీవలే జరిగిన 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి 10 సీట్లు, స్వతంత్ర అభ్యర్థి ఒక చోట గెలవగా, బిజెపి 2 స్థానాల్లోనే గెలుపొందింది. ఈ ఫలితాల తరువాత యోగి చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశం అయ్యాయి.

# కర్ణాటకలో పది వేలకు చేరిన డెంగీ కేసులు




**బెంగళూరు:** కర్ణాటకలో డెంగీ వ్యాధి మరింతగా వ్యాపిస్తోంది. కేసుల సంఖ్య పది వేలకు చేరుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు 9,000కుపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధి బారిన పడి ఇప్పటి వరకు ఏడుగురు మరణించారు. జులై 13 వరకు 66,298 మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9,082 మందికి పాజిటివ్‌గా తేలింది. గత 24 గంటల్లో 2,557 మందిని పరీక్షించగా, 424 మందికి డెంగ్యూ పాజిటివ్‌గా నమోదైంది. జ్వరం వల్ల 353 మంది ఆసుపత్రిలో చేరారని, వారిలో 119 మంది గత 24 గంటల్లో ఆసుపత్రి పాలయ్యారని వైద్యాధికారులు తెలిపారు. కాగా, జనవరి నుంచి జులై 13 వరకు రాజధాని బెంగళూరు ప్రాంతాల్లో 2,830 డెంగీ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా 110 మంది ఆసుపత్రి పాలయ్యారు. గత 24 గంటల్లో కొత్తగా 202 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చిక్కమగళూరులో జులై 13 వరకు 599 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా నమోదైన కేసుల్లో రెండో స్థానంలో ఈ నగరం ఉంది. 5,725 మంది పెద్దలకు డెంగ్యూ పరీక్ష నిర్వహించగా 18 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. అలాగే సంవత్సరం నుంచి 18 ఏళ్ల లోపు వయస్సున్న 3,203 మంది పిల్లలు, ఏడాది లోపు వయస్సున్న 154 మంది శిశువులకు కూడా డెంగీ పరీక్షలు నిర్వహించినట్టు, వైద్య అధికారులు వెలడించారు.